




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



నందిగ్రామ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మమత మద్దతు 07
ఆస్కార్‌కు 'గోంధల్' ఎంపిక
ప్రమాదవశాత్తు తుపాకి పేలి ఆర్‌ఐ మృతి 03



సంపుటి 09, సంచిక: 289 | శనివారం | 19 -09-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# దానం నాగేందర్‌పై అనర్హత వేటు



● శాసన సభ్యత్వం రద్దుచేసిన హైకోర్టు ● ఖైరతాబాద్ ఎమ్మెల్యేపై అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ స్పీకర్ ఆదేశాలను తోసిపుచ్చిన డివిజన్ బెంచ్ ● 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన నాటి నుంచే నాగేందర్ ఎమ్మెల్యేగా అనర్హుడని తీర్పు ● ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేసింది. ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దుచేయాలని బిఆర్‌ఎస్, బిజెపి వేసిన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ అసెంబ్లీ స్పీకర్ (ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో) ఇచ్చిన ఆదేశాలను డివిజన్ బెంచ్ రద్దు చేసింది. గత లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేసిన 2024, ఏప్రిల్ 23 నుంచే దానం నాగేందర్ తెలంగాణ శాసనసభ సభ్యుడిగా అనర్హుడని ప్రకటించింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు స్పష్టం చేసింది. తీర్పు ప్రతులను అసెంబ్లీ స్పీకర్ కార్యదర్శికి, కేంద్ర ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లను అనుమతిస్తూ చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఈ తీర్పు వెలువరించింది. బిఆర్‌ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ అదే సభ్యత్వంలో కొనసాగుతూనే కాంగ్రెస్ బి–ఫారం తీసుకుని 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి పోటీ చేయడం పదో షెడ్యూల్ కింద అనర్హతకు దారితీస్తుందని ధర్మాసనం పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(2), పదో షెడ్యూల్‌లోని 2(1)(ఎ) నిబంధనల ప్రకారం మరో పార్టీ తరఫున చట్టసభ ఎన్నికల్లో అభ్యర్థిగా నిలవడం, ముఖ్యంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూ కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభకు పోటీ చేయడం పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లుగా తరువాయి 8లో

### సుప్రీంకోర్టుకు వెళ్లను : దానం

నా శాసనసభ్యత్వంపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును స్వాగతిస్తున్నానని, ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించే విషయంపై ఇంకా ఆలోచించలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. తనపై అనర్హత వేటు వేయడంపై శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన స్పందించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో పోటీకి తాను సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. 'ప్రజాక్షేత్రంలోనే, ఎన్నికల్లోనే అన్ని విషయాలు తేల్చుకుంటా. నాకు ఎన్నికల్లో పోటీ చేయడం కొత్తేమీ కాదు. అనేక పోరాటాల ద్వారానే నేను ఈ స్థాయికి చేరుకున్నాను. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజల మద్దతుతో పోరాడి విజయం సాధిస్తాను' అని దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు.

## టిజిఎస్ ఆర్‌టిసిలో గుర్తింపు సంఘం

# ఎన్నికల నగారా

### అక్టోబర్ 9న పోలింగ్.. 17న ఫలితాలు

● షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర కార్మిక శాఖ
● ప్రవర్తన నియమావళిని జారీ చేసిన ఆర్‌టిసి యాజమాన్యం
● పదేళ్ల తరువాత సంస్థలో తొలిసారి ఎన్నికలు


ప్రజాపక్షం/హైదరాబాద్

దాదాపు పదేళ్ల తర్వాత తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (టిజిఎస్ ఆర్‌టిసి)లో గుర్తింపు యూనియన్ ఎన్నికలకు నగారా మోగింది. గుర్తింపు యూనియన్ ఎన్నికలు అక్టోబర్ 9వ తేదీన రహస్య బ్యాలెట్ విధానంలో జరగనున్నాయి. అక్టోబర్ 17న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర కార్మిక శాఖ శుక్రవారం ఆర్‌టిసిలో గుర్తింపు యూనియన్ ఎన్నికల షెడ్యుల్‌ను విడుదల చేసింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రవర్తన నియమావళిని కూడా తరువాయి 8లో



### ఎన్నికల షెడ్యూల్

| | |
|---|---|
| సెప్టెంబర్ 21: | ఎన్నికల్లో పోటీ చేసే యూనియన్ల అంగీకారం తెలియజేయాలి |
| సెప్టెంబర్ 22: | డిపో మేనేజర్లు ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితాను డిసిఎల్‌లకు సమర్పణ |
| సెప్టెంబర్ 24: | ఓటర్ల జాబితాపై యూనియన్ల నుంచి అభ్యంతరాల స్వీకరణ |
| సెప్టెంబర్ 25: | అభ్యంతరాల పరిష్కారం, తుది ఓటర్ల జాబితా ప్రచురణ |
| సెప్టెంబర్ 26: | పోటీ చేసే యూనియన్లకు ఎన్నికల గుర్తుల కేటాయింపు |
| సెప్టెంబర్ 29: | డమ్మీ బ్యాలెట్ పేపర్ల పంపిణీ |
| అక్టోబర్ 09: | పోలింగ్ (ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు) |
| అక్టోబర్ 14, 15: | పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ |
| అక్టోబర్ 17: | ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన |




## 22ఎ భూ సమస్యలకు..

# ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

● చైర్మన్‌గా సిసిఎల్‌ఎ కమిషనర్ లోకేశ్‌కుమార్, సభ్యులుగా పాపిరెడ్డి, రాజీవ్‌గాంధీ, హన్మంతు ● శాసనసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటన ● ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు మెమో జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో ఏళ్ల తరబడిగా నలుగుతున్న సెక్షన్ 22ఎ నిషేధిత భూముల జాబితా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో చేసిన ప్రకటనకు అనుగుణంగా, 22ఎ పరిధిలోని అన్ని అంశాలను ఫాస్ట్ ట్రాక్‌లో పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శాసనసభ వేదికగా శుక్రవారం ప్రత్యేకంగా ప్రకటించారు. ఇందుకు సంబంధించి జి.ఓ.ఆర్.టి. నెంబర్ 564ను ప్రభుత్వం జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ హై లెవల్ కమిటీకి సిసిఎల్‌ఏ కమిషనర్ డి.ఎస్. లోకేశ్ కుమార్‌ను చైర్మన్‌గా నియమించగా, లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా వ్యవహరించనున్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా పరిశీలించి, 22ఎ నిషేధిత భూముల జాబితాకు సంబంధించిన అంశాలపై సత్వర పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు మంత్రి తెలిపారు. మల్కాజిగిరి ఎంపిగా ఉన్న తరువాయి 8లో



ఎల్‌నినో ప్రభావం

## రాష్ట్రంలో ప్రకృతి విపత్తుగా ప్రకటించాలి

● జాతీయ విపత్తుగా పేర్కొనేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలి
● ప్రభుత్వానికి సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకృతి వైపరీత్యంగా ప్రకటించాలని, జాతీయ విపత్తు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకురావాలని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివ రావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. నష్టపోయిన పంటలకు రైతులకు పెట్టుబడిని చెల్లించే బాధ్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలని, రాష్ట్ర వ్యాప్తంగా తాగు, సాగునీటి సమస్యలు రాకుండా నీటిపారుదల, వ్యవసాయ శాఖ తరువాయి 8లో

## ప్రత్యేక సహాయ ప్యాకేజీ

# రూ.20వేల కోట్లు ప్రకటించాలి

### ఎల్‌నినో ప్రభావంపై కేంద్రం సాయాన్ని కోరుతూ శాసనసభలో తీర్మానం



● అదనపు నిధులూ మంజూరు చేయాలి ● తెలంగాణలో పరిస్థితులను అంచనా వేసేందుకు కేంద్ర బృందాన్ని పంపాలని విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని కోరుతూ తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం అండగా నిలవాలని శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ.20,000 కోట్ల ప్రత్యేక సహాయ ప్యాకేజీని ప్రకటించాలని, అదనపు నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానాలను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. పరిస్థితులను అంచనా తరువాయి 8లో

# తాగునీటికే తొలి ప్రాధాన్యం

● ఆ తరువాతే సాగునీరు విడుదల
● నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావం పరిస్థితుల్లో తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. మిషన్ భగీరథ, పట్టణగ్రామీణ అవసరాలు, రాబోయే వేసవికి కావాల్సిన నిల్వలను భద్రపరిచిన తరువాతే, మిగులు జలాలను సాగుకు విడుదల చేస్తామని ప్రకటించారు. పంటలను కాపాడటం ఎంత ముఖ్యమో, వచ్చే వేసవిలో ఒక్క గ్రామం కూడా దాహంతో అల్లాడకుండా చూడటం కూడా ప్రభుత్వ బాధ్యత అని, అందుకే ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నీటి బడ్జెట్, జిల్లాల వారీ తాగునీటి భద్రతా ప్రణాళిక తరువాయి 8లో





## ఎల్‌నినో ఎదుర్కొనేందుకు

# సహకరించండి

● కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
● తెలంగాణకు అదనంగా 9.56 లక్షల ఇండ్లను కేటాయించండి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొవడంలో కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు. రాష్ట్రంలో ఇండ్ల కోసం డిమాండ్‌కు అనుగుణంగా పిఎం ఆవాస్ యోజన గ్రామీణ (పిఎంఎవైజి) పథకంలో తెలంగాణాకు అదనంగా 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనడానికి శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చిన శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి కలిసి వర్షాభావం, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కోరుతూ తరువాయి 8లో

## మాజీమంత్రి హరీశ్‌రావు భూముల్లో

# కాంగ్రెస్ నేతలు పరిశీలన



బిఆర్‌ఎస్ నేతల అవినీతి, భూకబ్జాలపై ప్రజలకు వాస్తవాలు వివరిస్తాం ● ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి వెల్లడి ● సిద్దిపేట జిల్లా వెలికట్ట, రామంచు చివరలోని రంగనాయక సాగర్ వద్ద హరీశ్‌రావు భూముల్లో క్షేత్రస్థాయి పర్యటన ఎర్రవెల్లి భూములపై రెండోరోజూ అధికారులు ఆరా

ప్రజాపక్షం/ సిద్దిపేట/జగదేవ్‌పూర్

బిఆర్‌ఎస్ హయాంలో ఆ పార్టీకి చెందిన మంత్రులు, నాయకులు చేసిన అవినీతి, భూకబ్జాలపై నిజా నిర్ధారణ చేసి ప్రజలకు వాస్తవాలను తెలియజేయడానికే క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులుగా పర్యటన చేస్తున్నట్లు ఎంపిలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్‌రెడ్డిలు వెల్లడించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్ట మాజీ మంత్రి హరీష్‌రావు మామకు కేటాయించిన 6.21 ఎకరాలు, చిన్నకోడూరు మండలం రామంచ శివారులోని రంగనాయకసాగర్ వద్ద గల మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు ఫాం హౌస్ను ఎంపిలు సురేష్ శెట్కార్, బలరాం నాయక్, వేం నరేందర్‌రెడ్డి, కడియం కావ్య, అనిల్ కుమార్ యాదవ్, రఘురాంరెడ్డి, ఎమ్మెల్సీ అద్దెంకి దయాకర్, బల్మూరి వెంకట్, శంకరార్ నాయక్‌తో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రంగనాయక్‌సాగర్ ప్రతిపాదిత మ్యాప్, మాజీ మంత్రి హరీష్‌రావు తరువాయి 12లో

# నాడు ఓటు చోరీ.. నేడు పార్టీ చోరీ...

● టిఎంసి పార్టీ, గుర్తు స్తంభనపై ఇసిపై కాంగ్రెస్ మండిపాటు ● పార్టీనే దొంగిలించినప్పుడు కోట్ల మంది ఓట్లను తస్కరించలేరా? : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** ఎన్నికల కమిషన్, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ మరోసారి తీవ్రస్థాయిలో మండిపడింది. దేశంలో మొదట 'ఓట్ల దొంగతనం', తరువాత 'ప్రభుత్వ దొంగతనం', ఇప్పుడు 'పార్టీ దొంగతనం' జరుగుతోందని వ్యాఖ్యానించారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసిలోని రెండు వర్గాల మధ్య వివాదం కారణంగా ఆ పార్టీ పేరు, గుర్తును ఎన్నికల సంఘం స్తంభింపచేసింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీకి కాంగ్రెస్ పూర్తి మద్దతు ప్రకటించింది. ఇది కేవలం మమతా బెనర్జీ పోరాటం మాత్రమే కాదని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలను కోరుకునే ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి ఓటరు పోరాటమని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. టిఎంసి విషయంలో ఎన్నికల సంఘం నిర్ణయాన్ని రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. ప్రజల తీర్పును కాపాడటం ఎన్నికల సంఘం రాజ్యాంగపరమైన బాధ్యత అని, తరువాయి 12లో

## ఫ్రాన్స్‌లో అరుణ ఉత్సవం

40 వేల మందితో భారీ ప్రదర్శన

**పారిస్:** ఫ్రాన్స్‌లో అరుణ ఉత్సవం ఉత్సాహభరితంగా జరిగింది. రాజధాని పారిస్‌కు దక్షిణాన ఉన్న లే ప్లెసిస్‌పాటేలోని బేస్ ఏరియన్ 217 ఈ ఉత్సవానికి శాశ్వత వేదిక కాగా 'అంజెలా డేవిస్' ప్రాంగణంలో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్రాన్స్ కమ్యూనిస్టు పార్టీ (పిసిఎఫ్) అధ్వర్యంలో 40,000 మందితో భారీ ర్యాలీ జరిగింది. దేశ విదేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. అరుణ జెండాలతో విప్లవ గీతాలతో వేడుక నిర్వహించారు. ప్రధాన వక్త పిసిఎఫ్ జాతీయ కార్యదర్శి ఫాబియన్ రౌసెల్... కార్మికుల హక్కులు, వేతనాల రక్షణ, ప్రభుత్వ సేవలకు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. ఫ్రాన్స్ వామపక్ష రాజకీయాల్లో ఈ ప్రసంగం తరువాయి 12లో



# భారత్ మెడపై ట్రంప్ 100% కత్తి

బెదిరించి లొంగదీసుకోవటం, అది సాధ్యం కాకపోతే ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం, అది ఫలితమివ్వకపోతే ప్రత్యక్ష సైనిక జోక్యం అమెరికా సామ్రాజ్యవాదుల దుష్ట విదేశాంగ నీతి. అధ్యక్షుడు ట్రంప్ 'యుద్ధాలను ముగిస్తానంటూ శాంతిదూతగా రెండవ టరం ఆరంభించి' యుద్ధోన్మాదిగా రుజువు చేసుకున్నాడు. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అనే నినాదంతో అంతర్జాతీయ ఆర్థిక ఏర్పాట్లను లక్ష్యపెట్టకుండా ఏకపక్షంగా సుంకాల యుద్ధానికి దిగి ఆర్థిక వ్యవస్థల్లో కల్లోలం సృష్టించాడు. న్యాయవ్యవస్థ నుంచి ఎదురుదెబ్బ లు తగిలినా దొడ్డిత్రోవన సుంకాల ఒత్తిళ్లు అమలు చేస్తున్నాడు. తమకు వ్యతిరేకంగా ఉన్న దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించి వాటిని ఆర్థికంగా కృంగదీయటం అమెరికన్ విధానం. సుంకాల యుద్ధంలో చైనాతో ఓడిపోయిన ట్రంప్ రష్యా–ఉక్రేన్ యుద్ధం ముగించటంలో విఫలమైనాడు. దాంతో రష్యా యుద్ధ కృషిని దెబ్బతీసేందుకై రష్యా ఆదాయానికి గండికొట్టేందుకుగాను రష్యా నుంచి క్రూడ్ ఆయిలు కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధించాడు. ఇరాన్‌తో అమెరికా యుద్ధం మొదలైనాక గల్ఫ్ నుంచి ఆయిలు రవాణాకు ఆటంకాలు ఏర్పడగా, ప్రపంచదేశాల ఒత్తిడిపై రష్యన్ ఆయిలు కొనుగోలుపై ఆంక్షలు ఎత్తివేశాడు. తాజాగా మళ్లీ కొత్త ఆయుధం చేజిక్కించుకున్నాడు. అది లిండ్సే ఓ గ్రహం చట్టం. రష్యా నుంచి ఆయిలు పెద్ద ఎత్తున కొనుగోలు చేసే దేశాలనుంచి అమెరికాలోకి సరుకు దిగుమతులపై 100 శాతం వరకు సుంకం విధించేందుకు అధ్యక్షునికి అధికారమిచ్చిందీ చట్టం. ఈ చట్టానికి ఇరాన్ చట్టం, 2026ను జోడించి ఆ దేశంపై యుద్ధానికి ఇప్పటివరకు వెచ్చించిన 30బిలియన్ డాలర్లకు కాంగ్రెస్ ఆమోదం పొందారు ట్రంప్. ఇరాన్‌ను లొంగదీసుకుని గల్ఫ్ ఆయిలుపై అజమాయిషీ కోరుకుంటున్న ట్రంప్, తన లక్ష్యసాధనకై ఐదేళ్లపాటు ఇరాన్‌పై ఆంక్షలు అనుమతిస్తుందీ చట్టం. లిండ్సే చట్టం నేరుగా చైనా, భారత్‌లపై గురిపెట్టింది. ఈ రెండు దేశాలు రష్యానుంచి అతి ఎక్కువ ఆయిలు కొనుగోలుదారులుగా ఉన్నాయి. ఇన్నాళ్లూ అడ్మినిస్ట్రేటివ్ ఉత్తర్వుల ద్వారా ట్రంప్ ప్రపంచ దేశాలను బెదిరించినందున వాటిపై లీగల్ పోరాటానికి అవకాశం ఉండింది. కాని ఇప్పుడిది చట్టం. దాన్ని సెనేట్ 86–11 ఓట్లతో, ప్రతినిధుల సభ 262–159 ఓట్లతో ఆమోదించింది. దానిపై న్యాయపోరాటం సాధ్యం కాదు. నవంబర్ మధ్యంతర ఎన్నికల్లో ఏ పార్టీ మెజారిటీ సాధించినా ఈ చట్టం కొనసాగుతుంది. ట్రంప్ పదవీకాలం ముగిశాక కూడా ఉంటుంది. దాని అమలు అధ్యక్షుని విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఖరారును నాలుగేళ్లుగా సాగదీస్తూ వస్తున్న భారత్‌ను లొంగదీసుకునేందుకు ట్రంప్ ఈ కొత్త ఆయుధాన్ని తప్పక ఉపయోగిస్తాడు. మోదీ ప్రభుత్వం ట్రంప్‌కు లొంగుబాటు ప్రదర్శిస్తుందా లేక చైనాతో కలిసి ప్రతిఘటిస్తుందా? తన ఇంధన సార్వభౌమత్వాన్ని, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని నిలుపుకోవటం భారతదేశ ప్రతిష్టకు అవసరం. భారత ప్రభుత్వ తొలి అధికారిక స్పందన దృఢంగానే ఉంది. 'భారత్ తన 140 కోట్ల ప్రజలకు ఇంధన భద్రత చేకూర్చేందుకు దృఢ చిత్తంతో ఉంది. రూపుదిద్దుకునే మార్కెట్ పరిస్థితులను బట్టి వేర్వేరు మూలాలనుంచి ఆయిలు కొనుగోలును కొనసాగిస్తుంది' అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రకటన తెలిపింది. అదే సమయంలో భారతదేశ వాణిజ్యం, ఆర్థిక ప్రయోజనాల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. పర్యవసానాల గూర్చి వర్తక, వాణిజ్య సంస్థలతో చర్చిస్తాం' అని వ్యాపార వర్గాలకు భరోసా యిచ్చింది.

లిండ్సే చట్టం ఆమోదం కోసం సంవత్సరంపైగా ప్రయత్నాలు జరుగుతున్నా, ఇరాన్‌పై ఆంక్షల విధింపును అందులో చేర్చాక ట్రంప్ అందులోకి వచ్చారు. లిండ్సే గ్రహం జులైలో హఠాన్మరణం చెందిన తదుపరి అది వేగం పుంజుకుంది. న్యూఢిల్లీలో బ్రిక్స్ సమ్మిట్‌తో కుడిఎడంగా అది ఆమోదించబడటం గమనార్హం. బ్రిక్స్ సమ్మిట్ సెప్టెంబర్ 12,13 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగింది. రష్యా, చైనా, భారత్ సహా 11 వర్ధమాన దేశాల నేతలు 140 పేరాగ్రాఫ్‌ల డిక్లరేషన్ ఆమోదించారు. అది ఏ దేశం పేరు ఎత్తకుండానే, "ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) రూల్స్‌కు అనుగుణంగా లేని ఏకపక్ష టారిఫ్, నాన్‌టారిఫ్ చర్యలను" అది వ్యతిరేకించింది. వివాదాల పరిష్కారానికి డబ్ల్యుటిఒ ఏర్పాటు చేసిన యంత్రాంగం పునరుద్ధరణను డిమాండ్ చేసింది. తమ మధ్య వాణిజ్యంలో స్థానిక కరెన్సీలను విరివిగా వాడాలని ఆమోదించింది. వాషింగ్టన్‌లో కదలికలు వేగం పుంజుకున్నాయి. సెప్టెంబర్ 14న రూల్సు కమిటీ సమావేశమైంది. సెప్టెంబర్ 15న 214–211తో రూలు ఆమోదం పొందింది. 16న బిల్లు ఆమోదం పొందింది. భారత్ చాలా జాగ్రత్తగా ఢిల్లీ డిక్లరేషన్ తయారు చేసింది. ఉమ్మడి బ్రిక్స్ కరెన్సీని తిరస్కరించింది. డీడాలరైజేషన్ బదులు స్థానిక కరెన్సీ పరిష్కారాలు అని ఉపయోగించింది. అయినా ట్రంప్ జవాబు వెంటనే వచ్చింది. అది రష్యానుంచి ఆయిలు పెద్ద ఎత్తున కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు టారిఫ్ విధింపు. అమెరికా చట్టాన్ని చైనా గట్టిగా ఖండించింది. అమెరికా చర్య అంతర్జాతీయ చట్టానికి విరుద్ధం. ఎంపిక చేసుకున్న దేశాలపై అటువంటి వివక్షాపూర్వక సుంకాలు విధించే అధికారం దానికి లేదు. అంతర్జాతీయ న్యాయచట్టం, భద్రతా మండలి ఆమోదం లేని అటువంటి ఏకపక్ష చర్యలను తిరస్కరిస్తున్నాం అని చైనా ప్రకటించింది.

చైనా, భారత్‌లకు రష్యా ఆయిలుకు ప్రత్యామ్నాయాలు సులభం కాదు. అన్నిటికీ మించి తమ సార్వభౌమత్వ విధాన నిర్ణయాలను అమెరికా ఆదేశించటం ఎన్నటికీ అనుమతించరానిది. అందువల్ల ఇది మోదీ ప్రభుత్వానికి పరీక్షా సమయం. ●



## సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య బలోపేతానికి చర్చలు

నా సోదరుడు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)అధ్యక్షుడు హెచ్‌హెచ్.షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ నేను 76వ ఏట అడుగు పెట్టిన (పుట్టినరోజు) సందర్భంగా నాకు ఫోన్‌కాల్ చేశారు. నాకు ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినందుకు నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ప్రాంతీయ శాంతి, భద్రత, స్థిరత్వాన్ని ప్రోత్సహించే ప్రయత్నాలలో సహకారం, సమన్వయం కొనసాగించడానికి మేం ఇరువురం కట్టుబడి ఉన్నాం. ఈ అంశాలపై మా అభిప్రాయాలను పంచుకున్నాం. మన ద్వైపాక్షిక సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే చర్యలపై కూడా సమగ్రంగా చర్చించాం. భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని విజయవంతంగా చేపట్టినందుకు యుఎఇ అధ్యక్షుడు అల్ నహ్యాన్ నాకు అభినందనలు తెలియజేయడం సంతోషదాయకం.

– ప్రధానమంత్రి నరేంద్రమోదీ




# ఎస్టీయు జైత్రయాత్ర - పోరాటాల స్ఫూర్తి

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర గణనీయమైనది. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే 'గురు'తర బాధ్యత వారిది. అటువంటి ఉపాధ్యాయ లోకపు హక్కుల సాధన, పరిరక్షణ కోసం, విద్యావ్యవస్థ బలోపేతం కోసం దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే దశాబ్దాల క్రితం ఆవిర్భవించిన మహా సంఘం రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయు). నాడు హైదరాబాదు సంస్థానంలో నిజాం నిరంకుశ పాలనలో, నియంతృత్వ విధానాలలో ఉపాధ్యాయులు కనీస గుర్తింపుకు నోచుకోక, ఎటువంటి హక్కులు లేక నిరాశతో, నిస్సహాయ స్థితిలో జీవనాన్ని కొనసాగిస్తున్న నేపథ్యంలో వారి సమస్యలపై గళమెత్తడానికి పురుడుపోసుకున్న ఉద్యమ సంఘం రాష్ట్రోపాధ్యాయ సంఘం. ఎందరో నిస్వార్థ నాయకుల త్యాగాలు, అంకితభావంతో రూపుదిద్దుకున్న ఈ సంఘం కేవలం ఒక సంఘంగానే కాకుండా ఉపాధ్యాయుల గుండెచప్పుడుగా మారింది. నాటి హైదరాబాదు సంస్థాన విమోచనం నుండి ఆంధ్రప్రదేశ్ వరకు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రావిర్భావం వర కు ఎస్టీయూ ప్రస్థానం నిరంతరం ప్రగతిశీల ప్రజాస్వామ్య వ్యవస్థగా కొనసాగుతూనే ఉన్నది.

ఉపాధ్యాయుల జీతభత్యాలు, కరువు భత్యాలు, బదిలీలు, పదోన్నతులు వంటి సంక్షేమ హక్కులసాధనలో అగ్రగామిగా నిలిచింది. స్వరాష్ట్రంలో కూడా పాలకుల ముందు సమస్యలను సాధించుటలో తార్కికమైన ఆలోచనలతో ప్రభుత్వంతో చర్చిస్తూ సమస్యల సాధనకు కృషి చేస్తూ మేధావి సంఘంగా గుర్తింపు పొందిం ది. సమస్యల సాధన కై పలు రూపాలలో ఉద్యమాలు నడిపింది.ఈనాడు ఉపాధ్యాయులకు గౌరవం లభించినా, వారు పలు సౌకర్యాలు పొందుతున్నా అదంతా ఎస్టీయు సాధించిపెట్టినదే అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఇప్పటికీ నూతన పిఆర్‌సి, డిఎల వంటి ఆర్థిక అంశాలతో పాటు, సిపిఎస్ రద్దు, టీచర్ల బదిలీలు, ప్రమోషన్లు వంటి వాటిపై మడమతిప్పని పోరాటం సల్పుతూనే ఉన్నది. ఎస్టీయు కేవలం ఉపాధ్యాయుల హక్కులు, ఆర్థిక ప్రయోజనాల కోసమే పోరాడలేదు. వాటితో పాటు విద్యారంగ పరిరక్షణకై ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడడం, ఉపాధ్యాయ ఖాళీల భర్తీ, ఉపాధ్యాయుల వృత్తిపరమైన నైపుణ్యాల సాధన వంటి విద్యా సంబంధ అంశాలపై ఎప్పటికప్పుడు పాలకులకు, విద్యాశాఖకు దిశానిర్దేశం చేస్తూ వస్తోంది. సామాజిక చైతన్యం కలిగిన ఎస్టీయు కోవిడ్ ప్రకృతి వైపరీత్యాలు వంటి ఆపత్కాల సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించింది. హక్కులకై ఉద్యమిస్తూ, బాధ్యతలకై నిలబడుతూ, ఉపాధ్యాయుల ఆత్మ స్థైర్యాన్ని నిలబెడుతూ ఉపాధ్యాయలోకానికి దిక్సూచిగా నిలిచింది. ఈ ప్రస్థానం లో ఎస్టీయు నుండి శాసనమండలి సభ్యులుగా చట్టసభలోకి అడుగిడిన ఎస్టీయు నాయకులు చట్టసభకే వన్నెతెచ్చి, పలువురి ప్రశంసలు అందుకున్నారు. చట్టసభలో నాయకత్వం ఎలా ఉండాలో, సమస్య ప్రస్తావన ఏ విధంగా ఉండాలో నిరూపి స్తూ ఆదర్శంగా నిలిచారు. ఎస్టీయు తన 80 ఏండ్ల సుదీర్ఘ ప్రస్థానంలో చేసిన పోరాటాలు ఎన్నో! సాధించిన విజయాలు ఎన్నెన్నో! అవన్నీ రాష్ట్రోపాధ్యాయ సంఘ ఉద్యమ చరిత్రకు సజీవ సాక్షాలుగా నిలిచాయి. ఇంతటి సుదీర్ఘ చరిత్ర ఏ ఉపాధ్యాయ సంఘానికి లేదంటే అతిశయోక్తి కాదు. విద్యాహక్కు చట్టం, సిసిఇ విధానం నూతన జాతీయ విద్యా విధానం(NEP2020) వంటివాటిలో గల లోపాలను ఎత్తిచూపుతూ, క్షేత్రస్థాయి ఇబ్బందులను ప్రస్తావిస్తూ రాష్ట్ర స్థాయి నుండి జాతీయస్థాయి వరకు ఎన్నో ప్రాతినిధ్యాలు చేసింది. ఉద్యమాలు నడిపింది. వాటిపై పోరాడుతూనే ఉన్నది. అదే విధంగా ఎస్.సి. టి.ఈ నిబంధనలు, టీచర్లపై టెట్ పరీక్ష, సుప్రీంకోర్టు తీర్పు, ఉపాధ్యాయుల ఉద్యోగభద్రత, తదితరాలపై గల్లీ నుండి ఢిల్లీవరకు పోరాడుతూనే ఉన్నది. ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర ఉద్యమ ప్రస్థానంలో ఎస్టీయు సంపాదించుకున్న విశ్వసనీయత, పొందిన ఆదరణ అపూర్వమైనది. ఎందరో ఎస్టీయు నాయకులు అందించిన స్ఫూర్తితో నేటి తరపు సమర్థవంతమైన నాయకుల అంకితభావంతో ఎస్టీయు ఆదర్శవంతమైన సంఘంగా, విద్యారంగానికి దిక్సూచిగా నిలబడుతూ తన జైత్రయాత్రను కొనసాగిస్తున్నది. ఈ నెల 27న నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాలులో 80 వసంతాల వైభవోత్సవ వేడుకలు జరుపుకుంటున్న శుభతరుణంలో త్వరలో శతవసంతాల వేడుకలు కూడా జరుపుకుంటుందని ఆశిద్దాం.

**(ఎస్టీయుటిఎస్ 80 వసంతాల వేడుకలు సందర్భంగా)**



సుధాకర్ ఏవి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు
తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (STUTS)
9000674747

# విద్య, వైద్యం, తెలంగాణ మానవాభివృద్ధి



ప్రొ॥టి.ప్రభాకరరెడ్డి
ఆర్థిక శాస్త్రవేత్త, హైదరాబాద్

ఏ దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా అభివృద్ధి అనగా మొదట గుర్తుకు వచ్చేది "మానవాభివృద్ధి". దీనికై సామాజిక రంగాన్ని బలోపేతం చేయటం ఎంతైనా అవసరం. ఇందులో భాగంగా కావలసిన నిధులు కేటాయించటం, ఆ నిధులని సద్వినియోగం చేసుకోవటం, తద్వారా ప్రజలకి నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వాల పరమావధి కావాలి. ఎందుకనగా సగటు మానవుని జీవన ప్రమాణస్థాయి పెరగాలంటే విద్య, వైద్య సేవలు ఎంతో కీలకం. అంతేకాని (జిడిపి), స్థూల జాతీయోత్పత్తి పెరగడం, తలసరి ఆదాయాన్ని పెంచడం వలన పెద్దగా పేదల జీవితాలలో మార్పు రాదు. ఉదాహరణకి ప్రస్తుతం మన కేంద్రప్రభుత్వం బేస్ సంవత్సరాన్ని (Base Year) 2011–12ను 2022–23కి మార్చడం వలన అంకెలలో మార్పు రావడం వలన జిడిపి 7.8శాతం పెరుగుదల Quarter–1 (తొలి త్రైమాసికం)లో చూపించింది. అలాగే రాష్ట్రంలో జిఎస్‌డిపి అనగా రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిని జనాభాతో భాగించగా వచ్చేది తలసరి ఆదాయం. ఇది ప్రజలందరికీ సమానంగా పంచబడలేదు. తెలంగాణలో ప్రస్తుతం 2025–26కి రూ.4,18,931 తలసరి ఆదాయం సాధించినట్లుగా ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆదాయ వ్యత్యాసాలు గణనీయంగా పెరిగినవని ఒక రిపోర్టు ఈ మధ్యలోనే చెప్పడం గమనార్హం. ఇకపోతే అమెరికన్ డాలర్లలో 5407 గా నమోదు కావడం దీనిని ప్రపంచ బ్యాంకు రిపోర్టులో ప్రస్తావించడం బాగానే ఉంది. కాని నానాటికీ ధనిక, బీద వర్గాల మధ్య అంతరాలు విపరీతంగా పెరుగుతున్నాయి అని గమనించాలి.

తెలంగాణలో సామాజికాభివృద్ధిని పరిశీలించినట్లయితే మనం వెనకబడినట్లుగా గోచరిస్తుంది. విద్యారంగంలో విద్యా ప్రమాణాలు తగ్గి, విద్యార్థులు, టీచర్లు కేవలం ఉత్తీర్ణత శాతంపై దృష్టి సారించినట్లు తెలుస్తుంది.

అసర్(aser) రిపోర్టు 2024 ప్రకారం తెలంగాణ learning outcomesలో వెనుకబడి ఉంది. అసర్ రిపోర్టు శాస్త్రీయ పద్ధతిలో 605గ్రామీణ యూనిట్లలో, 17,997 గ్రామాలలో 6,49,491 విద్యార్థులని పరిశీలించి, మాట్లాడి, వారివారి విద్యా ఫలితాలని అంచనా వేయడం జరిగింది. దీని ప్రకారం విద్యార్థులు నేర్చుకున్న ఫలితాలని చూస్తే ప్రాథమికంగా అక్షరాస్యత మరియు లెక్కలు చేయడంలో చాలా వెనుకబడి ఉన్నారు. కావున పాఠశాల బోధన పటిష్టపరచి, నాణ్యమైన బోధన కొనసాగించి మంచిఫలితాలని రాబట్టాలి. విద్యార్థులు సబ్జెక్టులని నేర్చుకొని ముందుకు వెళ్లాలి. అంతేకాని ఉత్తీర్ణతా శాతంకై పరుగెత్తడం సరియైనది కాదు.

మరీ ముఖ్యంగా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ పాఠశాలలు (టిపిఎస్) విద్యారంగంలో వ్యత్యాసాలని తీసుకొస్తాయి. ఎందుకనగా మండలం అసెంబ్లీ నియోజకవర్గంలోని విద్యార్థులు అందరికీ ఆ పాఠశాలలో అడ్మిషన్ రాదు కాబట్టి ఒకచోట కొంతమంది టిపిఎస్‌లో చదువుతుండగా, ఇతరులు ఇప్పుడున్న ప్రభుత్వ పాఠశాలల్లో, కెజిబివిలో లేదా మోడల్ పాఠశాలల్లో చదువుకోవాలి. తద్వారా విద్యాబోధనలో వ్యత్యాసా లు కచ్చితంగా వస్తాయి. "అందరికీ విద్య" అనే నానుడి మాయమవుతుంది. దీనివలన ఇతర పాఠశాలలు నిర్లక్ష్యానికి గురి అయి, నిర్వీర్యం అయ్యే అవకాశం ఉంది. కావున ప్రస్తుతమున్న పాఠశాలలలో నాణ్యమైన విద్యాబోధన జరిపించి, ఫలితాలని మెరుగుపరచాలి.

అంతేకాని ప్రయోగాలు వద్దు. ప్రమాణాలు కావాలి. ఇక పోతే టీచర్లకి అల్పాహారం, భోజనం అనేది ఎవ్వరూ అడగలేదు. దానివలన బడ్జెట్‌పై ప్రభావం పడుతుంది. నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజనం పోషకాలతో అందిస్తే ఎంతో మేలు.

> తెలంగాణలో ప్రస్తుతం 2025–26కి రూ.4,18,931 తలసరి ఆదాయం సాధించినట్లుగా ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆదాయ వ్యత్యాసాలు గణనీయంగా పెరిగినవని ఒక రిపోర్టు ఈ మధ్యలోనే చెప్పడం గమనార్హం. ఇకపోతే అమెరికన్ డాలర్లలో 5407గా నమోదు కావడం దీనిని ప్రపంచ బ్యాంకు రిపోర్టులో ప్రస్తావించడం బాగానే ఉంది. కానీ నానాటికీ ధనిక, బీద వర్గాల మధ్య అంతరాలు విపరీతంగా పెరుగుతున్నాయి అని గమనించాలి.

ఒకసారి 'అసర్' రిపోర్టు చూసి నట్లయితే, తెలంగాణలో 8వ తరగతి విద్యార్థులు కేవలం 35 శాతం మాత్రమే " తీసివేత" చేయగలిగారు. 65 శాతం విద్యార్థులు ఫెయిలయ్యారు. అలాగే 5వ తరగతిలో 38.7 శాతం, 4వ తరగతిలో 40 శాతం, 3వ తరగతిలో 28.5 శాతం విద్యార్థులు వారి వారి స్థాయిలో తీసివేత లెక్కలు చేయగలిగారు.

అలాగే 'భాగాహారం' లెక్కలు ఇచ్చినపుడు 8వ తరగతిలో 41.1శాతం, 5వ తరగతిలో 25.2శాతం, 4వ తరగతిలో 12.2 శాతం, 3వ తరగతిలో 2.4 శాతం విద్యార్థులు మాత్రమే పాసయినారు. దీని వలన మనకు అర్థమయ్యేది ఏమిటంటే గణితంలో విద్యార్థులు చాలా వెనుకంజలో ఉన్నారు. ఆంగ్లం చదవడంలో కూడా వెనుకబడి ఉన్నారు. కాబట్టి జిల్లా విద్యాశాఖవారు నాణ్యమైన బోధన, మంచి ఫలితాలకై పాత పద్ధతిలో పాఠశాలలని సందర్శించడం, ఉపాధ్యాయులలో ప్రేరణ, ప్రోత్సాహం కల్పించడం ఎంతైనా అవసరం. సంవత్సరం మధ్యలో లేదా వేసవిలో టీచర్లకి శిక్షణలు ఇప్పించి, వారిలో అంకితభావాన్ని పెంపొందించేట్లుగా కృషి చేయాలి. రాష్ట్రంలో అప్పుడప్పుడు (third party evaluaters) థర్డ్‌పార్టీ మూల్యాంకనం జరిపించాలి. అంతేకాని ఒక స్కూలు ఉపాధ్యాయులు, మరొక స్కూలుకి పరిశీలనకై బృందాలుగా వెళ్ళడం ఎంత మాత్రం పనికిరాదు. అది కేవలం పరిశీలనకై బృందాలుగా ఉండి ప్రయోజనం లేని ప్రక్రియ. దీని వలన సంబంధిత పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడుతుంది. దీనికి బదులు inspector of shools ని ఏర్పాటుచేసి విద్యాబోధనని పరిశీలించండి, మెరుగుపరచండి.

ఇకపోతే వైద్యరంగం సేవలు, వాటి మౌలిక వసతులు చూసినట్లయితే గ్రామీణ ప్రాంతాలలో అంతంత మాత్రమే, నిజానికి వాటి పనితీరు అస్తవ్యస్తంగా ఉంది. ఉదాహరణకి జిల్లా ఆసుపత్రిల్లో మందుల కొరత, డాక్టర్ల లేమి, గైర్హాజరు, సర్వసాధారణం. మరీ ముఖ్యంగా ప్రాథమిక వైద్య కేంద్రాలలో స్టాఫ్ కనపడరు.

హెల్త్ వర్కర్స్ తమ, తమ వ్యాపారాలలో నిమగ్నమై ఉన్నారని ప్రజలు వాపోతున్నారు. సబ్ సెంటర్ల పనితీరు అంతంత మాత్రమే. కావున వైద్య రంగాన్ని ప్రక్షాళన చేసి ప్రజలకి ఎల్లవేళ లా అందుబాటులో ఉండేట్లుగా చేస్తే ప్రజలు హర్షిస్తారు. ఇకపోతే హైదరాబాదు మహానగరంలో మూడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు రావడం చాలా సంతోషం, కాకపోతే వాటిలో తగినంత ఉద్యోగులని నియమించి ప్రారంభిస్తే మంచిది.

సెంట్రల్ బ్యూరో హెల్త్ ఇంటలిజెన్స్ ప్రకారం తెలంగాణలో హెల్త్ వర్కర్స్ కావలసినంత శాతంలో లేరు. 27 శాతం తక్కువగా ఉన్నారని జాతీయ ఆరోగ్య ప్రొఫైల్ చెప్పడం గమనార్హం. దీనివలన గ్రామీణ ఆరోగ్యం సరిగా లేదని అర్థమవుతుంది. మరీ ముఖ్యం గా విద్య, వైద్యరంగ సేవలని మానిటరింగ్ చేసి ప్రజలకి సేవలని అందుబాటులో ఉంచాలని వారి విజ్ఞప్తి. ఇంకా చెప్పాలంటే ప్రైవేటు రంగంలో హాస్పిటల్స్, యథేచ్ఛగా ఫీజులు వసూలు చేస్తూ; ఆరోగ్య పరీక్షలు చేయిస్తూ, డబ్బు లు దండుకుంటున్నారని ప్రజల ఆవేదన. కావున వాటిని నియంత్రించడానికై ఒక పీపుల్స్ కమిటీవేసి పర్యవేక్షణాధికారాలు ఇచ్చి ఆరోగ్య రంగాన్ని ఆదుకోవాలని వారి అభిప్రాయం.

ఒక మాటలో చెప్పాలంటే ప్రజలకు మెరుగైన విద్య, వైద్య సేవలు అన్నిస్థాయిలలో అందించినట్లయితే అది మానవాభివృద్ధికి తోడ్పడుతుంది. ప్రజలు ప్రభుత్వాలకి పట్టం కడుతారు. తెలంగాణలో ధనిక, పేద వర్గాల మధ్య వ్యత్యాసాలు తగ్గి నిజమైన అభివృద్ధికి నాంది పలికినట్లవుతుంది.

నిజానికి మానవాభివృద్ధి ఇండెక్స్ మూడు అంశాలని పరిగణనలోకి తీసుకుని లెక్కిస్తుంది. ఒకటి, జనన సమయంలో ఆశించిన జీవితకాలం, రెండు, నాణ్యమైన విద్య, మూడు, మంచి జీవన ప్రమాణస్థాయి. మూడో అంశాన్ని పెంపొందించాలంటే ప్రభుత్వాలు ఉద్యోగ కల్పనపై దృష్టి సారించాలి: యువతని రాబోయే కాలానికి తీర్చిదిద్దాలి. అపుడే తెలంగాణలో నిజమైన, ఖచ్చితమైన అభివృద్ధి సాధించవచ్చును.

# యూనిఫామ్ సివిల్ కోడ్ విశ్వాస లోటు!



వెంకగారి భూమయ్య
9848559863

భారతదేశంలో యూనిఫామ్ సివిల్ కోడ్ లేదా ఉమ్మడి పౌర స్మృతి అనే అంశం దశాబ్దాలుగా కేవలం ఒక చట్టపరమైన ప్రతిపాదనగానే కాకుండా, దేశ సామాజిక సంస్కృతి, రాజకీయ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న సవాలుగా నిలిచింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 2029 నాటికి జాతీయ స్థాయిలో ఎన్డీయే పాలిత రాష్ట్రాలలో దీనిని సమగ్రంగా అమలు చేసే దిశగా అడుగులు వేస్తోందన్న హోంమంత్రి ప్రకటనతో ఈ అంశంపై మళ్లీ సుదీర్ఘమైన విశ్లేషణలు, భిన్నాభిప్రాయాలు ప్రారంభమయ్యాయి. స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాతలు పౌరులందరికీ సమాన హక్కులు కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో రాజ్యాంగంలోని 44వ ఆర్టికల్ కింద ఆదేశిక సూత్రాల విభాగంలో ఉమ్మడి పౌర స్మృతి అమలును పొందుపరిచారు. దేశంలోని పౌరులందరికీ వారు నమ్మే మతంతో సంబంధం లేకుండా ఒకే రకమైన సివిల్ చట్టాలు ఉండాలనేది ఈ ఆర్టికల్ ఉద్దేశం.

సిద్ధాంతపరంగా చూస్తే ఇది ఎంతో ఆధునికమైన, సమానత్వ భావనకు అద్దం పట్టే ఆలోచనగా కనిపిస్తుంది. అయితే, భారతదేశం వంటి విభిన్న భాషలు, సంస్కృతులు, ఆచారాలు, విభిన్న మత విశ్వాసాలు కలిగిన దేశంలో ఒకే రకమైన సివిల్ చట్టాలను వర్తింపజేయడం వెనుక ఎన్నో సంక్లిష్టతలు దాగి ఉన్నాయి. ముఖ్యంగా ఉమ్మడి పౌర స్మృతి అమలు వెనుక ఉన్న పాలకుల ఉద్దేశంపై వ్యక్తమవుతున్న నమ్మకలేమి లేదా విశ్వాస లోటు ఈ అంశాన్ని మరింత క్లిష్టంగా మార్చివేసింది.

చారిత్రక కోణంలో విశ్లేషిస్తే, మన దేశంలో నేర చట్టాలు లేదా క్రిమినల్ లాస్ అందరికీ సమానంగానే ఉంటాయి. కానీ వివాహం, విడాకులు, దత్తత, జీవనభృతి, వారసత్వ ఆస్తుల పంపిణీ వంటి వ్యక్తిగత విషయాలకు వచ్చేసరికి వేర్వేరు మతాలకు సంబంధించి వేర్వేరు పర్సనల్ లాస్ అమలులో ఉన్నాయి. ఇస్లామిక్, హిందూ, క్రైస్తవ, పారసీ చట్టాలు ఆయా మతాల ఆచారాలకు అనుగుణంగా రూపుదిద్దుకున్నాయి. అయితే, ఈ మతపరమైన వ్యక్తిగత చట్టాలలో చాలా వరకు స్త్రీలకు పురుషులతో సమానంగా హక్కులు లభించడం లేదనేది అనేక దశాబ్దాలుగా ఉన్న ప్రధాన ఫిర్యాదు. ముఖ్యంగా వివాహ రద్దు, దత్తత మరియు ఆస్తి హక్కుల విషయంలో మహిళలు తీవ్రమైన వివక్షను ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి వస్తే మతపరమైన లింగ వివక్షకు అంతం పడుతుందని, స్త్రీలకు అన్ని రంగాల్లో సమాన హక్కులు దక్కుతాయని, ఇది సామాజిక న్యాయానికి ఒక నిదర్శనంగా మారుతుందని దీనిని సమర్థించే రాజ్యాంగ నిపుణులు భావిస్తున్నారు. రాజ్యాంగంలోని సమానత్వ హక్కు ఆధారంగా ప్రతి పౌరుడికి న్యాయం జరగాలనేదే దీనిలోని ప్రధాన ఆకాంక్ష.

అయినప్పటికీ, ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వర్గాల నుంచి కూడా బలమైన వాదనలు వినిపిస్తున్నాయి. రాజ్యాంగంలోని 25వ ఆర్టికల్ ప్రకారం భారత పౌరులందరికీ తమ మతాన్ని స్వేచ్ఛగా ఆచరించే, ప్రచారం చేసుకునే హక్కు కల్పించబడింది. వ్యక్తిగత చట్టాలు అనేవి మతాచారాల్లో ఒక భాగమని, ఉమ్మడి పౌర స్మృతిని బలవంతంగా రుద్దడం వల్ల మైనారిటీల సాంస్కృతిక స్వేచ్ఛ, మతపరమైన గుర్తింపు దెబ్బతింటాయని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా, ఉమ్మడి పౌరస్మృతి యొక్క ప్రాథమిక సిద్ధాంతంపై కంటే, దానిని అమలు చేయాలని భావిస్తున్న ప్రభుత్వ రాజకీయ ఉద్దేశంపైనే ఈ వివాదమంతా నడుస్తోంది. అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ తన సుదీర్ఘకాల ఎజెండాలో భాగంగా ఉన్న రామమందిర నిర్మాణం, జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు వంటి అంశాలను పూర్తి చేసిన తరువాత, మూడవ ముఖ్యమైన అడుగుగా ఉమ్మడి పౌరస్మృతి వైపు వెళ్తోందనే భావన వ్యతిరేకులలో బలపడింది. దీనివల్ల ఇది మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని తెస్తున్న రాజకీయ చట్టంగా ముద్రపడటం వల్ల విశ్వాస లోటు మరింత పెరిగింది.

ఈ నమ్మకలేమి కేవలం ప్రతిపక్ష పార్టీలు లేదా మైనారిటీ సంఘాలకే పరిమితం కాలేదు. స్వయంగా అధికార ఎన్డీయే కూటమిలోని మిత్రపక్షాలు కూడా ఈ విషయంలో స్పష్టమైన ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి. ఉదాహరణకు, బీహార్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న జనతాదళ్ (యునైటెడ్ వంటి పార్టీలు బహిరంగంగానే ఉమ్మడి పౌర స్మృతిపై తమ అసమ్మతిని పునరుద్ఘాటించడం గమనార్హం. విభిన్న సామాజిక నిర్మాణాలు ఉన్న భారతదేశంలో అన్ని ప్రాంతాల, అన్ని వర్గాల ప్రజలను ఒకే చట్రంలోకి తీసుకురావడం ఎంతటి సున్నితమైన విషయమో ఈ రాజకీయ వ్యతిరేకత స్పష్టం చేస్తోంది. మరోవైపు, దేశంలోని వివిధ రాష్ట్రాలు తమ సొంత స్థాయిలో ఈ చట్టాన్ని తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించాయి. ఉత్తరాఖండ్ రాష్ట్రం జనవరి 2025లో అధికారికంగా ఉమ్మడి సివిల్ కోడ్‌ను అమలు చేస్తూ మొదటి రాష్ట్రంగా నిలిచింది. అదేవిధంగా గుజరాత్, మధ్యప్రదేశ్, అస్సాం రాష్ట్రాలు శాసనసభలలో చట్టాలను ఆమోదించగా, మహారాష్ట్ర, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు కూడా తమ ప్రతిపాదనలను సిద్ధం చేసే దిశగా పనిచేస్తున్నాయి.

ఇక్కడ గమనించాల్సిన మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ ఉమ్మడి చట్టాలను రూపొందిస్తున్నప్పుడు ప్రభుత్వాలు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కొన్ని మినహాయింపులు ఇస్తున్నాయి. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలలోని మరియు వివిధ ప్రాంతాలలోని గిరిజన తెగల ఆచారాలు, వారి సంప్రదాయ చట్టాలను కాపాడేందుకు మినహాయింపులను కల్పిస్తున్నారు. వలస పాలన కాలం నుంచి ఒకే రకమైన కోడ్ కలిగి ఉన్న గోవా రాష్ట్ర అనుభవాన్ని కూడా ఇక్కడ పరిగణనలోకి తీసుకుంటున్నారు. అయితే, ఇలా రాష్ట్రానికో రీతిలో లేదా వర్గానికో రీతిలో మినహాయింపులు ఇవ్వడం అనేది ఉమ్మడి అనే పదానికి మూల అర్థాన్ని ఎంతవరకు నిలబెడుతుందనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. సంపూర్ణమైన ఏకరూపత సాధించడం ఆచరణలో ఎదురయ్యే అతిపెద్ద సవాలుగా మారింది.

ఏ ప్రజాస్వామ్య వ్యవస్థలోనైనా ఒక పెద్ద సామాజిక మార్పును తీసుకురావడానికి చట్టాల కంటే ముందుగా ప్రజల మనస్సుల్లో నమ్మకాన్ని నింపడం అత్యంత ప్రధానమైన బాధ్యత. ప్రజల భాగస్వామ్యం లేకుండా లేదా వారి అనుమానాలను నివృత్తి చేయకుండా చేసే చట్టాలు సామాజిక అసంతృప్తికి, నిరసనలకు దారితీస్తాయి. ప్రభుత్వం ముందుగా చేయవలసింది ఏమిటంటే, ఈ ఉమ్మడి పౌర స్మృతి ఉద్దేశం ఏదో ఒక మతాన్ని లేదా వర్గాన్ని అణచివేయడం కాదని, కేవలం పౌర హక్కులను కాపాడటమేనని పారదర్శకంగా నిరూపించాలి. దీనికోసం అన్ని మతాలకు చెందిన ప్రాతినిధ్యం ఉన్న పెద్దలతో, న్యాయ కోవిదులతో, వివిధ సామాజిక సంస్థలతో, ముఖ్యంగా మహిళా హక్కుల కోసం పోరాడుతున్న సంఘాలతో దేశవ్యాప్తంగా బహిరంగ చర్చలు జరపాలి.

సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా ముసాయిదాలను అమలు చేయడం వల్ల ఈ విశ్వాస లోటు మరింత హెచ్చు అవుతుంది. రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను అనుసరిస్తూ, పార్లమెంటరీ కమిటీల ద్వారా విస్తృతమైన విశ్లేషణలు జరిపి, పౌరులందరి హక్కులకు రక్షణ కల్పించేలా సమగ్రమైన మార్గాన్ని ఎంచుకోవడమే శ్రేయస్కరం. భారతదేశ సమగ్రత, వైవిధ్యం మరియు రాజ్యాంగ విలువలను కాపాడుతూనే పౌరులందరికీ సమానత్వం అందించే దిశగా అందరినీ కలుపుకుని ముందుకు సాగినప్పుడే ఉమ్మడి పౌర స్మృతి అనేది అర్థవంతమైన రాజ్యాంగ లక్ష్యంగా మారుతుంది.

## ● అసెంబ్లీ మీడియా పాయింట్

### బిఆర్ఎస్ భూదోపిడీపై ప్రజలకు వాస్తవాలు తెలియాలి

● ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెసిఆర్ ఫామ్‌హౌస్ చుట్టుపక్కల ఉన్న 380 ఎకరాల భూముల వ్యవహారంపై బిఆర్ఎస్ నేతలు స్పష్టత ఇవ్వాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం డిమాండ్ చేశారు. దళితుల అసైన్డ్ భూములను ధరణి పేరుతో తమ ఆధీనంలోకి ఎందుకు తీసుకున్నారో ప్రజలకు వివరించాలన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ ధరణి పేరుతో గత ప్రభుత్వం చేపట్టిన భూ వ్యవహారాలపై అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాస్తవాలను వెల్లడించారు, కానీ, తాము బయటపెట్టిన వాస్తవాలపై సమాధానం చెప్పకుండా ప్రతిపక్ష బిఆర్ఎస్ నాయకులు ఇతర అంశాలను ప్రస్తావిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. కెటిఆర్, హరీష్‌రావు, కెసిఆర్ భూస్వాములైతే 2004 ఎన్నికల అఫిడవిట్లలో ఒక్క ఎకరం భూమి కూడా ఎందుకు చూపించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### భూ వ్యవహారాలపై జ్యుడీషియల్ ఎంక్వైరీకి డిమాండ్

ప్రభుత్వం 18 ప్రశ్నలకు సమాధానం చెప్పాలి

:ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

రాష్ట్రంలోని భూ వ్యవహారాలపై వస్తున్న ఆరోపణలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ ఏర్పాటు చేయాలని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ భూ లావాదేవీలపై బిజెపి లేవనెత్తిన 18 ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని కోరారు. రెవెన్యూ మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం 23 లక్షల ఎకరాల భూములు 13 వేల లావాదేవీల ద్వారా బదిలీ అయ్యాయని పేర్కొన్న మహేశ్వర్‌రెడ్డి, అవి అక్రమమైతే రద్దు చేసి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో భారీ కుంభకోణాలు జరిగాయని సిఎం పేర్కొన్న నేపథ్యంలో ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను ఎందుకు బయటపెట్టలేదని ఆయన ప్రశ్నించారు.

### సౌండ్ సిస్టమ్‌పై ఆంక్షలు విధించొద్దు

డిజిపికి పాయల్ శంకర్ విజ్ఞప్తి

హిందువుల పండుగల సందర్భంగా సౌండ్ సిస్టమ్స్ వినియోగంపై అనేక ప్రాంతాల్లో పోలీసులు ఆంక్షలు విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఈ అంశాన్ని శాసనసభలో కూడా ప్రస్తావించినట్లు తెలిపారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిబంధనలకు లోబడి సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసుకునే వారిపై ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా చూడాలని డిజిపికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల ఎస్‌పిలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నించే విధంగా సాగాయని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బిజెపి నిలదీసినా ప్రభుత్వం సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. 22ఎ భూములు, భూ దందాలకు సంబంధించి సుమారు 50 లక్షల మందికి సంబంధించిన సమస్యలపైనా స్పష్టత ఇవ్వలేదని మండిపడ్డారు. ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ డిఎలు, పిఆర్‌సి, రైతాంగ సమస్యలపై సభలో తగిన చర్చ జరగలేదని పాయల్ శంకర్ అన్నారు.


### ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు

ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

అసెంబ్లీ సమావేశాల తొలి మూడు రోజులు ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ నేతల ఆందోళనలతోనే గడిచాయని, ఆ తర్వాతి ప్రతిపక్షంగా ఉన్న బిజెపికి కూడా ప్రజా సమస్యలను ప్రస్తావించే అవకాశం కల్పించలేదని బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానం ద్వారా కేంద్రంపై నెపం నెట్టే ప్రయత్నం చేసిందని విమర్శించారు. 22ఎ భూముల అంశంలో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడిందన్నారు. శీతాకాల అసెంబ్లీ సమావేశాల వరకు ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని నిలదీస్తామని పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు.

# ఎల్‌నినో నుంచి కాపాడేందుకు ముందస్తు చర్యలు

● రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రజలను ఎల్‌నినో ప్రభావం నుంచి కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతు బాధ్యతగా ముందస్తు చర్యలు తీసుకుంటుందని, కేంద్ర ప్రభుత్వం కూడా పెద్దన్న పాత్ర పోషించి, అన్ని రంగాల్లో రాష్ట్రానికి పూర్తి సహకారం అందించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకున్నదని, రైతులు, తాగునీరు, పశుసంపద, విద్యుత్ రంగాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. రాష్ట్రంలోని 17 జిల్లాల్లో 20 నుంచి 46 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందని వివరించారు. శాసనసభలో ''ఎల్‌నినో'' ప్రభావాలు పరిహారక చర్యల' అంశంపైన శుక్రవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. గతంలో 1951, 1965, 1972, 1982, 1987, 2002, 2015 సంవత్సరాల్లో ఎల్‌నినో గతంలో వచ్చినప్పటికీ ఈసారి మాత్రం చాలా క్లిష్టమైన పరిస్థితులు ఏర్పడ్డాయని, ఈ ప్రభావం వల్ల కొన్ని జిల్లాల్లో సాధారణ వర్షపాతం కంటే గణనీయమైన లోటు నమోదవుతోందన్నారు. కొన్ని మండలాల్లో ఒకేసారి క్లౌడ్ బరెస్ట్ జరిగినట్టు ఒక నెలలో పడాల్సిన వర్షం ఒక గంటలో కురిస్తే రికార్డులలో వర్షపాతం నమోదైనప్పటికీ వాస్తవానికి ఆ నీరు ప్రజలకు ఉపయోగపడబోదని తెలిపారు.

**33 లక్షల పంపసెట్లకు నిరంతర విద్యుత్**

వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడుకునేందుకు రైతులు బోర్లపై ఆధారపడుతున్నారని,తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 33 లక్షల పంపుసెట్లు పని చేస్తున్నాయని, అందుకే విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర విద్యుత్ డిమాండ్ సుమారు 19,575 మెగావాట్లకు చేరిందని, ఇలాంటి పరిస్థితుల్లోనూ రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.

**తాగునీటికి తిప్పలు రాకుండా చర్యలు :మంత్రి సీతక్క**



ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు తలెత్తినప్పటికీ తాగునీటికి తిప్పలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. శాసనసభలో ''ఎల్‌నినో ప్రభావాలుపరిహారక చర్యలు'' అనే అంశంపై శుక్రవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి సీతక్క మాట్లాడుతూ నీటి వినియోగం ఉన్న పంటలు కాకుండా, ఆరుతడి పంటలు వేసేలా రైతులను అప్రమత్తం చేశామన్నారు. 'రాష్ట్రంలో తాగు నీటి కోసం ప్రస్తుతం ఉపయోగిస్తున్న జలాశయాల్లో సింగూరు ఒకటే కొంత ఇబ్బందికరంగా ఉంది. సింగూరు రిజర్వాయర్ పరిధిలో నాలుగు జిల్లాల్లోని 2,395 గ్రామీణ ఆవాసాలు, 19 పట్టణ స్థానిక సంస్థలు ఆధారపడి ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో మరమ్మత్తులకు నోచుకోని 10 వేల సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్, చేతి పంపులను రిపేర్ చేసి సిద్ధం చేశామన్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో 5 మాసాల కాలంలో రాష్ట్రవ్యాప్తం గా 7.3 కోట్ల పని దినాలను కల్పించామన్నారు.

**కేంద్రం ఒక్క రూపాయి అదనంగా ఇవ్వలేదు**

రాష్ట్రంలోని తాగునీటి అవసరాల కోసం తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదని, ఇప్పటికైనా నిధులను ఇవ్వాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. వర్షాలు పడకపోతే వ్యవసాయ పనులు తగ్గుతాయని, తద్వారా గ్రామీణ కూలీలకు పని తగ్గుతుందని, పని తగ్గితే ఆ కుటుంబ ఆదాయం కూడా తగ్గుతుందని, అందుకే పని అడిగిన ప్రతి కూలీకి పనిని కల్పిస్తున్నామని వివరించారు. కరువు కాలంలో, కష్ట కాలంలో ప్రజలకు ఉపాధి కల్పించడమే ఉపాధి హామీ పథకం లక్ష్యమని, అందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీల్లో కనీసం 60 కుటుంబాలకు పని కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు రోజుకు సగటున 12 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారని, జూలై నుంచి రోజుకు సగటున 2 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారని, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో గతంలో ఎన్నడు లేని విధంగా రికార్డు స్థాయిలో పనులు కల్పిస్తున్నామన్నారు.

# ఆలేరు, కొండగట్టు అభివృద్ధి పనులకు త్వరలో చర్యలు

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభ జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, మేడిపల్లి సత్యం, మందుల సామేల్‌లు లేవనెత్తిన పలు సమస్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమాధానమిచ్చారు. ఆలేరు నియోజకవర్గంలోని చిన్న మున్సిపాలిటీలు ఆదాయ వనరులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రస్తావించగా, దీనిపై మంత్రి స్పందించారు. కొత్తగా రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డిఓ) కార్యాలయం మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని, అవకాశం కల్పించి ఆలేరు ప్రాంతానికి కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి సభ ద్వారా తీసుకెళ్తున్నట్లు తెలిపారు. బ్రిడ్జి స్థానంలో రహదారి విస్తరణకు సంబంధించిన కసరత్తు జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 'పర్వతమాల' పథకం కింద యాదగిరిగుట్ట తదితర ప్రాంతాల్లో రెండు రోప్‌వేలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కొండగట్టు అంజన్న దేవాలయ ఘాట్ రోడ్డు అంశంపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, ఘాట్ రోడ్డుకు సంబంధించిన డిజైన్ మూడు, నాలుగు రోజుల క్రితమే పూర్తయిందని తెలిపారు. గతంలో జరిగిన ప్రమాదంలో 90 మంది ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని గుర్తు చేస్తూ, త్వరలోనే ఘాట్ రోడ్డుకు అనుమతులు తీసుకుని తాను, మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేతో కలిసి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఇక చెరువుల ఆక్రమణలపై ఎమ్మెల్యే మందుల సామేల్ అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందించారు. చెరువుల కబ్జాల అంశాన్ని గతంలో కూడా ఎమ్మెల్యే ప్రస్తావించారని, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని చెప్పారు.

**స్పీకర్ 'కాబోయే హోంమంత్రి'.. అసెంబ్లీలో బలాలా ఆసక్తికర వ్యాఖ్యలు !**



శాసనసభ సమావేశాల్లో శుక్రవారం ఒక ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. హైదరాబాద్ నగరంలో క్షీణిస్తున్న శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు సభలోనూ, బయటా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. హైదరాబాద్‌లో నేరస్తుల్లో పోలీసులంటే భయం లేకుండా పోయిందని, చట్టాలు, శిక్షలు కఠినంగా లేకపోవడం వల్లే నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని బలాలా అన్నారు. ఈ క్రమంలో ఆయన స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ 'కాబోయే హోంమంత్రి మీరే అవుతారని మాకు సమాచారం ఉంది. అందుకే ఈ లా అండ్ ఆర్డర్ విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను 'కాబోయే హోంమంత్రి' అంటూ ఎంఐఎం ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలతో రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చ మొదలైంది.

**రోడ్డు వేయకపోతే ఆమరణ నిరాహార దీక్షే : మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి హెచ్చరిక**



తన నియోజకవర్గంలో రహదారుల నిర్మాణంపై శాసనసభ జీరో అవర్‌లో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఘాటుగా స్పందించారు. సభలో కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తాను మానకొండూరు నియోజకవర్గం నుంచి గెలిచిన నాటి నుంచీ రోడ్లు నిర్మించాలని కోరుతున్నప్పటికీ అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన మాట ప్రకారం గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు రోడ్డు నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాలని కోరారు. ఒకవేళ ఈ రోడ్డు పనులను గనుక వేగవంతం చేసి పూర్తి చేయకపోతే తాను అసెంబ్లీ వేదికగా ఇచ్చిన మాట ప్రకారం ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ స్థలాల్లో ప్రజలకు పట్టాలు ఇవ్వాలి : రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్**



రాజేంద్రనగర్ శాసనసభ్యుడు టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ తన నియోజకవర్గ పరిధిలోని హనుమాన్‌నగర్, జలాల్ బాబా నగర్ సహా పలు ప్రాంతాలలో దాదాపు 50 సంవత్సరాలుగా ప్రజలు కబ్జాలలో నివసిస్తున్నారని, వారికి ఇప్పటికీ పాస్ పుస్తకాలు, పట్టాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల నాటికైనా ఈ సమస్యను తెంచకపోతే అసెంబ్లీలోనే నిరసనకు దిగుతానని హెచ్చరించారు. ప్రకాష్ గౌడ్ ఆవేదనపై స్పందించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే లేవనెత్తిన అంశంలో పూర్తి నిజాయితీ, ఆవేదన ఉన్నాయని అంగీకరించారు. వీలైనంత త్వరగా తగిన పరిష్కారం చూపుతామని మంత్రి హామీ ఇచ్చారు.

**ఆర్మూర్‌లో అమలు కానీ నీళ్లు, నిధులు, నియామకాలు : పైడి రాకేష్ రెడ్డి**



నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఆర్మూర్ నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని బిజెపి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నిజాం సాగర్ ఫ్యాక్టరీ ఉండేదని, కానీ కాలక్రమేణా ఉన్న నీళ్లు ఇంకిపోయి కాలువలు కబ్జాలకు గురయ్యాయన్నారు. గుత్తిప వద్ద ఉన్న రాజన్న చెరువు సామర్థ్యాన్ని పెంచడం, మాదాపూర్ వద్ద ఉన్న అల్లీసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్‌ను పునరుద్ధరించడం ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించవచ్చని సభ దృష్టికి తీసుకెళ్లారు.

**మక్కా, పబ్లిక్ గార్డెన్ మసీదు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: మాజిద్ హుస్సేన్**



హైదరాబాద్‌లోని మక్కా మసీదు, పబ్లిక్ గార్డెన్ మసీదు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ రెండు మసీదుల ఉద్యోగులకు ఇప్పటివరకు ఉద్యోగ నిబంధనలు రూపొందించలేదని, స్వాతంత్ర్యానికి ముందు నుంచే పనిచేస్తున్న వారికి ఎలాంటి సెలవులు లేకుండా రోజుకు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మక్కా మసీదు 400 ఏళ్ల చరిత్ర కలిగి ఉండగా, పబ్లిక్ గార్డెన్ మసీదు 100 ఏళ్ల నాటి వారసత్వ కట్టడమన్నారు. ఈ మసీదుల నిర్వహణ గతంలో రెవెన్యూ ఎండోమెంట్స్ శాఖ పరిధిలో ఉండగా, 1996–97లో మైనారిటీ సంక్షేమ శాఖకు బదిలీ చేసినట్లు తెలిపారు.

**వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి : ఎంఐఎం ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ**

రాష్ట్రంలోని వక్ఫ్ భూములు, ఆస్తుల పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఐఎం ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ కోరారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా వక్ఫ్ భూముల దుర్వినియోగాన్ని అరికట్టేలా కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై దానం నాగేందర్ అసంతృప్తి**



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తన నియోజకవర్గానికి కేటాయించిన ఇళ్లను ఇతర నియోజకవర్గాల వారికి కేటాయించారని, లక్కీ డ్రా సమయంలో ఈ విధమైన పొరపాట్లు జరగడం పట్ల ఆయన అసంతృప్తి వెల్లడించారు. మలక్‌పేటకు చెందిన లబ్ధిదారులకు ఖైరతాబాద్‌లో ఇళ్లు కేటాయించడం నిబంధనలకు విరుద్ధమని, హైదరాబాద్‌లోని 15 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం ఇవ్వాలని, అర్హులైన స్థానిక పేదలకే ఆయా నియోజకవర్గాల్లో ఇళ్లు దక్కేలా చర్యలు తీసుకోవాలని సభ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.


## ప్రమాదవశాత్తు తుపాకి పేలి ఆర్ఐ మృతి



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** ప్రమాదవశాత్తు మిస్‌ఫైర్ కావడం వల్ల రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ హెచ్.సతీష్ (41) మరణించిన సంఘటన నిజామాబాద్ నగరంలో చోటుచేసుకుంది. శుక్రవారం నిజామాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎన్ఎస్ఓ (నైట్ సెక్యురిటీ ఆఫీసర్) డ్యూటీ ముగించుకొని వచ్చిన తర్వాత ఉదయం సమయంలో ఆయుధం క్లీన్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు మిస్‌ఫైర్ కావడం వల్ల రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ హెచ్.సతీష్ (41) మరణించారు. సంఘటన స్థలాన్ని హుటాహుటిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పర్యవేక్షించారు. అనంతరం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం పోలీస్ కమిషనర్ పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నివాళులు అర్పించిన వారిలో అదనపు డిసిపి అడ్మిన్ శుభం ప్రకాష్, నిజామాబాద్ ఏసిపి ప్రకాష్, ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి, బోధన్ ఏసిపి శ్రీనివాసులు, ఏఆర్ ఏసిపి కృష్ణస్వామి, సిసిఎస్ ఏసిపి శ్రీశైలం, టాస్క్‌ఫోర్స్ ఏసిపి నరేందర్, సిటిసి ఏసిపి రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మల్లేశం, సిఐలు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీను, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలి

సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో విద్యుత్ సమస్య తీవ్రంగా మారుతోందని, పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కొత్త విద్యుత్ ఉత్పత్తి యూనిట్‌ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివ రావు కోరారు. శాసనసభలో శుక్రవారం జీరో అవర్ సందర్భంగా ఆయన పలు ప్రజా సమస్యలను ప్రస్తావించారు. ప్రస్తుతం వర్షాభావం కారణంగా జలవిద్యుత్ ఉత్పత్తి దెబ్బతిన్నందున విద్యుత్ కొరత ఏర్పడిందని సభ దృష్టికి తీసుకొచ్చారు. రోజుకు సుమారు 300 మిలియన్ యూనిట్‌ల విద్యుత్ డిమాండ్ ఉండగా, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఉత్పత్తి సామర్థ్యం సుమారు 130 మిలియన్ యూనిట్‌లకే పరిమితమైందని తెలిపారు. మిగిలిన అవసరాన్ని కొనుగోలు ద్వారా తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఇటీవల థర్మల్ విద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ, విద్యుత్ రంగం లో స్థిరమైన బేస్‌లోడ్ అవసరమని కూనంనేని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఇటీవల మూతపడిన ఒక థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. పోలీసులకు రావాల్సిన టిఏ బిల్లులు, సరెండర్ లీవులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇతర ఉద్యోగుల డిఏ బకాయిలలో కనీసం రెండు లేదా మూడు విడతలైనా వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కొత్తగూడెం మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారినప్పటికీ హెచ్‌ఆర్‌ఏ అమలులో సమస్యలు కొనసాగుతున్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. అలాగే సింగరేణి సంస్థలో కాంట్రాక్ట్ కార్మికులు, పంచాయతీలు, మున్సిపాలిటీలు, ఆరోగ్య శాఖ, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు.

## నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు ప్రజాస్వామ్య విజయం: బండి సంజయ్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేయడం ప్రజాస్వామ్య విజయమని బీజేపీ నేత, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శాసన వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయాలనుకున్న కాంగ్రెస్ కు ఇది చెంపపెట్టు అని పేర్కొన్నారు. శాసన వ్యవస్థ విచక్షణాధికారంలో న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పీకర్ తలొగ్గడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిష్పక్షపాతంగా వ్యవహరించి ఉంటే నేడు ఈ పరిస్థితి తలెత్తేది కాదని అభిప్రాయపడ్డారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం క్షమించరాని నేరమన్నారు. పట్టపగలు దేశమంతా చూస్తుండగా హత్య చేసిన వ్యక్తిని నిర్దోషిగా ప్రకటించడం ఎంత తప్పో.. ఒక పార్టీ నుండి గెలిచి ఆ పార్టీకి రాజీనామా చేయకుండా మరో పార్టీ నుండి పోటీ చేసినా అనర్హత వేటు వేయకపోవడం అంతే తప్పు అని పేర్కొన్నారు.

# ప్రాణహిత-చేవెళ్ల కడదామా? వద్దా? బిజెపి సమాధానం చెప్పాలి

● శాసనసభలో బిజెపి సభ్యులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూటి ప్రశ్న



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 'ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు'ను తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, అసలు ఈ ప్రాజెక్టును కడదామా? వద్దా? అనే దానిపై బిజెపి స్పష్టమైన వైఖరిని చెప్పాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. శాసనసభలో శుక్రవారం ఎల్‌నినో ప్రభావంపై తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యల గురించి జరుగుతున్న చర్చ సందర్భంగా భాగంగా బిజెపి సభ్యులు ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు అంశం లేవనెత్తడంతో డిప్యూటీ సిఎం జోక్యం చేసుకుని మాట్లాడారు. గతంలో వైఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణ ప్రాంతానికి గ్రావిటీ ద్వారా నీళ్లందించాలనే ఆలోచనతో తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టిన విషయాన్ని డిప్యూటీ సిఎం గుర్తు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా పక్కనబెట్టి, కాళేశ్వరం వద్ద ప్రాజెక్టు కట్టి లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసిందని విమర్శించారు. తెలంగాణకు ముఖ్యమైన 'ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు' విషయంలో అటు బిఆర్ఎస్, ఇటు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అనుమతుల కోసం కేంద్రాన్ని, మహారాష్ట్రను ఒప్పించండి**

''తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే నీళ్ల కోసం. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు కోసం ఏడు మండలాలను ఆంధ్రాకు ఇవ్వడానికి వీల్లేదని సోనియా గాంధీ పట్టుబట్టారు. కానీ బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కేంద్రం ఆర్డినెన్స్ తెచ్చి 2 లక్షల ఎకరాల ముంపు భూములతో కూడిన 7 మండలాలను ఎపిలో కలిపేస్తే బిఆర్ఎస్ నోరు మెదపలేదు. అక్కడ 2 లక్షల ఎకరాలు ఇచ్చేసినవారు తుమ్మిడిహెట్టి వద్ద కేవలం 2,000 ఎకరాల ముంపు సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోయారు?'' అని డిప్యూటీ సిఎం ప్రశ్నించారు. ఒక్క రూపాయి పరిహారం ఎక్కువ ఇచ్చైనా సరే ముంపు భూ బాధితులను ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బిజెపి శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ఆ జిల్లాకు ప్రాణహిత నీళ్లు వరప్రసాదమని పేర్కొన్నారు. బిజెపి నాయకులు తమ పలుకుబడిని ఉపయోగించి కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర జలశక్తి శాఖను, పొరుగున ఉన్న మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి అవసరమైన అనుమతులు తీసకురావాలని డిప్యూటీ సిఎం కోరారు. బిఆర్ఎస్ సభ్యుడు హరీష్ రావు ఇచ్చిన సలహాను తాము సానుకూలంగా స్వీకరించి ప్రాజెక్ట్ కడతామని చెప్పామని, బిజెపి సభ్యులు కూడా రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్రంతో మాట్లాడి అనుమతులు తెస్తామని అంటారని ఆశించామని భట్టివిక్రమర్కా చెప్పారు. అయితే సభలో అవకాశం ఇవ్వగానే ప్రధాన విషయాన్ని వదిలేసి వేరే అంశాల్లోకి వెళ్లిపోయారని ఆక్షేపించారు. 'ఇప్పుడు రాష్ట్రం ముందున్న ప్రధాన ప్రశ్న తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు కడదామా? వద్దా? బిజెపి సహకరిస్తుందా? లేదా? స్పష్టంగా చెప్పాలి. బిజెపి సహకరించినా, సహకరించకపోయినా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం భూమి ఆకాశాలు ఒకటైనా ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును నిర్మించే తీరుతుంది' అని డిప్యూటీ సిఎం సభలో స్పష్టం చేశారు.

## ఎల్‌నినోపై ముందస్తు చర్యలు తీసుకోలేదు

● బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతి వైఫల్యానికి ఎల్‌నినోను సాకుగా చూపి ప్రభుత్వం తప్పించుకోలేదని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆరు నెలల క్రితమే కేంద్ర వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రణాళికలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రూ.800 కోట్లతో ప్రణాళికలు రూపొందించామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి, కనీసం 6 నుంచి 8 గంటలు కూడా సరిగా ఇవ్వలేకపోతున్నారని ఆరోపించారు. డిస్కంలకు, సింగరేణికి వేల కోట్ల రూపాయల బకాయిలు పడటం వల్లే విద్యుత్ ఉత్పత్తి మందగించిందని, చివరికి ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోనే రైతులు కరెంట్ కోసం రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నియమించిన డాక్టర్ చిన్నారెడ్డి నేతృత్వంలోని నిపుణుల కమిటీ రూ.802.92 కోట్ల వ్యయంతో పలు రికమండేషన్లు చేసిందని, అయితే వాటిని అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం చిన్నారెడ్డిని పదవి నుంచి తొలగించిన నేపథ్యంలో అసలు ఆ కమిటీ ఉందో లేదో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించడంతో పాటు, కరువు మండలాలను వెంటనే ప్రకటించి అన్నదాతను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : సికింద్రాబాద్ జోన్**

NIT No. Corrigendum to Tender Notice No. 14/EE-II/Cir-43/SBZ/GHMC/2026-27, Date: 17.09.2026

**పని పేరు:** సివిల్ పనులు : 1 నెం., **అంచనా విలువ:** రూ.3.30లక్షలు, **బిడ్స్ సమర్పణకు ప్రారంభ తేది & సమయం / బిడ్స్ సమర్పణకు ఆఖరి తేది & సమయం:** 17.09.2026 మ.2:30గం.ల నుండి 22.09.2026 మ.2:30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక. సెల్ నెం. 9704405076. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 10225-PP/CL/ADVT/2026-27, Date: 18-09-2026

తెలంగాణ ప్రభుత్వం

**రోడ్లు మరియు భవనాల శాఖ**

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004.

NIT నం. 18/AEE/DEE(T)/EE/SBD/Maintenance Works/2026/, తేదీ: 18.09.2026.

| | | | | |
|---|---|---|---|---|
| పనుల పేరు: | 1 | రంగారెడ్డి జిల్లా, ఎల్.బి.నగర్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టు భవన సముదాయంలో గల జూనియర్ బ్లాక్ మరియు సీనియర్ బ్లాక్ నివాస గృహాల ప్రధాన డ్రైనేజీ లైన్ మార్పు / పునరుద్ధరణ పనులు. | ECV: రూ. 9,04,075/- | EMD: రూ. 9,050/- |
| | 2 3 | గౌరవనీయులైన న్యాయమూర్తి శ్రీ చలపతి రావు సుద్దాల గారి అధికారిక నివాసం (ప్లాట్ నం. 232-B, శ్రీ హోమ్, 1వ అంతస్తు, RTA కార్యాలయానికి ఎదురుగా ఉన్న వీధి, రాఘవేంద్ర కాలనీ, కొండాపూర్, హైదరాబాద్-500084) వద్ద కొత్త సెంట్రీ పోస్ట్ (భద్రతా సిబ్బంది గది) ఏర్పాటుకు సంబంధించిన సివిల్ పనులు. | ECV: రూ. 1,90,881/- | EMD: రూ. 1,910/- |
| | 4 | హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని 'న్యాయ విహార్' సముదాయంలో గల సర్వెంట్ క్వార్టర్స్‌లో నీటి లీకేజీని అరికట్టడానికి సంబంధించిన సివిల్ పనులు. | ECV: రూ. 87,541/- | EMD: రూ. 880/- |
| | | రంగారెడ్డి జిల్లా, ఎల్.బి.నగర్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టు భవన సముదాయంలో గల న్యాయమూర్తుల నివాస గృహం నం. S3 కు సంబంధించిన మరమ్మతు పనులు. | ECV: రూ. 23,67,934/- | EMD: రూ. 23,700/- |

| | |
|---|---|
| డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: | 19-09-2026న మధ్యాహ్నం 03:00 గంటలకు |
| బిడ్లను స్వీకరించడానికి చివరి తేదీ & సమయం: | 28-09-2026న మధ్యాహ్నం 03:30 గంటల వరకు |
| బిడ్ తెరిచే తేదీ: | 28-09-2026న సాయంత్రం 04:00 గంటల నుండి |
| ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) పేరు మరియు చిరునామా: | శ్రీ జి. రజనీ బాబు, M.Tech, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్. |

మరిన్ని వివరాలను 19.09.2026న మధ్యాహ్నం 03:00 గంటల నుండి https://tender.telangana.gov.in లోని ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్.

DIPR R.O. No. : 10228-PP/CL/ADVT/2026-27, Date: 18-09-2026



## బీరం లక్ష్మారెడ్డి భౌతికకాయానికి మంత్రి జూపల్లి నివాళులు

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కొల్లాపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి మరణించారు. విషయం తెలుసుకున్న టూరిజం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి నివాసానికి వెళ్లి లక్ష్మారెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి, నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిని మంత్రి జూపల్లి పరామర్శించి లక్ష్మారెడ్డి మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి జూపల్లి వెంట ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## హక్కుల సాధన కోసం ఉద్యమ కార్యాచరణకు పిలుపు

వి.హన్మంతరావు

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ :** బిసిల హక్కులు, ఆత్మగౌరవం, సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కోసం గద్వాల గడ్డపై నిర్వహించిన బిసి సింహ గర్జన విజయవంతమైంది. ఎఐసిసి అగ్ర నాయకత్వం, ఎంపి రాహుల్ గాంధీ సూచనల మేరకు టిపిసిసి పిలుపుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గద్వాల డిసిసి అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, బీసీ సంక్షేమం, అభివృద్ధి అంశాల బాధ్యతలు నిర్వహిస్తున్న వి.హన్మంతరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వి.హన్మంతరావు మాట్లాడుతూ బీసీల హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ మార్గంలో ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వంద రోజుల పాటు సభలు, సమావేశాలు నిర్వహించి బిసిలను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టి, అనంతరం ఢిల్లీలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించే దిశగా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సింహ గర్జన కేవలం సభ కాదు. హక్కుల కోసం గొంతుక గద్వాల గడ్డపై వినిపించిన బిసి సింహగర్జన ఒకరోజు కార్యక్రమంతో ముగిసేది కాదని, బిసి సమాజాన్ని చైతన్యపరిచి హక్కుల సాధన దిశగా ముందుకు నడిపించే ఉద్యమానికి ఇది ఒక వేదికగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. రాజకీయ ప్రాతినిధ్యం, విద్యా, ఉద్యోగ అవకాశాలు అందాలనే డిమాండ్‌ను ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

**డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ ..**

మన పిల్లలకు నాణ్యమైన విద్య... మన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు.. మన మహిళలకు ఆర్థిక సాధికారత... బిసి వృత్తులకు ప్రోత్సాహం... జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం ఇవన్నీ సాధించాలంటే బీసీలలో ఐక్యత, చైతన్యం, సంఘటిత పోరాటం అవసరమని నాయకులు స్పష్టం చేశారు. బీసీ అంటే బలహీనత కాదు.. బిసి అంటే ఒక శక్తి.. ఆ శక్తి ఐక్యమైతే హక్కుల సాధనకు బలమైన ప్రజాస్వామ్య ఉద్యమంగా మారుతుంది అనే నినాదంతో సభ మార్మోగింది. కులాలు, ప్రాంతాలు, వర్గాల మధ్య భేదాలను పక్కనపెట్టి బిసి సమాజం మొత్తం ఒకే వేదికపైకి రావాలని, రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో గళం విప్పాలని పిలుపునిచ్చారు. పాత బస్టాండ్ నుంచి క్రిష్ణవేణి చౌరస్తాలోని పూలే విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కు ఒబిసి డిమాండ్లతో వినతిపత్రం అందించారు. ఎఐసిసి ఓబిసి రుద్ర సంతోష్, టిపిసిసి జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ గౌడ్, మహబూబ్‌నగర్ డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘ్ స్టేట్ చైర్మన్ రాజేందర్ ప్రసాద్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, టిపిసిసి నాగర్‌కర్నూల్ పార్లమెంటు ఇన్‌చార్జి కొండేటి మల్లయ్య, టిపిసిసి ఓబిసి కన్వీనర్ ధనలక్ష్మి , మాజీ చైర్మన్ బండారి భాస్కర్, ఓబిసి వైస్ చైర్మన్ టి.సి.శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తుమ్మల జయలక్ష్మి , నర్సింహులు యాదవ్, రామన్‌గౌడ్, కొత్త గణేష్, గౌస్, కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి ఎన్నికల కమిషన్ 'సర్' నోటీసు

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డికి ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(సర్) నోటీసు జారీ చేశారు. గతంలో ఉన్న ఓటరు జాబితాలలో, చిట్టెం రామ్మోహన్ రెడ్డి తండ్రి పేరు కేవలం సి.నర్సిరెడ్డి అని ఉండడంతో దానిని సవరించేందుకు ఆయనకు ఈ నోటీసు ఇచ్చారు. నోటీసు అందిన వెంటనే ఆయన శుక్రవారం మక్తల్ తహసీల్దార్ కార్యాలయానికి హాజరయ్యారు. తన తండ్రి పూర్తి పేరు చిట్టెం నర్సిరెడ్డి అని నిరూపించే ధృవీకరణ పత్రాన్ని తహసీల్దార్ సతీష్ కుమార్‌కు అందజేశారు. భారతీయుడిగా ఓటర్ జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియకు సహకరించాలని తహసీల్దార్ సతీష్ కుమార్ అన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ప్రజాపక్షం/కృష్ణ :** పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. ఈఘటన కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం 8:30 సమయంలో చోటుచేసుకుంది. ఎస్సై నవీద్ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణ మండలం తంగిడి గ్రామ శివారులో కొందరు వ్యక్తులు పేకాడుతున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.10,600 నగదు, రెండు సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు కృష్ణ ఎస్సై నవీద్ తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో చేతివాటం ప్రదర్శిస్తే క్రిమినల్ కేసులు

రాష్ట్ర విజిలెన్స్ అధికారి బాలరాం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో చేతివాటం ప్రదర్శించినట్లు తేలితే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విజిలెన్స్ అధికారి బాలరాం హెచ్చరించారు. మీడియాలో ఇటీవల ప్రచురితమైన కథనాలపై శుక్రవారం బిజినపల్లి మండలం, అచ్చంపేట పట్టణంలో పర్యటించి సంబంధిత అధికారులతో సమావేశమై విచారణ నిర్వహించారు. లబ్ధిదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసినా, ఇతర అక్రమాలకు పాల్పడినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయం లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. మీడియా కథనాల్లో పేర్కొన్న అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించి అవసరమైన తదుపరి చర్యలు చేపడతామని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

# ప్రజా ఉద్యమాలే అమరులకు నివాళులు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కల్లపల్లి శ్రీనివాస్ రావు, ఈ.టి నరసింహ



**ప్రజాపక్షం/అమరచింత :** అమరచింత మండల కేంద్రంలో ఇటీవల క్యాన్సర్ వ్యాధితో జ్యోతి మృతి చెందిన సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు కుటుంబాన్ని పరామర్శించడానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కల్లపల్లి శ్రీనివాసరావు, ఈటి నరసింహ లుతో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవైన శంకర్, ఎం.బాలనరసింహ, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ సందర్శించి, జ్యోతి చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు.

పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టి.శ్రీనివాసరావు, ఈటి నరసింహ లు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలే అమరులకు ఘన నివాళులు అని కొనియాడారు. అనంతరం విజయరాములు కుటుంబాన్ని ప్రగాఢ సానుభూతిని తెలిపి ఓదార్చారు. అనంతరం ఈనెల 20న అమరచింతలో జరగనున్న జ్యోతి సంస్మరణ సభ ప్రాంగణాన్ని నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా తక్కల్లపల్లి శ్రీనివాస రావు, ఈ.టి నరసింహ మాట్లాడుతూ సొంత లాభం కొంత మానుకొని పొరుగువారికి తోడ్పడమనే సూక్తిని అనుసరించి కామ్రేడ్ కె.విజయ రాములు చిన్నతనం నుండే ప్రజల పట్ల అమితమైన ప్రేమతో ప్రజా సమస్యలపై ఎర్రజెండా ఎత్తుకొని విరోచిత పోరాటాలు నడిపారని అన్నారు.

అలాంటి ప్రజా ఉద్యమాన్ని నేతకు బలం చేకూరే విధంగా జ్యోతి జీవితాంతం ఆదర్శ విప్లవ భావజాలానికి అనుగుణంగా నడుచుకోవడం ఎంతో గర్వకారణమని అన్నారు. నేటి రంగుల ప్రపంచంలో స్వార్థపూరిత కోరికల రెక్కలు కట్టుకొని పరిగెడుతన్న నేటి ఆధునిక యుగంలో కూడా అణువంత స్వార్థం లేకుండా కష్టపడి కుటుంబాన్ని సాకుతూ ప్రజల బాగోగులు విజయరాములు దంపతుల జీవిత ఎజెండగా పెట్టుకొని ప్రజా ఉద్యమాలలో నిమగ్నం కావడం ఎంతో త్యాగమని అన్నారు.

జ్యోతి మరణం యావత్ కమ్యూనిస్టు పార్టీ నాయకులను కలవర పెట్టిందని, విజయ రాములు మనోధైర్యంతో ముందుకు సాగాలని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నేత సి.నరసింహ శెట్టి, అమరచింత మండల కార్యదర్శి ఎ.అబ్రహం, సిపిఐ నాయకులు కథలప్ప, లక్ష్మీ నారాయణ, ఆర్.ఎన్.కుమార్, ఎం.రఘు, బాలస్వామి, కురుమూర్తి, గీత, పద్మమ్మ, శారత, భారతి పాల్గొన్నారు.



## వెదురు ఆధారిత ఉపాధి అవకాశాలపై అవగాహన : ఇడి అబ్దుల్ ఖలీల్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** వెదురు ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణ వెదురు ఆధారిత ఉపాధి అవకాశాలు, ఉత్పత్తుల వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎస్సీ కార్పొరేషన్ ఇడి అబ్దుల్ ఖలీల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్లో ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెదురు మన దేశంలో అనాదిగా ఉపయోగిస్తున్న ముఖ్యమైన సమాజ వనరు అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వెదురుతో బుట్టలు, గంపలు, చాపలు, గృహోకరణాలు, వ్యవసాయ పనిముట్లు, వివిధ రకాల హస్తకళా వస్తువులు తయారు చేస్తున్నారని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వెదురుతో ఫర్నిచర్, అలంకరణ వస్తువులు, నిర్మాణ సామగ్రి తదితర ఉత్పత్తులను కూడా తయారు చేయవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఎఒ అనిల్, డిపిఆర్వో ఎం.ఎ రషీద్, సిపిఒ, మున్సిపల్ కమిషనర్ శంకర్, బాలాజీ, సభ్యులు, సాయిబాబా, కృష్ణ, పావని, వెంకటేశ్వరమ్మ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల నియామకంలో అక్రమాలకు చెక్ పెట్టాలి : గ్రామస్తులు

అర్హులైన నిరుద్యోగులకు అవకాశం ఇవ్వాలి

**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలో ప్రభుత్వ రెగ్యులర్ రేషన్ డీలర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు, మూడు సంవత్సరాలకు ఒకసారి తాత్కాలిక డీలర్ల మార్పులు, ప్రభుత్వాలు మారినప్పుడల్లా డీలర్ల మార్పులు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో శాశ్వత రేషన్ డీలర్ నియామకం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రేషన్ డీలర్ల నియామకాల్లో అవకతవకలు, జాప్యం లేకుండా అర్హులైన వారికి అవకాశం కల్పించాలని నిరుద్యోగ మహిళలు, పురుషులు, వికలాంగులు, యువతి యువకులు కోరుతున్నారు. గతంలో తాత్కాలిక డీలర్ల నియామకాల్లో రూ. లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయని, ప్రస్తుతం కూడా నియోజకవర్గ వ్యాప్తంగా రేషన్ డీలర్ల నియామకాల్లో డబ్బులు చెల్లించిన వారికే అవకాశం కల్పిస్తున్నారనే ప్రచారం జరుగుతోందని పలువురు చర్చించుకుంటున్నారు. అయితే ప్రభుత్వం రెగ్యులర్ నోటిఫికేషన్ విడుదల చేసి, అర్హత కలిగిన అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా రేషన్ డీలర్లను నియమించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. రాజకీయ నాయకులు, వారి అనుచరుల జోక్యానికి తావులేకుండా పారదర్శకంగా నియామక ప్రక్రియ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## ఎస్సీ, ఎస్టీ సంక్షేమ నిధులు సద్వినియోగం

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్/అలంపూర్ :** షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమానికి ప్రభుత్వం కేటాయించే నిధులను సద్వినియోగం చేసుకునేలా సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సంబంధించిన ల్యాండ్, సర్వీస్, అట్రాసిటీస్, తదితర అంశాలపై శుక్రవారం ఐడిఒసి సమావేశపు మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, సంతు సేవాలాల్ మహారాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు అలంపూర్ శ్రీ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ జిల్లాలో అట్రాసిటీ కేసులను పరిష్కరించేందుకు, బాధితులకు పరిహారం చెల్లించడం విషయంలో నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో స్పందించి ముందుకెళ్లాలన్నారు. ప్రభుత్వం రూ.2వేల కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను బడ్జెట్లో కేటాయించిందని, సంబంధిత వర్గాల వార్డుల్లో సిసి రహదారులు, డ్రైనేజీలు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపితే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో వివిధ విభాగాల్లో విధులను నిర్వహిస్తున్న కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విదేశీ విద్యానిధి పథకంకు ఎప్పటికప్పుడు నిధులు సమకూరేలా ప్రభుత్వంతో మాట్లాడుతునన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పదవతరగతి ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లోనూ అర్హులైన విద్యార్థులందరికి ఉచిత విద్య అందేలా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర దృష్టికి తీసుకెళ్లానన్నారు. కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, ఎన్జీవో ఆర్గనైజేషన్ మెంబర్ గంధం నాగరాజు, అదనపు కలెక్టర్లు మధుమోహన్ నర్సింగరావు, అదనపు ఎస్పీ శంకర్, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కురుమన్న, శైలజ, మల్లికార్జున సురేష్ నాయక్, జిల్లా ఎస్పీ అభివృద్ధి శాఖ అధికారి నాగరాజు, కార్పొరేషన్ ఈవో సుదర్శన్, ఎస్టీ అభివృద్ధి అధికారి యాదమ్మ, ఇతర జిల్లా అధికారులు, తాహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలోకి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** నవతెలంగాణ నవాబుపేట కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, హామీలకు ఆకర్షితులై లింగంపల్లి గ్రామానికి చెందిన 30 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు తానం సుధాకర్ ఆధ్వర్యంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరు ధ్ రెడ్డి మాతృమూర్తి శశికళ రెడ్డి సమక్షంలో వారిని పార్టీలోకి ఆహ్వానించి కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ముంత నర్సింహులు, అంబదాస్ నాయక్, బంక వెంకటయ్య కోస్గి రాజు మల్లేష్, లింగంపల్లి నాయకులు సుధాకర్ రెడ్డి, వినోద్‌రెడ్డి, గోవిందు నర్సింలు, శేఖరయ్య, నవీన్, కొంగల కృష్ణయ్య, కొంగళ్ల అంజిలయ్య, ఎర్రోల్ల సత్తయ్య, కొంగల యాదయ్య, కొంగల అంజయ్య, ప్రకాష్, భాను ప్రకాష్, మల్లేష్, నరేష్, లింగమయ్య, యాదయ్య, శివకుమార్, విఘ్నేష్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటిని విడుదల చేయాలని రైతుల ధర్నా

**ప్రజాపక్షం/అమరచింత :** రైతులు సాగుచేసిన పంటలకు జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి సాగునీటిని విడుదల చేయాలని మండల పరిధిలోని రైతులు శుక్రవారం జూరాల ప్రాజెక్టుపై ధర్నా నిర్వహించారు. జూరాల ఎడమ కాలువ పరిధిలోని అమరచింత, ఆత్మకూరు మండలాల రైతులు కొద్దిపాటి వరి పంటలను సాగు చేసుకుని ఉన్నారని రైతులు తెలిపారు. ఆ కాలువ నుంచి నీటిపారుదల శాఖ అధికారులు సాగునీటిని మొదట్లో పంపిణీ చేసి గత వారం రోజులుగా సాగునీటిని విడుదల చేయకుండా ఆపివేశారని రైతులు ఆందోళన చెందుతూ ధర్నాకు పూనుకున్నారు. జూరాల ప్రాజెక్టుపై రైతులు ధర్నా నిర్వహించడం ద్వారా ప్రాజెక్టుపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆందోళన చేస్తున్న రైతులను సముదాయించేందుకు ఎస్సై స్వాతి ప్రయత్నం చేసింది. రైతులు తక్షణమే సాగునీటి విడుదల చేయాలని లేనిపక్షంలో రైతులు ఆత్మహత్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై స్వాతి ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి సాగునీటిని విడుదల చేసేందుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన కార్యక్రమాన్ని విరమింపజేశారు.



## విద్య దృఢ సంకల్పానికి నిధులే నిదర్శనం

ప్రభుత్వ పాఠశాలకు రూ.11 కోట్లు నిధులు
మాజీ ఎంపిపి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** ప్రభుత్వ బడులను బలోపేతం చేయడం ద్వారా బడుగు బలహీన వర్గాల వారి పిల్లలను బలోపేతం చేయుటకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు పెద్దకొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.11కోట్ల నిధులు కేటాయించడం చారిత్రాత్మకమని మాజీ ఎంపిపి సూర్య ప్రతాప్‌గౌడ్ అన్నారు. విద్య పట్ల మంత్రి జూపల్లి కృష్ణారావు చూపుతున్న దృఢ సంకల్పానికి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేటాయించిన నిధులే నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయడం వల్ల సామాన్య, పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందడంతో పాటు రాబోయే తరాల భవిష్యత్తు కు మంచి పునాది ఏర్పడుతుందన్నారు. విద్యకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో కుటుంబాలు తమ ఆర్థిక స్తోమతకు మించి వివిధ కార్యక్రమాలు, శుభకార్యాలు, ఇతర ఖర్చులు చేయడం వల్ల ఆర్థిక ఇబ్బందుల్లో వెళ్తున్నరని మాజీ ఎంపిపి సూర్య ప్రతాప్‌గౌడ్ అన్నారు. ప్రతి సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రజలకు అవగాహన కల్పిస్తూ పిల్లల చదువు, భవిష్యత్తుపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచిస్తున్నారని మాజీ ఎంపీపీ అన్నారు. .

**సమస్యలకు పరిష్కారమే లక్ష్యంగా పాలన :**

రాజకీయాల్లో వ్యతిగత కక్షలు, పరస్పర విమర్శల కంటే ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడమే ముఖ్యమని మాజీ ఎంపిపి సూర్య ప్రతాప్ గౌడ్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, విద్య, మౌలిక వసతులకు ప్రాధాన్యతనిస్తూ జూపల్లి కృష్ణారావు పాలన కొనసాగడం అభినందనీయమని పేర్కొన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్న నాయకత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.



## తల్లుల ఆరోగ్యమే ఆరోగ్యవంతమైన తరానికి పునాది : కలెక్టర్ ప్రియాంక

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** తల్లుల ఆరోగ్యమే ఆరోగ్యవంతమైన తరానికి పునాది అని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. గర్భిణీలు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. శుక్రవారం ఉట్కూర్ మండలం నిడుగుర్తి గ్రామ రైతు వేదికలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో నిర్వహించిన 9వ పోషణ మాసం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణలో కుటుంబంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అంగన్వాడీ కార్యక్రమాల్లో మహిళలతో పాటు పురుషులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు. గర్భధారణ ప్రారంభం నుంచే తల్లి ఆరోగ్యం, పోషకాహారంపై శ్రద్ధవహిస్తే శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే అందించే ముర్రుపాలు (కొలస్ట్రం) ఎంతో విలువైనవని, శిశువులకు మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఆరు నెలల లోపు శిశువులకు, నీరు, తేనే తదితర ప్రత్యామ్నాయ ఆహారాలు ఇవ్వకూడదని తెలిపారు. బాలింతలు సంప్రదాయ నమ్మకాల కారణంగా కొన్ని ఆహార పదార్థాలకు దూరంగా ఉండకుండా వైద్యుల సూచనల మేరకు సమతుల్య, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూ రాజేందర్ గౌడ్, గ్రామ సర్పంచి రాములు, ఉపసర్పంచి సంతోష్ కుమార్, సిడిపిఒ వెంకటేశ్వరమ్మ, సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం-3లో పోషణమాసం కార్యక్రమం



**ప్రజాపక్షం/నర్వ :** పోషణమాసం సందర్భంగా అంగన్‌వాడి కేంద్రం 3 ఉందేకోడు గ్రామం నందు బిడ్డ ఆరోగ్యం ఎదుగుదల, భవిష్యత్తుకు బలమైన పునాది పోషకహారము అని సరైన పోషణ ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత, ప్రేమతో కూడిన సంరక్షణ బిడ్డ ఎదుగుదలకు ఎంతో ముఖ్యమని గర్భిణీలకు, బాలింతలకు, మహిళలకు అవగాహన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు, అనురాధ, బాలమణి, సుశీల, ఆశా కార్యకర్తలు, మణెమ్మ, భీమమ్మ, గర్భిణీలు, బాలింతలు , మహిళలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.




## ప్రతి మారుమూల ప్రాంతానికి మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాలు

కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్


**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నల్లమల్ల అటవీ ప్రాంతంతో పాటు జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ 4జీ సాచ్యురేషన్ మోడ్స్ ఏర్పాటు చేసి మెరుగైన నెట్‌వర్క్ సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బిఎస్ఎన్ఎల్ అధికారులతో సమీక్ష నిర్వహించి టవర్ల ఏర్పాటు, భూసేకరణ, అనుమతులపై చర్చించారు. నల్లమల్లలో టవర్ల ఏర్పాటుతో వన్యప్రాణులకు ఇబ్బందులు కలగకుండా అటవీశాఖ నిబంధనలను పాటించాలని సూచించారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే చెంచు గిరిజనులకు మెరుగైన కమ్యూనికేషన్ సేవలు అందేలా అవసరమైన చోటు టవర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, బిఎస్ఎన్ఎల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**పశువుల వివరాల డిజిటలైజేషన్ 100 శాతం పూర్తిచేయాలి...**

నేషనల్ డిజిటల్ లైవ్‌స్టాక్ మిషన్‌లో భాగంగా జిల్లాలోని అన్ని పశువులు, ఇతర జంతువుల వివరాలను 100 శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.

## సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు అఖిలపక్ష కమిటీ వినతి



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా రేపల్లె గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన ఇంటిని కూల్చివేసిన ఘటనపై అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఇంటి కూల్చివేతకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్‌ను కోరారు. దళిత కుటుంబానికి జరిగిన నష్టాన్ని ప్రభుత్వం వెంటనే గుర్తించి, బాధితులకు నూతన పక్కా ఇంటిని నిర్మించి ఇవ్వడంతో పాటు 25 లక్షలు తగిన నష్టపరిహారం అందించాలని అఖిలపక్ష నాయకులు డిమాండు చేశారు. దళితుల హక్కులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహించకుండా బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్‌రాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, సిపిఐఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి, బహుజన రాజ్య సమితి నాయకులు వినోద్, కోళ్ల హుస్సేన్ , వాల్మీకి బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కుర్వపల్లయ్య, అవాజ్ కమిటీ రాష్ట్ర నాయకులు అతికూర రెహ్మాన్, టిపిఎఫ్ రాష్ట్ర కోశాధికారి ప్రభాకర్, సిఎల్సి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సుభాన్ , బిఆర్ఎస్ గంజిపేట రాజు, సిపిఐ ఎంఎల్ బీరవెల్లి దానయ్య, భీమ్ ఆర్మీ మాచర్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చే బాధ్యతను మంత్రి కోమటిరెడ్డి తీసుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ఇంటి స్థలాలు వచ్చేవరకూ జర్నలిస్టులకు సిపిఐ,బిజెపి,టిడిపి మద్దతు

జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలను ప్రారంభించిన ఎమ్మెల్సీ సత్యం




**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ నగరంలో గత 30 ఏళ్లుగా ఇంటి స్థలం పొందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు తక్షణమే ఇంటి స్థలమిచ్చే బాధ్యతను జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. నల్లగొండలో జర్నలిస్టులకు ఇంటి స్థలాల కోసం టియూడబ్ల్యూజే (ఐజేయు) నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల రిలే నిరాహార దీక్షలను శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ జర్నలిస్టులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూనే తమ కుటుంబంలో బాధలు ఉన్నప్పటికిని,కుటుంబ సభ్యులకి అనారోగ్యం ఉన్నప్పటికిని బయటికి చెప్పుకోకుండా ఈరోజు ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతుంటారని అన్నారు.అలాంటి జర్నలిస్టులకు నల్లగొండలో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు,కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇవ్వడానికి ఏమి ఇబ్బంది ఉందని ప్రశ్నించారు.హైదరాబాద్ వంటి నగరంలో కోట్ల రూపాయల విలువైన భూములతో పాటు,నల్లగొండలో విలువైన స్థలాలు ఇండ్లు క్రమబద్ధీకరణ పేరుతో అడ్డికి పావుశేరు అన్న విధంగా కట్టబెడుతున్న ప్రభుత్వం జర్నలిస్టులకు 200 గజాల నుంచి 300 గజాల ఇంటి స్థలాలు ఇస్తే నష్టం ఏమీ ఉంటుందని అన్నారు. 30 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా,మంత్రిగా,నల్లగొండ నియోజకవర్గం నుంచి ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండలో జర్నలిస్టులకు నల్లగొండలో ఇంటి స్థలం ఇవ్వడంలో నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. నల్లగొండలో ఇంటి స్థలాల కోసం జర్నలిస్టు చేసిన పోరాటానికి సిపిఐ అండగా ఉంటుందని, పోరాటం సఫలీకృతం కావాలని ఆకాంక్షించారు. నల్లగొండలో జర్నలిస్టులకు ఇంటి స్థలం లేని విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి, తీసుకెళ్తానన్నారు. గతంలో శాసనమండలిలో జర్నలిస్టుల సమస్యలపై ప్రస్తావించాలని,రాబోయే శాసన మండలి సమావేశాల్లో కూడా ఓసారి ప్రత్యేకంగా జర్నలిస్టుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని హామీ ఇచ్చారు.

**జర్నలిస్టుల కోసం మంత్రి కార్యాలయం ముట్టడిస్తా : నాగం**

నల్లగొండలో జర్నలిస్టులకు ఇంటి స్థలం ఇవ్వకుండా సంవత్సరాల తరబడినిర్లక్ష్యం చేస్తున్నందుకు నిరసన గా జర్నలిస్టుల పక్షాన పోరాటం నిర్వహిస్తామని బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగము వర్షిత్ రెడ్డి తెలిపారు.జర్నలిస్టుల తొలిరోజు దీక్షలకు మద్దతు పలికిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులో తరపున మంత్రికోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సమంజసం కాదన్నారు.యూనియన్ రాష్ట్ర నాయకులు పి. ప్రభాకర్ రెడ్డి,యూసుఫ్ బాబు పాల్గొని మాట్లాడారు.ఈ దీక్షలకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్,సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి.సలీం,న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్,నల్లగొండ పార్లమెంటు టిడిపి కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి,36 డివిజన్ గంట్ల అంత రెడ్డి,నాయకులు తేలు అన్న రవి,బిజెపి నాయకులు పాలకూరి రవి సంఘీభావం తెలియజేశారు. జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన రిలే నిరాహార దీక్షలో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, నాయకులు జక్కల పరమేష్ దోటి శ్రీనివాస్,ఎస్కే సలీం,జిల్లా యాదయ్య, అశ్వక్ అహ్మద్, చల్లా సాంబశివారెడ్డి,జనార్ధన్ రెడ్డి,రాతికింది అంజయ్య గౌడ్,మదనాచారి, పిట్టల రామకృష్ణ,కత్తుల యాదగిరి,వంగాల శ్రీనివాస్ రెడ్డి, చింత యాదగిరి, సయ్యద్, తెలగమల్ల దశరథ, రమేష్,కంచనపల్లి చంద్రశేఖర్, చెనగోని గిరిప్రసాద్,మేకల వెంకట్ రెడ్డి,రెడ్డిపల్లి యాదగిరి, చేపూరి రవి, వినోద్,మధు దీక్షలో పాల్గొన్నారు.

## రాచకొండ భూములను కాపాడాలి

సాగు చేసుకుంటున్న గిరిజనులకు హక్కులు కల్పించాలి : ఎమ్మెల్సీ

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం లోని రాచకొండ, జనగాం, చిల్లాపురం రెవెన్యూ పరిధిలోని గల వందల ఎకరాల ప్రభుత్వ భూములను అక్రమణల నుంచి కాపాడాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని అధికారులను కోరారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులకు హక్కు పట్టాలు అందించి వారికి భరోసా కల్పించాలని అన్నారు. భూమిపై ఆధారపడి జీవిస్తున్న పేద గిరిజనుల సమస్యలను అధికారులు సానుభూతితో పరిశీలించి అటవీశాఖ, రెవెన్యూ అధికారులు న్యాయం చేయాలని మండల పరిషత్ సమీక్ష సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు అర్హులైన సాగుదారులకు పట్టాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కె.శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, మండల కార్యవర్గ సభ్యులు, శాఖ కార్యదర్శిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రానున్న రోజుల్లో ప్రత్యేక హబ్‌గా మారనున్న నల్లగొండ

ఆధునిక సదుపాయాలతో నల్లగొండ ఆర్‌టిసి బస్‌స్టేషన్

దసరాకు రెండు రోజుల ముందే శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ :** రానున్న కొద్ది రోజుల్లోనే నల్లగొండ అన్ని రంగాలకు ప్రత్యేక హబ్‌గా మారనుందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నల్లగొండను మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి,అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు.హైదరాబాద్ తర్వాత ప్రపంచస్థాయి ప్రమాణాలతో నల్లగొండను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ఈ నేపథ్యంలో నల్లగొండ జిల్లా ఆర్‌టిసీ బస్‌స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.బస్‌స్టేషన్ ఆధునీకరణకు సంబంధించి అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో శుక్రవారం ఆర్‌టిసి అధికారులు,కన్సల్టెన్సీ ప్రతినిధులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షా సమావేశం నిర్వహించారు.నల్లగొండ బస్‌స్టేషన్ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుందని, అందుకు అనుగుణంగా బస్సుల రాకపోకలు సులభతరం అయ్యేలా ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు,తగినన్ని ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆధునిక వెయిటింగ్ హాళ్లు, సరిపడా పార్కింగ్ సదుపాయం,మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.దసరాకు రెండు రోజుల ముందే ఆధునిక బస్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్‌టిసి ఎండీ,అధికారులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో ఆర్‌టిసి ఎండీ నాగిరెడ్డి,ఉన్నతాధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు

కోదాడలో మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణంలో సిసిరెడ్డి కాన్వెంట్ పాఠశాలలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను సంబంధించి ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ముందుగా కలెక్టర్ సంబంధిత స్టాల్స్‌ను పరిశీలించి, జాబ్‌మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందిగా చేయాలని, అవసరమైతే రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఎక్కువగా ఏర్పాటు చేయాలని, కంపెనీల ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు అలాగే విఐపి, జాబ్‌మేళాకు హాజరయ్యే వాహనాలు, అధికారుల వాహనాలకు పార్కింగ్, తాగునీరు భద్రత ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సూచనలు చేశారు. జాబ్‌మేళాకు వచ్చే యువతకు వారి పక్కన వచ్చే తల్లిదండ్రులకు భోజన వసతులతో పాటు మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వర్షాలు పడే అవకాశాలున్నందున అవసరమైన చోట వాటర్ ప్రూఫ్ టెంట్లు వేయాలని, జాబ్‌మేళాకు పెద్ద సంఖ్యలో యువత హాజరయ్యే అవకాశం ఉన్నందున శాఖల వారిగా అధికారులకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు లేకుండా బాధ్యతయుతంగా నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు అందేలా జాబ్‌మేళాను విజయవంతం చేయాలని కలెక్టర్ అదేశించారు. ఈ కార్యక్రమంలో కోదాడ, హుజూర్‌నగర్ ఆర్డీవోలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా డిజిటల్ క్రాప్ సర్వే

ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో చేపడుతున్న డిజిటల్ క్రాప్ సర్వే, క్రాప్ బుకింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో అత్యంత ఖచ్చితంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగులో ఉన్న పంటల వివరాలను వాస్తవానికి అనుగుణంగా నమోదు చేయడం ద్వారా సాగు విస్తీర్ణం, పంటల సరళి, సాగు చేయని భూములకు సంబంధించి నమ్మకమైన సమాచారం లభిస్తుందన్నారు. ఎల్నినో ప్రభావంతో పంటల సాగులో వచ్చే మార్పులను గమనిస్తూ, ప్రత్యామ్నాయ మరియు తక్కువ నీటితో పండే పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. సర్వేలో నమోదు చేసిన వివరాలను ప్రభుత్వం నేరుగా రైతుల మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్ రూపంలో పంపిస్తుందని అధికారులు వెల్లడించారు. ఈ వివరాల్లో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే రైతులు వెంటనే స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించి సవరించుకోవాలని కోరారు. పారదర్శకమైన పంటల నమోదు ద్వారానే ప్రభుత్వ పథకాలు, సేవలు రైతులకు సమర్థవంతంగా అందుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి వెం కట రమణ రెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎఇఒలు) పాల్గొన్నారు.

## ఉద్యోగ ఉపాధి అవకాశాలు

**ప్రజాపక్షం/రామన్నపేట :** విద్యను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడంతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాలను, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు, విద్యా విధానాలను అమలు చేస్తోందని విశ్వవిద్యాలయ ఎడ్యుకేషన్ ఎక్స్టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ బి.ధర్మ నాయక్ శుక్రవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రంలో కౌన్సిలర్ల సమావేశం నిర్వహించి కరపత్రమును ఆవిష్కరించారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ బి.ధర్మ నాయక్ మాట్లాడుతూ 2026 విద్యా సంవత్సరానికి యూ జీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని, అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## ధాన్యం సేకరణలో నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

సమష్టి కృషితో ఖరీఫ్ ధాన్యం సేకరణ విజయవంతం చేయాలి: కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ :** సమష్టి కృషితో ఈ ఖరీఫ్ ధాన్యం సేకరణను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఉదయాదిత్య భవన్‌లో 2026/27 ఖరీఫ్ ధాన్యం సేకరణ అమలు శాఖల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రబీ,ఖరీఫ్ సీజన్లలో అందరి సమిష్టి కృషితో ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తి చేశామని,అదే స్ఫూర్తితో ఈ ఖరీఫ్ సేకరణను కూడా పూర్తి చేయాలన్నారు.గతంలో తలెత్తిన సమస్యలను అధిగమిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించే లారీలకు జీపీఎస్ ట్రాకింగ్,ఓపీఎంఎస్‌ను ఆన్‌లైన్‌లో అనుసంధానం చేస్తామన్నారు.ధాన్యం కొనుగోలు వెంటనే గోదాములకు పంపాలని, హమాలీలను గోదాముల వారీగా ముందే నియమించుకోవాలని,లారీల జాబితాను ముందే సమర్పించాలని, మధ్యలో లారీలు మార్చడానికి వీల్లేదని,నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు,లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.ఎల్‌నినో ప్రభావంతో నాణ్యత, తేమ శాతంలో తేడా ఉండొచ్చని,17 శాతం తేమ మించకుండా ఉంటే వెంటనే కొనుగోలు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ గత సీజన్‌లో 7.76 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని, గన్నీ బ్యాగులు,లారీల జాబితాను ముందే సిద్ధం చేసుకోవాలని అన్నారు.ఈ నెల 30 లోగా అన్ని సౌకర్యాలు కల్పించి అక్టోబర్ 1న అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని,ఈఖరీఫ్‌లో 4.50 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. డీఆర్డీఓ శేఖర్ రెడ్డి,డీసీఓ మమత,పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి నాయక్,జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, రైతు ఉత్పాదక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దానం నాగేందర్ విషయంలో ప్రజాస్వామ్యం గెలిచింది

మిగతా ఎమ్మెల్యేలకు కూడా ఇదే తీర్పు రావడం ఖాయం : మాజీ మంత్రి జగదీష్ రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** పార్టీ ఫిరాయింపులపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయంలో కోర్టు తీర్పుతో ప్రజాస్వామ్యం గెలిచిందని, మిగతా ఎమ్మెల్యేల విషయంలో కూడా ఇదే తీర్పు రావడం ఖాయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యం బతికించాలంటే న్యాయవ్యవస్థలే దిక్కని ఈ తీర్పుతో రుజువైందన్నారు. స్పీకర్ ఇచ్చిన తీర్పు అన్యాయమన్న వాదనను కోర్టు తిరస్కరించడం హర్షనీయమన్నారు. ఈ తీర్పు ప్రజల విజయమని చెప్పారు. హైకోర్టు తీర్పు ఫిరాయింపు ఎమ్మెల్యేకు చెంపపెట్టని అన్నారు. మిగతా ఎమ్మెల్యేలకు కూడా ఇదే తీర్పు రావడం ఖాయమన్నారు. ఉపఎన్నికల కోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారని చెప్పారు.

ఉత్తమ్ మాటలు ద్రోహం చేసే విధంగా ఉన్నాయి...

తెలంగాణ ప్రజలకు సాగునీటి విషయంలో శాశ్వతంగా ద్రోహం చేసే విధంగా భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు ఉన్నాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. శ్రీశైలం నుండి 8 టిఎంసిలు నీరు వాడకున్నా 80 టిఎంసిలు వాడుకున్నామని ఆయన చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సాగర్ కింద 23 టిఎంసిల నీళ్ళు ఇచ్చామని మరో అబ్బద్ధం చెప్పడం రైతులను మోసం చేయడమే అన్నారు. ఉత్తమ్ చెప్పిన మాటలు వాస్తవమైతే ఆయన నియోజక వర్గ రైతాంగం నీళ్ళ కోసం ఎందుకు ధర్నా చేస్తుందని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల నీటి వాటాను ఆంధ్రకు దారాదత్తం చేసేలా మాట్లాడడం దుర్మార్గపు చర్య అన్నారు.

## బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పుపై భగ్గుమన్న భానుపురి

సకల జనుల ఆకాంక్ష మేరకే ప్రభుత్వం నడుచుకోవాలంటూ డిమాండ్

అఖిల పక్షాల బంద్‌కు సబ్బండ వర్గాల మద్దతు





**ప్రజాపక్షం/సూర్యాపేట :** బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పుపై భానుపురి ప్రజలు భగ్గుమన్నారు. సకల జనుల ఆకాంక్ష మేరకు ప్రభుత్వం నడుచుకోవాలని ముక్త కంఠంగా డిమాండ్ చేశారు. శంషాబాద్ నుండి సూర్యాపేట విజయవాడ చెన్నై వరకు వయా జాతీయ రహదారి 65 మీదుగా బుల్లెట్ ట్రైన్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం దీనిని నల్లగొండ జిల్లా దామెరచర్ల మీదుగా మార్చడాన్ని నిరసిస్తూ గత 60 రోజులుగా రాజకీయాలకు అతీతంగా ప్రజలు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఉద్యమాన్ని ఉధృతం చేశారు. దీనిలో భాగంగా శుక్రవారం భానుపురి (సూర్యాపేట) పట్టణ బంద్‌కు పిలుపునివ్వడంతో వాణిజ్య, వ్యాపార సంస్థలతోపాటు సబ్బండ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తమ సంపూర్ణ మద్ధతు తెలిపారు. దీంతో నిత్యం రద్దీతో ఉంటే పట్టణం నిర్మానుష్యంగా మారింది. ఈ బంద్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి పాల్గొన్నారు. సిఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ బుల్లెట్ ట్రైన్ పాత అలైన్‌మెంట్ మార్చడంపై తీవ్రంగా విమర్శించారు. శంషాబాద్ నుండి చౌటుప్పల్ సూర్యాపేట కోదాడ మీదుగా రైలు మార్గం ఉంటేనే నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు ఉపయోగం ఉంటుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి జనం లేని మార్గంలో 3 వేల ఎకరాల భూమిని కొనుక్కొని రైల్వే లైన్ తీసుకెళ్ళడంతో తనకు ఆంధ్ర పాలకులకు లాభం చేకూర్చడమేనని ఆరోపించారు. సకలజనుల ఆకాంక్ష మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత అలైన్‌మెంట్‌ను ప్రకారమే రైలు మార్గంకు ఒకే చెప్పాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష నాయకులు ఉదయం 5 గంటల స్థానిక ఆర్‌టిసి డిపో ఎదుట బైఠాయించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ప్రజలు మాత్రం బంద్‌కు సంపూర్ణ తెలపడంతో సక్సెస్ అయ్యింది. ఈ కార్యక్రమంలో బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకి రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు పెరుమాళ్ళ అన్నపూర్ణ, జుట్టుకొండ సత్యనారాయణతోపాటు అఖిల పక్ష నాయకులు పెద్దిరెడ్డి రాజా, బూర వెంకటేశ్వర్లు, డాక్టర్ రామ్మూర్తి యాదవ్, కొనకంచి వీరభద్రయ్య పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు



**ప్రజాపక్షం/చండూరు:** ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశించారు.శుక్రవారం చండూరు పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ఆయన వార్షిక తనిఖీ చేశారు.పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి,స్టేషన్ రికార్డులు,సీసీటీవీల పనితీరు,పోలీసు సేవలను సమీక్షించారు.నాణ్యమైన దర్యాప్తు, పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారం,నేరాల సమర్థ నివారణపై దృష్టి పెట్టాలని సూచించారు. రౌడీషీటర్లు, అలవాటుపడిన నేరస్థులు,అనుమానితులపై కఠిన నిఘా ఉంచాలని,పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని,మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధం, సైబర్ నేరాలపై అవగాహన పెంచాలని నొక్కి చెప్పారు.సిబ్బంది సంక్షేమాన్ని సమీక్షించి,శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావం, సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి. రాము,ఎస్‌ఐ శివకుమార్,ఏఎస్‌లు వెంకటేశ్వర్లు,శ్రీరాములు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రయోగాత్మక పద్ధతిలో పాఠాలు బోధించాలి



**ప్రజాపక్షం/త్రిపురారం:** ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రయోగాత్మక పద్ధతిలో పాఠాలు బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు అన్నారు.మండలంలోని త్రిపురారం ఉన్నత పాఠశాల,దుబ్బ క్వార్టర్ ప్రాథమిక పాఠశాల,పెద్దదేవులపల్లి ప్రాథమిక,ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.త్రిపురారం ఉన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థులకు చదివించి రాయించారు.వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బాగా చదివే పిల్లలపై తీసుకునే శ్రద్ధ కంటే నాలుగింతలు ఎక్కువ శ్రద్ధ వెనుకబడిన వారిపై పెట్టాలని సూచించారు. ప్రతి తరగతిలో ప్రతి విద్యార్థి ప్రతి సబ్జెక్టులో చదవడం, రాయడం, అవగాహన నైపుణ్యాలు సాధించేలా బోధించాలని,అప్పుడే గుణాత్మక విద్య అందినట్లుగా భావిస్తామన్నారు. ఏ ఉపాధ్యాయుడూ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ లేకుండా వట్టి చేతులతో తరగతికి వెళ్లరాదని, రెమెడియల్, డిజిటల్ విధానాల ద్వారా నాణ్యమైన విద్య అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రమావత్ రవినాయక్,చల్లా రవికుమార్,హనుమాన్ నాయక్,అత్తి వెంకటేశ్వర్లు,లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో లారీ బీభత్సం

నాలుగు కార్లు ధ్వంసం ...ఒకరి మృతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని నందిపాడు కూడలి వద్ద అద్దంకినార్కట్‌పల్లి రహదారిపై గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై పడి ఉన్న వ్యక్తికి సహాయం చేయబోయిన మరో వ్యక్తిని అతివేగంగా అ జాగ్రత్తగా నడుపుతున్న గ్యాస్ ట్యాంకర్ ఢీ కొట్టగా సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన విషాదకరమైన సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే ఏపీ పొన్నూరు గ్రామానికి చెందిన పోతినేని శ్రీనివాసరావు (36) తన భార్య పిల్లలతో తాను నివాసముంటున్న హైదరాబాదులోని హయత్‌నగర్ ప్రాంతానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పట్టణంలోని నందిపాడు బైపాస్ రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన సమీప ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి రోడ్డుపై పడి ఉండగా అది గమనించిన శ్రీనివాసరావు తన కారును ఆపి ఆ వ్యక్తిని అప్పుడే వచ్చిన అంబులెన్స్ లోకి ఎక్కించే ప్రయత్నం చేస్తుండగా అదే సమయంలో వేగంగా అదుపుతప్పి గ్యాస్ ట్యాంకర్ అంబులెన్సును ఢీకొన్నది. ఆ సమయంలో శ్రీనివాసరావు అంబులెన్స్ డోర్ వద్ద ఇరుక్కుపోయి తన ప్రాణాలను కోల్పోయాడు. అంబులెన్స్‌లో ఉన్న స్వప్న ల్యాబ్ టెక్నీషియన్‌కు గాయాలయ్యాయి. ట్యాంకర్ అక్కడే వరుసగా ఉన్న నాలుగు కార్లను ఢీకొట్టడం అందులోని వారికి స్వల్ప గాయాలు కావడంతో వారిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టు టౌన్ పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకొని తలకు గాయమైన స్వప్నను హైదరాబాద్ తరలించారు. మృతుడు గుంటూరు జిల్లా పొన్నూరు మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మరోవైపు ప్రమాదంలో అంబులెన్స్ సిబ్బందికి తీవ్ర గాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు కారులో ప్రయాణిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదంతో అద్దంకినార్కట్‌పల్లి రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## మెట్లపై అదుపుతప్పి కిందపడిన విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

### పాఠశాల యాజమాన్యంపై బంధువుల ఆగ్రహం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** షాద్‌నగర్ పట్టణానికి చెందిన చంద్రశేఖర్ కుమార్తె అల్లం వర్షిక (9) ఇండియన్ హైస్కూల్‌లో నాల్గవ తరగతి చదువుతుంది. రోజు మాదిరిగానే పాఠశాల పైఅంతస్తు నుండి కిందకు మధ్యాహ్న సమయంలో వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయి తీవ్ర గాయాలకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. దీంతో సిబ్బంది హుటాహుటిని షాద్‌నగర్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించగా పరిస్థితి విషమించడంతో హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. కాగా తమ చిన్నారి కల్లు తిరిగి పడిపోయిందని సమాచారం ఇచ్చారే తప్పా.. ఇంతటి దుస్థితి ఏర్పడిందనే విషయం పాఠశాల యాజమాన్యం చెప్పలేదని బంధువులు పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే తమ పాప మృతి చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న షాద్‌నగర్ పోలీసులు పాఠశాల వద్దకు చేరుకొని విద్యార్థిని మృతికి గల కారణాలను తెలుసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

### స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య

చిన్నారి వర్షిక మృతికి కారణమైన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. ఘటనను తెలుసుకొని అక్కడికి వెళ్ళి పరిశీలించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఫీజులకు ఇచ్చే ప్రాధాన్యత విద్యార్థుల శ్రేయస్సుకు ఇవ్వడం లేదని ఆరోపించారు. పాఠశాల మెట్లపై పడి తలకు బలమైన గాయం కావడం వంటి విషయాలకు తల్లిదండ్రులకు తక్షణమే సమాచారం ఇచ్చి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదని, మెరుగైన వైద్యం చేయించే వారని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యంపై సంబంధిత ఉన్నతాధికారులకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## విద్యార్థుల అభ్యున్నతికి దాతలు సహకరించడం అభినందనీయం



**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల కోసం దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అంధించడం అభినందనీయమని విశ్వనాథ్‌పూర్ సర్పంచ్ సుందు శ్రీలత రాములు అన్నారు. శుక్రవారం కొందుర్గు మండలం విశ్వనాథ్‌పూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి సుందు శ్రీనివాస్ ఉపాధ్యాయుల కోరిక మేరకు తమ సొంత ఖర్చులతో పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లు, నోట్‌బుక్స్, పెన్సిళ్లు, వాటర్ బాటిల్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జి.రాజనర్సింహారెడ్డి, వార్డు సభ్యుడు సుందు సునీత, పంచాయతీ కార్యదర్శి మండే వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మానస, ఉపాధ్యాయులు నీరజ, మమత, అంగన్‌వాడి టీచర్ ఆకుల అరుణ, సుందు నర్సింలు, గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

## నాణ్యతగా సిసి రోడ్డు పనులు



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** శంకరపల్లి మున్సిపాలిటీ 11 వార్డు ఎస్‌ఎం కాలనీలో సి సి రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్వేత పాండురంగారెడ్డి, కౌన్సిలర్ ఫైముదాబేగం ( సమ్మి), రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోపాలరెడ్డి, మునిసిపల్ పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి, నాయకులు బాలకృష్ణ, అనంతరెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమాచారం లేకుండా డబుల్‘డ్రా’



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** షాద్‌నగర్ ఆర్‌డిఓ కార్యాలయంలో డబుల్‌బెడ్ రూం ఇండ్లకు సంబంధించిన లక్కీ డ్రా శుక్రవారం నిర్వహించారు. షాద్ నగర్ పరిధిలో మొత్తం 1700డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించగా మొదటి విడతలో 1157 ఇండ్లకు లక్కీడ్రా ద్వారా లబ్దిదారులను ఎంపిక చేసి ఇండ్లను అందజేశారు. రెండో విడతలో 498 డబుల్ బెడ్‌రూం ఇండ్లకు లక్కీడ్రా నిర్వహించే సమయంలో ఎవరికి సమాచారం ఇవ్వకుండా గుట్టు చప్పుడు కాకుండా ఆర్‌డిఓ సరితతోపాటు రెవిన్యూ అధికారులు, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రమే ఉండటంపై ప్రజలు మండిపడుతున్నారు. ఎవరికి సక్రమంగా సమాచారం ఇవ్వకుండా లక్కీ డ్రా తీయడంపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## గ్రామీణ ప్రాంతాల ప్రగతి మాజీ సిఎం కెసిఆర్‌తోనే సాధ్యం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** గ్రామీణ ప్రాంతాల ప్రగతి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామానికి చెందిన బహుజన సమాజ్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, ఉప సర్పంచ్ జగన్, మహేష్‌ల ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్‌లో చేరారు. వారందరికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి బిఆర్‌ఎస్ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ లత కిరణ్ కుమార్‌గౌడ్, శివగళ్ల రాజు, ఉపసర్పంచ్ జగన్, వార్డు సభ్యుడు పి.మహేష్, నాయకులు యాదయ్య, కేశవ్, రమేష్, వంశీ, హరి, శివకుమార్, యాదగిరి, నవీన్, అభిషేక్, వర్ధన్, మున్నా, లోకేష్, విజయ్, కుశ, బన్నీ, చందు, శ్రీశైలం, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజలు, పోలీసుల మధ్య ‘సేతు’ భరోసా

### నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనర్ మెహదీపట్నం పిఎస్‌లో స్మార్ట్ ఎఐ కియోస్క్ ప్రారంభం

### సొంత భాషలోనే ఫిర్యాదు...డిజిటల్ ట్రాకింగ్‌తో ప్రతి ఫిర్యాదుపై పర్యవేక్షణ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోలీసు స్టేషన్‌కు వచ్చే సామాన్యుడికి ఇక భాషా సమస్యలు, ఫిర్యాదు నమోదు ప్రక్రియపై అయోమయం, తన సమస్యకు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి లేకుండా సాంకేతిక పరిష్కారాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది హైదరాబాద్ నగర పోలీసు విభాగం. ప్రజలకు-పోలీసులకు మధ్య వారధిగా ‘సేతు’ పేరుతో స్మార్ట్ ఎఐ కియోస్క్‌ను శుక్రవారం మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌లో నగర పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనర్ పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కియోస్క్ ద్వారా బాధితులు తమకు తెలిసిన భాషలోనే సమస్యను వివరించవచ్చు. కృత్రిమ మేధ సాయంతో ఫిర్యాదుదారుడి వివరాలను డిజిటల్‌గా నమోదు చేసి, ఫిర్యాదుకు సంబంధించిన తదుపరి ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందిస్తుంది. ఫిర్యాదు స్వీకరించిన వెంటనే డిజిటల్ రసీదును అందజేయడంతోపాటు, సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని తెలుసుకునేలా ట్రాకింగ్ సదుపాయం కల్పించారు. ‘సేతు’లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక డిజిటల్ ట్రాకింగ్ సదుపాయం ఉంటుంది. దీంతో ఫిర్యాదు ఏ దశలో ఉంది, ఇప్పటివరకు ఏ చర్యలు తీసుకున్నారు, తదుపరి ప్రక్రియ ఏమిటన్నది పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. ఉన్నతాధికారులు కూడా ఫిర్యాదుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించవచ్చు. తద్వారా పోలీసింగ్‌లో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఫిర్యాదుల ప్రాథమిక నమోదు, మార్గదర్శక ప్రక్రియ వేగవంతం కావడంతో పోలీసు సిబ్బందికి సమయం ఆదా కానుంది. దీంతో వారు నేరాల నియంత్రణ, దర్యాప్తు వంటి కీలక విధులపై మరింత దృష్టి సారించే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా కమిషనర్ వి.సి.సజ్జనర్ మాట్లాడుతూ బాధతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతిఒక్కరికీ గౌరవప్రదమైన సేవలు అందించాలన్నదే పోలీసుశాఖ విధానమన్నారు. పోలీస్ స్టేషన్‌లోకి అడుగుపెట్టే తొలి కేంద్రమైన రిసెప్షన్ నుంచే పౌరులకు నమ్మకం కలగాల్సిన అవసరం ఉందన్నారు. ‘సేతు’ అంటే వారధి అని, ప్రజలకు-పోలీసు వ్యవస్థకు మధ్య మరింత విశ్వసనీయతను పెంచే వారధిగా ఈ వ్యవస్థ నిలుస్తుందని సజ్జనర్ పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగించి పౌర సేవలను వేగవంతం, పారదర్శకంగా మార్చేందుకు ఈ ప్రయోగాన్ని చేపట్టినట్లు తెలిపారు. మెహదీపట్నం పోలీస్‌స్టేషన్‌లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ‘సేతు’ సేవల ఫలితాలను పరిశీలించిన అనంతరం దశలవారీగా ఇతర పోలీస్ స్టేషన్లకు విస్తరించనున్నట్లు సిపి వెల్లడించారు. ప్రజలు ఈసదుపాయాన్ని వినియోగించుకోవడంతోపాటుతమ సూచనలు, సలహాలను అందించి ప్రజాహిత పోలీసింగ్ బలోపేతానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్(శాంతిభద్రతలు) తఫ్సీర్ ఇక్బాల్, అవినాష్‌కుమార్, గోల్కొండ జోన్ డిసిపి జె.రాఘవేందర్‌రెడ్డి, డెవలపర్ అమిత్‌సింగ్, అదనపు డిసిపి కృష్ణగౌడ్, ఎసిపి శ్రీనివాస్, ఎస్‌హెచ్‌ఒ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు మించి వైద్యంచేస్తే చర్యలు తీసుకుంటాం : డిఎంహెచ్‌ఒ

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నిబంధనలకు మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.స్వర్ణకుమారి హెచ్చరించారు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.స్వర్ణకుమారి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అక్రమ వైద్య కేంద్రాలపై తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం డెమో గంగాసాని మంజుల, శ్రీనివాస్ బృందం హాఫీజ్‌పేట్‌లోని ఆర్‌ఎఐ క్లినిక్, డైగ్నోస్టిక్ సెంటర్‌ను తనిఖీ చేసింది. అనుమతులు లేకుండా వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు కేంద్రాన్ని సీజ్ చేశారు. అదేవిధంగా నార్సింగిలోని ప్రియదర్శిని క్లినిక్‌కు అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు గుర్తించడంతో డాక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలోని బృందం క్లినిక్‌ను సీజ్ చేసింది. ఈ సందర్భంగా జిల్లా డిఎంహెచ్‌ఒ డాక్టర్ స్వర్ణకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా లేదా అనుమతులకు మించి వైద్య సేవలు అందిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అక్రమ క్లినిక్‌లు, అనుమతులు లేని ల్యాబ్‌లపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే విధంగా అనధికార వైద్య సేవలు అందించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.స్వర్ణకుమారి తెలిపారు. తనిఖీల్లో వైద్య,ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఉల్లంఘనలకు సాంకేతికతతో చెక్





### ఒకే కెమెరాతో..మల్టీ వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్

### సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్.ఎం.రమేష్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఔటర్ రింగ్‌రోడ్డుపై ట్రాఫిక్ ఉల్లంఘనలకు సాంకేతికతో చెక్ పెట్టేందుకు సైబరాబాద్ పోలీసులు సిద్ధమవుతున్నారు. ఒకే కెమెరాతో పలు రకాల ఉల్లంఘనలను గుర్తించే మల్టీ వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్ (ఎంవిడిఎస్) సహా అధునాతన ట్రాఫిక్ పర్యవేక్షణ వ్యవస్థల పనితీరును సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్.ఎం.రమేష్ శుక్రవారం సమీక్షించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన ఆయన.. ఒఆర్‌ఆర్ పై రియల్‌టైమ్ ట్రాఫిక్ నిఘా, ఆటోమేటెడ్ ఉల్లంఘనల గుర్తింపు, రోడ్డు భద్రతకు సంబంధించిన సాంకేతిక ఏర్పాట్లను పరిశీలించారు. కంట్రోల్ రూమ్ నుంచి ఒఆర్‌ఆర్‌పై వాహనాల రాకపోకలను రియల్‌టైమ్‌లో ఎలా పర్యవేక్షిస్తున్నారో అధికారులు కమిషనర్‌కు వివరించారు. ముఖ్యంగా కొత్తగా ఏర్పాటు చేసిన సింగిల్ కెమెరా ఆధారిత మల్టీ వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్ (ఎంవిడిఎస్) పనితీరును ఆయన సమీక్షించారు. ఒకే కెమెరా ద్వారా పలు రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించేలా ఈ వ్యవస్థను రూపొందించారు. ఒఆర్‌ఆర్ పై ట్రాఫిక్ నిఘా, ఆటోమేటెడ్ అమలు, రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు అందుబాటులో ఉన్న సాంకేతిక మౌలిక సదుపాయాలను సిపి పరిశీలించారు. కార్యక్రమంలో ఐఆర్‌బి సిఈఓ డాక్టర్.సతీందర్ సింగ్ రాణా, ప్రాజెక్ట్ హెడ్ కల్నల్ గిరీశ్వర్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బిస్వజిత్ సింగ్, సీనియర్ జిఎం చాంద్ బాషా, టోల్ జీఎం మూర్తి, ఎస్‌సిఎస్‌సిఇఒ నవీద్ తదితరులు పాల్గొన్నారు.

## స్రేయి లోన్ డిఫాల్ట్ కేసులో ఇడి దూకుడు.. రూ.6.35 కోట్ల ఆస్తులు సీజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కోల్‌కతాకు చెందిన స్రేయి గ్రూప్ రుణ డిఫాల్ట్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. హైదరాబాద్‌కు చెందిన ఎఎంఆర్, ఎఎంఆర్‌ఎల్ గ్రూప్, ఒడిశాకు చెందిన ఎఆర్‌ఎస్‌ఎస్‌గ్రూప్ ప్రమోటర్లు, అనుబంధ సంస్థలకు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఈడీ అధికారులు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు రూ.6.35 కోట్ల విలువైన నగదు, ఆభరణాలు, బ్యాంకు నిల్వలు, డీమ్యాట్ సెక్యూరిటీలను సీజ్, ఫ్రీజ్ చేసినట్లు ఈడీ అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఈడీ వివరాల ప్రకారం.. సోదాల్లో రూ.1.50 కోట్ల బ్యాంకు నిల్వలు, రూ.2.90 కోట్ల డీమ్యాట్,సెక్యూరిటీల హోల్డింగ్స్, రూ.1.95 కోట్ల విలువైన నగదు, బంగారు ఆభరణాలు గుర్తించి సీజ్ లేదా ఫ్రీజ్ చేశారు. ఇదే సమయంలో డిజిటల్ పరికరాలు, ఖాతాల పుస్తకాలు, చరాస్తులు, స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు, ఇతర కీలక రికార్డులను స్వాధీనంచేసుకున్నారు.

### రూ.1,111 కోట్ల రుణాలు బకాయి..

స్రేయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ లిమిటెడ్, స్రేయి ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్ లిమిటెడ్ నుంచి ఎఎంఆర్‌ఎల్ హైటెక్ సిటీ లిమిటెడ్, ఎఎంఆర్‌ఎల్ గ్రూప్, ఎఆర్‌ఎస్‌ఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ లిమిటెడ్, ఎఆర్‌ఎస్‌ఎస్ గ్రూప్స్‌తో పాటు ఇతర సంస్థలు భారీ రుణ సదుపాయాలు పొందినట్లు ఈడీ తెలిపింది. అనంతరం ఆ రుణాలను తిరిగి చెల్లించకపోవడం, డిఫాల్ట్‌కు వెళ్లడం వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. రుణాల మంజూరులో అక్రమాలు లేదా అవకతవకలు జరిగాయా? నిధులను ఒక రుణాన్ని మరో రుణంతో సర్దుబాటు చేసే విధంగా ‘ఎవర్‌గ్రీనింగ్’, నిధుల మళ్లింపు, రౌండ్ ట్రిప్పింగ్ వంటి పద్ధతులు ఉపయోగించారా? అనే కోణాల్లో ఈడీ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపింది.ఈడీ సోదాలు నిర్వహించిన గ్రూపులకు సంబంధించి మొత్తం రూ.1,111 కోట్ల మేర రుణ బకాయిలు ఉన్నట్లు దర్యాప్తు సంస్థ వెల్లడించింది.

### డిజిటల్ ఆధారాల సేకరణ..

సోదాల్లో స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాలు, లెక్కల పుస్తకాలు, ఆస్తుల పత్రాలు, ఇతర రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. వీటి ద్వారా సంబంధిత సంస్థలు, వ్యక్తుల ఆర్థిక లావాదేవీలు, నిధుల ప్రవాహం, ఆస్తుల వివరాలను విశ్లేషించనున్నారు. సోదాల్లో లభించిన సమాచారం సంబంధిత సంస్థలు, వ్యక్తుల ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల స్థితిగతులకు సంబంధించిన కీలక ఆధారాలను అందించినట్లు ఈడీ పేర్కొంది. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించింది.

## 30 గజాలలో నిర్మాణం ఒరిగిన భవనం

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి ఎన్టీఆర్ నగర్‌లో నాల్గంతస్తుల భవనం ప్రమాదకరంగా ఒక వైపునకు ఒరిగిపోవడంతో స్థానికులలో ఆందోళన నెలకొంది. కేవలం 30 నుంచి 40 గజాల స్థలంలో నిర్మించిన ఈ నాల్గంతస్థుల భవనం ఒక వైపుకు ఒరిగిపోయిన భవనం నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనం ఏ క్షణంలో అయిన కూలిపోతుందోనని స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రమాదం సంభవించేలోపే సిఎంసి అధికారులు స్పందించి భవనం పరిస్థితిని పూర్తిగా పరిశీలించి, ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు లేకుండా అధికారులు చర్యలు తీసుకొవాలని వారు కోరుతున్నారు.

## అంగన్‌వాడీ ఉద్యోగాల దరఖాస్తు గడువు పెంపు

### సెప్టెంబర్ 25 వరకు అవకాశం

### రంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి: అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు సంబంధించిన ఖాళీల భర్తీ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు రంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ తెలిపారు. గతంలో సంబంధిత సిడిపిఒ కార్యాలయాల్లో డిపాజిట్/దరఖాస్తు చేసిన కాపీలను, అలాగే ఒరిజినల్ సర్టిఫికెట్లను ఆయా సిడిపిఒ కార్యాలయాల్లో సమర్పించేందుకు కూడా గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు తమ దరఖాస్తులు,అవసరమైన ధ్రువపత్రాలను సంబంధిత సిడిపిఒ కార్యాలయాల్లో సమర్పించాలని అధికారులు సూచించారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి కోరారు.

# 118 జిఓ బాధితులకు ఊరట

### ప్లాట్ల క్రమబద్ధీకరణకు గ్రీన్ సిగ్నల్

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జి.ఓ 118 భూముల సమస్యకు రాష్ట్రప్రభుత్వం పరిష్కారం చూపింది. దరఖాస్తుదారుల ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ జి.ఓ 118 అమలు ప్రక్రియను పునఃప్రారంభించింది. పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరితగతిన పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులందరికీ వీలైనంత త్వరగా హక్కు పత్రాలు (పట్టాలు) అందజేయాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని దీర్ఘకాలంగా నివసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది ఊరట కలిగించే నిర్ణయంగా మారింది. క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల అర్జీలను త్వరలోనే పరిష్కరించి, వారికి హక్కు పత్రాలు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో జి.ఓ 118 కింద క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించినప్పటికీ, ఎన్నికల కోడ్ పరిపాలనా పరమైన ఇబ్బందులు, సాంకేతిక కారణాలతో పలువురు లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందలేదు. దీంతో అనేక కుటుంబాలు ఏళ్ల తరబడి అనిశ్చితిలో కొనసాగాయి. హైదరాబాద్‌లోని ఎల్.బి.నగర్, రాజేంద్రనగర్, కార్వాన్, నాంపల్లి, జూబ్లీహిల్స్, మేడ్చల్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేద, మధ్యతరగతి ప్రజల స్థలాలను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో అప్పట్లో జి.ఓ 118ను తీసుకొచ్చారు. ఈ విధానం ప్రకారం 1000 చదరపు గజాలలోపు ఉన్న స్థలాలను నిర్ణీత రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించారు. జి.ఓలో పేర్కొన్న నిబంధనల ప్రకారం చదరపు గజానికి రూ.250 చొప్పున రుసుము చెల్లించే విధంగా ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. అయితే వివిధ కారణాలతో ప్రక్రియ పూర్తికాకపోవడంతో వేలాది మంది లబ్ధిదారులు హక్కు పత్రాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, అర్హులైనవారికి త్వరితగతిన హక్కు పత్రాలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈనిర్ణయంతో ఏళ్లుగా తమ స్థలాలకు చట్టబద్ధమైన గుర్తింపు కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం జి.ఓ 118 బాధితులకు పెద్ద ఉపశమనంగా భావిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈనిర్ణయంతో ఎల్.బి.నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

# పూర్తి యాజమాన్య హక్కులతో రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం

### జిఓ 118 బాధితుల సమస్యపై మంత్రులతో మధుయాష్కిగౌడ్ భేటీ

### నేడు ఎల్‌బి నగర్‌లో బాధిత కాలనీల ప్రజలతో సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎల్‌బి.నగర్ నియోజకవర్గంలో జిఓ 118 బాధిత కాలనీల ప్రజలకు రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో శుభవార్త ప్రకటించారని.. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్‌పర్సన్, మాజీ ఎంపి మధుయాష్కిగౌడ్ అన్నారు. రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆహ్వానం మేరకు మధుయాష్కీ శుక్రవారం అసెంబ్లీలోని వారి ఛాంబర్‌లోకి వెళ్లి కలిశారు. మాజీకార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బిఎన్.రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు పర్వతి గణేష్‌రెడ్డి తోపాటు జిఓ 118 బాధిత కాలనీల ప్రతినిధులతో వెళ్లి మంత్రిని కలిసి మాట్లాడారు. మంత్రితో పాటు హైపవర్ కమిటీ సిసిఎల్ఎ లోకేష్ కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ, హనుమంతుతో సమావేశమై ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. జిఓ 118తో ఇచ్చిన డీడ్ ఆఫ్ కన్వీనియన్స్‌తో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. న్యాయపరమైన చిక్కులకు అవకాశం లేకుండా 22ఎ నుంచి తొలగించేలా చూడాలని బాధిత కాలనీల ప్రతినిధులు కోరారు. స్పందించిన రెవిన్యూ మంత్రి హైపవర్ కమిటీ ప్రతినిధులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. బాధిత కాలనీల ప్రతినిధుల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి సూచనలను పరిగణలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరించేలా ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుని కలిసి రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారంపై తమ అభిప్రాయాలు తెలిపారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ మునుగోడు ఉప ఎన్నికల్లో లబ్ధి కోసమే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం జిఓ నం.118ను తీసుకొచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. హుడా లేఅవుట్‌లలో కష్టపడి కొనుక్కున్న స్థలాల యజమానులను భూఆక్రమణదారులుగా పేర్కొంటూ జిఓ 118 విడుదల చేశారని విమర్శించారు. డబుల్ టాక్స్‌లు విధించి ప్రజలను ఇబ్బందులు పెట్టారన్నారు. సమస్య పరిష్కరించేందుకు జిఓ 118తో సంబంధం లేకుండా, నూతన హక్కు పత్రాలను అందజేసి ప్రజలకు శాశ్వతంగా సమస్య పరిష్కరించేందుకు సిఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కృషిచేస్తున్నారని మధుయాష్కి గౌడ్ వివరించారు.

**నేడు బాధిత కాలనీలతో మంత్రుల సమావేశం**

రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం విషయంపై శనివారం ఎల్‌బి.నగర్ నియోజకవర్గంలో బాధిత కాలనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సభ నిర్వహిస్తున్నట్లు మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబులు హాజరై బాధిత కాలనీల ప్రజలతో మాట్లాడి నూతన హక్కు పత్రాలను పంపిణీ చేస్తారని మధుయాష్కి గౌడ్ స్పష్టం చేశారు.


## నందిగ్రామ్ ఉప ఎన్నికల్లో
# కాంగ్రెస్‌కు మమత మద్దతు



**కోల్‌కతా :** బెంగాల్‌లో ఉప ఎన్నికల వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. నందిగ్రామ్ అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం ప్రకటించారు. సువేందు అధికారితో సమావేశమైన తర్వాత తన వర్గం అభ్యర్థి పోటీ నుండి తప్పుకున్న కొద్ది గంటలకే ఆమె ఈ ప్రకటన చేశారు. టిఎంసి పేరు, గుర్తును స్తంభింపజేయాలన్న ఎన్నికల సంఘం నిర్ణయంపై కూడా బెనర్జీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు, ఈ చర్య ఏకపక్షం అని పేర్కొన్నారు. దేశంలోని ప్రతిపక్ష పార్టీలను నాశనం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని ఆమె ఆరోపించారు. ఈ పరిణామాన్ని 'ప్రజాస్వామ్యానికి చీకటి రోజు'గా అభివర్ణించిన బెనర్జీ, గత 28 ఏళ్లుగా తమ పార్టీతో ముడిపడి ఉన్న సంప్రదాయ 'జోరా ఘాస్ ఫుల్' (రెండు పువ్వులు, గడ్డి) గుర్తును స్తంభింపజేయాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని ప్రశ్నించారు. 'గత 28 ఏళ్లుగా, అంటే ఆరంభం నుండి మా వద్ద ఉన్న గుర్తును వారు (ఎన్నికల సంఘం) ఎలా స్తంభింపజేయగలరు?' అని ఆమె అన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలను బలహీనపరచాలని బిజెపి ప్రయత్నిస్తోందని బెనర్జీ ఆరోపించారు. 'బిజెపి కేవలం బెంగాల్‌లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ఎన్నికలను అపహాస్యం చేసింది (దోచుకుంది), ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలను నాశనం చేయడానికి ప్రయత్నిస్తోంది' అని ఆమె ఆరోపించారు. మహారాష్ట్రలోని రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, 'ముందు వారు ఉద్ధవ్ థాక్రే పార్టీని, ఆ తర్వాత ఎన్‌సిపిని విచ్ఛిన్నం చేశారు. ఇప్పుడు వారు మాపై పడ్డారు' అని ఆమె అన్నారు. టిఎంసి పేరు, గుర్తును మనుగడ సాగించనివ్వనని అధికారి గతంలో అన్నారని కూడా బెనర్జీ ఆరోపించారు. 'మేము తలవంచము లేదా లొంగిపోము. పోరాడతాము, తిరిగి పుంజుకుంటాము' అని బెనర్జీ అన్నారు. కాగా, నందిగ్రామ్‌లో పరిణామాలు నాటకీయ మలుపు తిరిగాయి. బెనర్జీ వర్గం తరపున బరిలో దిగిన సంచితా ప్రధాన్ డే, 'నబన్నా'లో అధికారిని కలిసిన తర్వాత తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇండియా కూటమిని బలోపేతం చేసేందుకు నందిగ్రామ్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని తన పార్టీ నిర్ణయించిందని, అయితే రెజినగర్ విషయంలో నిర్ణయం తర్వాత తీసుకుంటామని బెనర్జీ తెలిపారు. కాగా, అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికలో రాజకీయంగా కీలకమైన నందిగ్రామ్ స్థానాన్ని కాంగ్రెస్‌కు వదిలివేసే ప్రతిపాదనతో మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి ఈ నెల ప్రారంభంలో తమ పార్టీ కేంద్ర నాయకత్వాన్ని సంప్రదించిందని కాంగ్రెస్ బెంగాల్ విభాగం మంగళవారం పేర్కొంది; అయితే టిఎంసి ఈ వాదనను తోసిపుచ్చింది. టిఎంసితో పొత్తు పెట్టుకునే ప్రతిపాదనను కాంగ్రెస్ నాయకత్వం తిరస్కరించింది. అసమ్మతివాదులే బిజెపికి 'ఎటిఎం'. మా పార్టీ గుర్తుపై ఎన్నికైనవారే ఇప్పుడు ఆ గుర్తుకే సవాల్ విసురుతున్నారు అని ఆమె అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తనకు ఫోన్ చేశారని, ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ సంఘీభావం తెలిపారని కూడా బెనర్జీ పేర్కొన్నారు.

# టిఎంసి ప్రత్యర్థి వర్గాలకు పార్టీ పేరు, చిహ్నాలు కేటాయింపు

- ఉప ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ చర్యలు
- మమత వర్గానికి 'ఫుట్‌బాల్ ప్లేయర్, అరూరు రాయ్ వర్గానికి 'ఎన్వలప్' గుర్తులు




**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల తరువాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఈ రెండు వర్గాలకు శుక్రవారం ఎన్నికల కమిషన్ పార్టీ పేర్లను, చిహ్నాలను కేటాయించింది. రాష్ట్రంలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్‌లోని మమతా బెనర్జీ వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' అని, అరూప్ రాయ్ నేతృత్వంలోని ప్రత్యర్థి వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' అనే పేర్లను కేటాయిస్తున్నట్లు ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది. అదే విధంగా మమతా వర్గానికి 'ఫుట్‌బాల్ ప్లేయర్' (ఫుట్‌బాల్ క్రీడాకారుడు) ఎన్నికల గుర్తుగా లభించగా, రాయ్ నేతృత్వంలోని వర్గానికి 'ఎన్వలప్' (కవరు) గుర్తు కేటాయించింది. 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' (ఎఐటిసి) పేరును ఎవరు ఉపయోగించాలనే దానిపై వివాదంలో ఉన్న ఈ రెండు వర్గాలకు గురువారం రాత్రి జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల్లో ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు ఇచ్చింది. రానున్న ఉప ఎన్నికల కోసం పార్టీ పేరును లేదా 'జోరా ఘాస్ ఫుల్' (గడ్డితో కూడిన రెండు పువ్వులు) గుర్తును ఉపయోగించవద్దని ఆదేశిస్తూ, శుక్రవారం ఉదయానికల్లా తమకు నచ్చిన పేర్లు, గుర్తులను సమర్పించాలని సూచించింది. ప్రతిపాదిత పేర్లు ఎఐటిసిని పోలి ఉండవచ్చని, అయితే గుర్తులు మాత్రం స్వతంత్ర అభ్యర్థులు, నమోదిత గుర్తింపు పొందని రాజకీయ పార్టీల కోసం కేటాయించిన అందుబాటులో ఉన్న గుర్తుల జాబితా నుండే ఎంపిక చేసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. తూర్పు మిద్నాపూర్ జిల్లాలోని నందిగ్రామ్, ముర్షిదాబాద్ జిల్లాలోని రెజినగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న ఉప ఎన్నికలు జరగనుండగా, 9న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 'ఎలక్షన్ సింబల్స్ (రిజర్వేషన్ అండ్ అలాట్‌మెంట్) ఆర్డర్, 1968'లోని పేరా 15 ప్రకారం ప్రక్రియను పూర్తి చేయడానికి తగినంత సమయం లేదని పేర్కొన్న ఎన్నికల సంఘం, అదే సమయంలో ఉప ఎన్నికల కోసం పార్టీ పేరు, గుర్తు అత్యవసరమని గుర్తించింది. ఈ మధ్యంతర ఏర్పాట్లు కేవలం రానున్న ఉప ఎన్నికల కోసమేనని, 'సింబల్స్ ఆర్డర్'లోని పేరా 15 ప్రకారం వివాదంపై తుది నిర్ణయం వెలువడే వరకు ఇవి అమల్లో ఉంటాయని ఎన్నికల సంఘం తెలిపింది. మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత టిఎంసి శాసనసభాపక్షంలో మొదలైన తిరుగుబాటు పార్లమెంటు స్థాయికి కూడా విస్తరించిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ ఉత్తర్వులను జారీ చేసింది. జూన్‌లో, 58 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలు మమతా వర్గం అభ్యర్థి సోవన్‌దేబ్ ఛటోపాధ్యాయకు బదులుగా, పార్టీ నుంచి బహిష్కరించబడిన నేత రితబ్రత బెనర్జీని బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నుకుని స్పీకర్ గుర్తింపు పొందారు. ఐదు రోజుల తర్వాత, ఈ తిరుగుబాటు పార్లమెంటుకు చేరింది. కాకోలీ ఘోష్ దస్తిదార్ నేతృత్వంలోని 20 మంది లోక్‌సభ ఎంపిలు పెద్దగా ప్రాచుర్యం లేని ఎన్‌సిపి ఐలో చేరి, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు 'ప్రత్యేక కూటమి'గా మద్దతు తెలుపుతూ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. దీంతో పార్టీ పార్లమెంటరీ శ్రేణుల్లో చీలిక మరింత తీవ్రమైంది. 1998లో కాంగ్రెస్ నుండి విడిపోయి టిఎంసి ఏర్పడినప్పటి నుండి, ఆ పార్టీ ప్రస్థానంలో మమతా బెనర్జీ చేతితో గీసిన గుర్తు కీలక పాత్ర పోషించింది. కాగా తాజా పరిణామం ఆమెకు పెద్ద ఎదురుదెబ్బ. గత 28 ఏళ్లుగా ఈ గుర్తు పార్టీ క్షేత్రస్థాయి గుర్తింపునకు శక్తివంతమైన ప్రతీకగా నిలిచింది. ముఖ్యమంత్రి సువేందు అధికారి నందిగ్రామ్, భవానిపూర్ రెండింటిలోనూ గెలిచి, నందిగ్రామ్ స్థానాన్ని వదులుకోవాలని నిర్ణయించుకోవడంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. మరోవైపు, ఎజెయుపి నాయకుడు హుమాయున్ కబీర్ నౌడా, రెజినగర్ రెండింటిలోనూ గెలిచి, రెజినగర్ స్థానాన్ని వదులుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి.

## ఒత్తిడికి గురై ఇసి నిర్ణయాలు తీసుకుంటే
# ప్రజాస్వామ్యానికి ముప్పు

శివసేన (యుబిటి) ఆందోళన



**న్యూఢిల్లీ :** భారత ఎన్నికల సంఘంపై శివసేన (యుబిటి) అనుమానాలను వ్యక్తం చేసింది. ఆ సంఘం ఒత్తిడికిలోనై నిర్ణయాలు తీసుకుంటుంటే భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఆ పార్టీ నాయకుడు సంజయ్ రౌత్ ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ పేరు, గుర్తును నిలిపివేయాలని ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో రౌత్ పైవిధంగా వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిఎంసి పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి చెందినదని రౌత్ స్పష్టం చేశారు. ఆ పార్టీలో చీలికను సృష్టించడానికి బిజెపి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. మమతా బెనర్జీ టిఎంసిని స్థాపించి, లక్ష్యాలను నిర్దేశించారని, ఆమె ఎమ్మెల్యేలకు, ఎంపిలకు టిక్కెట్లు కూడా ఇచ్చారని, కానీ బిజెపి పార్టీని నిలువనా చీల్చిందన్నారు. అంతమాత్రాన పార్టీ వారిది కాదని, పార్టీ మమతా బెనర్జీదేనన్నారు. ఎన్నికల సంఘం గుర్తును స్తంభింపజేయకూడదని, తిరుగుబాటుదారులు వేరే గుర్తును తీసుకుని ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయన సూచించారు. ఎన్నికల సంఘం ఒత్తిడికి లోనై ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది అని ఆయన అన్నారు. ప్రత్యర్థి వర్గంతో టిఎంసికి కొనసాగుతున్న వివాదం మధ్య, ఎన్నికల సంఘం తీసుకున్న ఈ చర్య ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. ప్రతిపక్షాలు టిఎంసికి మద్దతు ప్రకటించాయి.

# కరువు ప్రకటించండి

రైతులకు హెక్టారుకు రూ. 50 వేల ఆర్థిక సాయం అందించాలి
రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ లేఖ



**ముంబయి :** తీవ్ర వర్షాభావం కారణంగా మహారాష్ట్రలో పంట నష్టపోయిన రైతులకు హెక్టారుకు కనీసం రూ. 50,000 ఆర్థిక సహాయం అందించాలని ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తీవ్రంగా ప్రభావితమైన తాలూకాల్లో కరువును ప్రకటించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలోని 36 జిల్లాల్లో 31 జిల్లాల్లో సరిపడా వర్షాలు కురవకపోవడం వల్ల సోయాబీన్, పత్తి, పప్పుధాన్యాల వంటి పంటలు దెబ్బతిన్నాయని, అలాగే సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గి, తాగునీరు, పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడిందని పవార్ ఆ లేఖలో పేర్కొన్నారు.
అధికారిక లాంఛనాల కోసం వేచి చూడకుండా ప్రభుత్వం కరువును ప్రకటించాలని, ప్రభావిత ప్రాంతాలకు తక్షణమే ఉపశమనం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అయిన పవార్, రైతులకు హెక్టారుకు రూ. 50,000, వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 25,000 ప్రత్యేక సహాయం అందించాలని, వ్యవసాయ రుణ మాఫీ పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, కొత్త పంట రుణాలు అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. క్రమం తప్పకుండా రుణాలు చెల్లించే రైతులకు ఇచ్చే ప్రోత్సాహకాన్ని రూ. 50,000 నుండి రూ. 1 లక్షకు పెంచాలని, అలాగే 2025, 26లో పంట రుణాలు తీసుకుని ఈ ఏడాది చెల్లించలేకపోయిన (డిఫాల్టరైన) రైతులను కూడా రుణ మాఫీ పథకంలో చేర్చాలని పవార్ తన లేఖలో డిమాండ్ చేశారు. అంతేకాకుండా, గతంలో మినహాయించిన అంశాలతో సహా రూ. 1 పంట బీమా పథకాన్ని గత తేదీ నుండి వర్తించేలా అమలు చేయాలని, అలాగే గత ఏడాది అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టానికి ప్రకటించిన హెక్టారుకు రూ. 17,000 సహాయాన్ని తక్షణమే విడుదల చేయాలన్నారు. కరువు పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయం, నీటి సంరక్షణకు సంబంధించిన ప్రత్యేక పనులు చేపట్టాలని, అలాగే పండ్ల తోటలను కాపాడేందుకు ట్యాంకర్ల ఏర్పాట్లు చేయాలని పవార్ కోరారు. రాష్ట్రంలోని 36 జిల్లాల్లో 31 జిల్లాలు తమ సగటు కంటే చాలా తక్కువ వర్షపాతాన్ని నమోదు చేశాయని పవార్ తెలిపారు. జూన్ 1 నుండి సెప్టెంబర్ 15 మధ్య రాష్ట్రంలో 648 మి.మీ వర్షపాతం నమోదైందని, ఇది సగటు కంటే 19 శాతం తక్కువని ఆయన చెప్పారు. ముంబయి, రాయ్‌గఢ్, పాల్ఘర్, విదర్భ ప్రాంతాలు అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యాయని, కొన్ని జిల్లాల్లో గత మూడు నెలల్లో వర్షపాతం సాధారణం కంటే దాదాపు 60 శాతం తక్కువగా నమోదైందని ఆయన పేర్కొన్నారు.

# మమత బెనర్జీతో కనిమొళి భేటీ



**న్యూఢిల్లీ :** డిఎంకె సీనియర్ నాయకురాలు కనిమొళి కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కలిశారు. గురువారం దక్షిణ కోల్‌కతాలోని కాళీఘాట్‌లో ఉన్న బెనర్జీ నివాసంలో మమతతో భేటీ అయిన కనిమొళి పలు అంశాలపై చర్చించారని ఓ టిఎంసి నేత చెప్పారు. ముంబయిలో శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రేతో, ఢిల్లీలో ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్‌తో కనిమొళి చర్చలు జరిపిన కొద్ది రోజులకే ఈ సమావేశం జరగడం గమనార్హం. డిఎంకె, కాంగ్రెస్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, ప్రతిపక్ష ఇండియా కూటమిలోని పలు ప్రాంతీయ భాగస్వామ్య పక్షాల మధ్య ఉన్న విభేదాల నేపథ్యంలో ఈ భేటీ అందరి దృష్టిని ఆకర్షించింది. జాతీయ స్థాయిలో టిఎంసి, కాంగ్రెస్‌లు ఇండియా కూటమిలో భాగస్వామ్య పక్షాలే అయినప్పటికీ, పశ్చిమ బెంగాల్‌లో వాటి సంబంధాలు వివాదాస్పదంగానే ఉన్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత డిఎంకె, కాంగ్రెస్ సంబంధాలు కూడా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్, నటుడురాజకీయవేత్త అయిన సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టివికె పార్టీ అధికార కూటమిలో భాగస్వామిగా ఉండగా, టిఎంకె ప్రతిపక్షంలో ఉంది. పశ్చిమ బెంగాల్‌లో 15 ఏళ్ల పాలనకు తెరదించుకుని బిజెపి అధికారంలోకి రావడంతో, టిఎంసి కూడా రాజకీయ సంక్షోభ కాలాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్ర అసెంబ్లీతో పాటు పార్లమెంటరీ శ్రేణుల్లో కూడా పార్టీ అసమ్మతిని ఎదుర్కొంటోంది, ఇది బెనర్జీకి అదనపు సవాళ్లను విసురుతోంది. జూన్‌లో జరిగిన ఇండియా కూటమి సమావేశానికి డిఎంకె హాజరుకాలేదు, అప్పటి నుంచి కాంగ్రెస్ పట్ల మరింత ఘర్షణ వైఖరిని అవలంబించింది. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమికి వెలుపల ఉన్న పార్టీల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసే ప్రయత్నాలపై కనిమొళి సమావేశాలు ఊహాగానాలకు దారితీశాయి. అయితే, ఈ చర్చలు ఒక కొత్త రాజకీయ కూటమిని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా జరిగాయని అధికారికంగా ఎలాంటి సూచన లేదు.

## జైపూర్ స్కూల్‌కు అవార్డు
# సిజెపి ప్రశ్నల వర్షం

ఈ నిర్ణయం దిగ్భ్రాంతికరమని వ్యాఖ్య



**జైపూర్ :** తొమ్మిదేళ్ల విద్యార్థిని అమైరా మరణం, ఆ తర్వాత పాఠశాలపై సిబిఎస్ఇ తీసుకున్న చర్యలను ఉటంకిస్తూ, న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో జైపూర్‌లోని నీరజ మోదీ పాఠశాలకు ఒక ప్రైవేట్ న్యూస్ ఛానల్ అవార్డును ఇవ్వడాన్ని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) సహకన్వీనర్ అశుతోష్ రాంకా శుక్రవారం ప్రశ్నించారు. ఈనెల 16న జరిగిన ఒక కార్యక్రమంలో ఆ పాఠశాలకు 'యువ నాయకులను, మార్పుకర్తలను అభివృద్ధి చేయడంలో శ్రేష్ఠత' అవార్డు లభించింది. ఈ నిర్ణయాన్ని దిగ్భ్రాంతికరంగా అభివర్ణిస్తూ, గత ఏడాది నవంబర్ 1న పాఠశాలలో 4వ తరగతి విద్యార్థిని అయిన అమైరా మరణానికి దారితీసిన పరిస్థితుల గురించి నిర్వాహకులకు తెలుసా అని రాంకా ప్రశ్నించారు. పాఠశాల భవనంలోని నాలుగో అంతస్తు నుంచి పడిపోవడంతో అమైరా మరణించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తోటి విద్యార్థులు ఆమెను పదేపదే వేధించారని, ఉపాధ్యాయుల సహాయం కోరడానికి ఆమె చేసిన ప్రయత్నాలను వారు పట్టించుకోలేదని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. తర్వాత, ఆ చిన్నారి ఆందోళనతో తరగతి గది నుండి బయటకు వెళ్లే ముందు తన ఉపాధ్యాయురాలిని సమీపిస్తున్నట్లు చూపిస్తున్న సిసిటివి ఫుటేజీని ఆ కుటుంబం విడుదల చేసింది. 'తొమ్మిదేళ్ల అమైరా తన ఫిర్యాదులను ఉపాధ్యాయులు నిరంతరం పట్టించుకోకపోవడంతో ఆత్మహత్య చేసుకున్న పాఠశాల ఇదే నీరజ మోదీ అని మీకు తెలుసా? ఆ ఘటన జరిగిన తర్వాత పాఠశాల చేసిన మొదటి పని నేలను తుడవడం అని మీకు తెలుసా? తీవ్రమైన భద్రతా నిబంధనల ఉల్లంఘనల కారణంగా 912 తరగతుల వరకు పాఠశాల అనుబంధాన్ని సిబిఎస్ఇ రద్దు చేసిందని మీకు తెలుసా?' అని ఆయన ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో ప్రశ్నించారు. 'ఒకవేళ తెలిసి కూడా మీరు ఆ పాఠశాలకు అవార్డు ఇవ్వాలని నిర్ణయించుకుంటే, మరెందరిలాగే మీరు కూడా అన్యాయానికి పాల్పడినవారే' అని ఆయన అన్నారు. అమైరా మృతికి సంబంధించి పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు.

## ఎన్‌టిఏ నవీకరించిన సౌకర్యాలను పరిశీలించేందుకు..
# కార్యాలయాన్ని స్వయంగా సందర్శిస్తాం

'సుప్రీం' ధర్మాసనం వెల్లడి

**న్యూఢిల్లీ :** పదే పదే జరుగుతోన్న 'నీట్' పేపర్ లీకులను నివారించడానికి వ్యవస్థను సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన అవసరాన్ని శుక్రవారం సుప్రీంకోర్టు నొక్కిచెప్పింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) నవీకరించబడిన సౌకర్యాలను పరిశీలించడానికి ధర్మాసనంలోని న్యాయమూర్తులు వ్యక్తిగతంగా సందర్శించవచ్చని అత్యున్నత న్యాయస్థానం అసాధారణంగా సూచించింది. అండర్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సులలో ప్రవేశాల కోసం 'నీట్' యుజి పరీక్షను నిర్వహించే, పదే పదే జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకుల కారణంగా తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న ఎన్‌టిఏ వ్యవస్థను పకడ్బందీగా మార్చేందుకు పరిపాలనా క్రమం నుంచి మౌలిక సదుపాయాల వరకు తన మొత్తం యంత్రాంగాన్ని సమూలంగా మార్చినట్లు జస్టిస్ పిఎస్.నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనానికి తెలిపింది. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాతో జస్టిస్ నరసింహ మాట్లాడుతూ, తాము, జస్టిస్ అరాధే కలిసి ఎన్‌టిఏ కొత్తగా ఆధునీకరించిన సదుపాయాన్ని సందర్శించి, అక్కడి వ్యవస్థను పరిశీలించాలనుకుంటున్నామని పేర్కొన్నారు. 'పునరావృతమయ్యే పత్రాల లీకేజీలను నివారించడానికి ఎన్‌టిఏ వ్యవస్థను సంస్థాగతంగా బలోపేతం చేయడం చాలా కీలకం. కేవలం తక్షణ లేదా తాత్కాలిక చర్యలు సరిపోవు. మొత్తం వ్యవస్థ యొక్క శాశ్వతత్వమే కీలకమని మీరు తెలుసుకోవాలి. ఒక శాశ్వతమైన ఏర్పాటు, శాశ్వతమైన సిబ్బంది, శాశ్వతమైన విభాగాలు ఉండాలి. డిప్యుటేషన్ చాలా తక్కువగా ఉండాలి. అప్పుడే ఒక శాశ్వతమైన నిర్మాణం ఏర్పడుతుంది' అని ధర్మాసనం సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాతో చెప్పింది. న్యాయమూర్తులు ఢిల్లీలోని మింటో రోడ్‌లో ఉన్న ఎన్‌టిఏ కార్యాలయానికి వెళ్లి, ఆ వ్యవస్థ వాస్తవంగా పనిచేస్తుందో, లేదో పరిశీలించి, దాని సిబ్బంది, ఇతర ఏర్పాట్లను అంచనా వేస్తారని జస్టిస్ నరసింహ తెలిపారు. ప్రారంభంలోనే 'నీట్'లో నిర్మాణాత్మక సంస్కరణలను సూచించడానికి ఏర్పాటు చేసిన నందన్ నీలేకని నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ విస్తృత సంప్రదింపులు జరిపిందని, ఈ నెలాఖరులోగా తన తొలి మధ్యంతర నివేదికను సమర్పించే అవకాశం ఉందని కేంద్రం ధర్మాసనానికి తెలిపింది.

# ఆస్కార్‌కు 'గోంధల్' ఎంపిక

**ముంబయి :** ఆస్కార్ అవార్డు 2027 పోటీలకు భారత్ నుంచి మరాఠీ సినిమా 'గోంధల్' ఎంపికైంది. సంతోష్ ధవాఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'గోంధల్' ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో అధికారిక ఎంట్రీ దక్కించుకుంది. ఈ విషయాన్ని శుక్రవారం ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కమిటీ చైర్మన్ పి.శేషాద్రి వెల్లడించారు. దేశవ్యాప్తంగా వివిధ భాషల్లో 33 సినిమాలు ఆస్కార్ ఎంట్రీలో పోటీలో ఉండగా, కమిటీ ఈ సినిమాను ఎంపిక చేసింది. దీంతో మరాఠీ భాష నుంచి ఆస్కార్ పోటీలకు ఎంపికైన నాలుగో సినిమాగా గోంధల్ ఘనత దక్కించుకుంది. గతంలో మరాఠీ భాషలో తెరకెక్కిన కోర్టు (2015), హరిశ్చంద్రాచి ఫ్యాక్టరీ (2009), శ్వాస్ (2005) సినిమాలు ఆస్కార్‌లో అధికారిక ఎంట్రీ దక్కించుకున్నాయి. కానీ వీటికి అవార్డు రాలేదు. ఇక గతేడాది నీరజ్ దర్శకత్వంలో వచ్చిన హోంబౌండ్ సినిమా భారత్ నుంచి ఆస్కార్ పోటీకి ఎంపికైంది. కానీ ఈ చిత్రానికి తుది నామినేషన్స్‌లో చోటు దక్కలేదు.

**ధురంధర్, బార్డర్ 2ను వెనక్కినెట్టి**

ఆస్కార్ ఎంట్రీ కోసం ఈసారి భారత్ నుంచి వివిధ భాషల్లో 33కి సినిమాలు పోటీపడ్డాయి. అందులో బ్లాక్‌బస్టర్ మూవీ ధురంధర్ పార్ట్ 1, బార్డర్ 2, మై వాపస్ ఆవుంగాలాంటి హిట్ సినిమాలు ఉన్నాయి. అయితే నేచురల్‌గా, విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన గోంధల్‌ను కమిటీ ఎంపిక చేసి నామినేషన్స్‌కు పంపించింది. కాగా,



బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ సెగ్మెంట్‌లో ఇప్పటిదాకా భారతీయ సినిమాకు పురస్కారం దక్కలేదు. మెహబూబ్ ఖాన్ రూపొందించిన 'మదర్ ఇండియా', మీరా నాయర్ దర్శకత్వంలో వచ్చిన 'సలామ్ బాంబే', అశుతోష్ గోవారికర్ తెరకెక్కించిన 'లగాన్' సినిమాలు మాత్రం టాప్ 5 నామినేషన్స్ దాకా వెళ్లగలిగాయి. ఇక ప్రతిష్ఠాత్మక 99వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం లాస్ ఏంజెలెస్ వేదికగా 2027 మార్చి 14న జరగనుంది.

## ఎఫ్‌సిఆర్‌ఎ సవరణబిల్లును పరిశీలించనున్న..
# జెపిసి తొలిసారి సమావేశం

మైనారిటీలను లక్ష్యంగా చేసుకుందన్న విపక్షాల ఆరోపణలను తోసిపుచ్చిన కేంద్రం

**న్యూఢిల్లీ :** దేశంలోని స్వచ్ఛంద సంస్థలు, విదేశీ నిధులపై ప్రభుత్వ పర్యవేక్షణను కఠినతరం చేయాలని ప్రతిపాదించే వివాదాస్పద బిల్లును పరిశీలిస్తున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) శుక్రవారం తొలిసారిగా సమావేశమైంది. బిజెపి ఎంపి సంజయ్ జైస్వాల్ నేతృత్వంలోని 31మంది సభ్యుల కమిటీ, నివేదికను వెలువరించడానికి ముందు విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు (ఎఫ్‌సిఆర్‌ఎ) 2026లోని నిబంధనలను సవివరంగా పరిశీలిస్తుంది. ఒక సంస్థ తన ఎఫ్‌సిఆర్‌ఎ లైసెన్స్‌ను కోల్పోయిన పక్షంలో, దాని ఆస్తులను నిర్వహించడానికి, పారవేయడానికి ఒక నియమిత అధికార సంస్థను ఏర్పాటు చేయడంతోపాటు దేశంలోని ఎన్‌జిఓలు, విదేశీ నిధులపై కఠినమైన ప్రభుత్వ పర్యవేక్షణను ప్రతిపాదించడం కూడా ఈ బిల్లు లక్ష్యం. ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేసిన ప్రతిపక్ష పార్టీలు, ఈ బిల్లు మైనారిటీలను లక్ష్యంగా చేసుకుందని, ఎందుకంటే కొన్ని నిబంధనలు క్రైస్తవ స్వచ్ఛంద సంస్థలకు , మైనారిటీలు నడుపుతున్న సామాజిక సంక్షేమ, విద్యా సంస్థలకు అందే చట్టబద్ధమైన నిధులను అడ్డుకుంటాయని ఆరోపించాయి. ప్రభుత్వం ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. మైనారిటీలకు వ్యతిరేకంగా వివక్ష చూపే ఒక్క నిబంధనైనా గుర్తించాలని ప్రతిపక్ష పార్టీలకు సవాల్ విసిరింది. ప్రతిపాదిత చట్టం మతానికి ప్రత్యేకమైనదికాదని, విదేశీ విరాళాలను నియంత్రించడమే దీని లక్ష్యమని కూడా ప్రభుత్వం స్పష్టంచేసింది.ఈ ఏడాది మార్చి 25న లోక్‌సభలో ప్రవేశపెట్టబడిన ఈ బిల్లును చట్టంలోని కొన్ని నిబంధనలు తీవ్ర అభ్యంతరకంగా ఉన్నాయని ఆరోపించిన ప్రతిపక్ష పార్టీలకు నిరంతర డిమాండ్ మేరకు ఆగస్టు 12న జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపారు. 2026లో పార్లమెంట్ శీతాకాల సమావేశాల మొదటి వారం చివరిరోజు నాటికి తన నివేదికను లోక్‌సభకు సమర్పించాలని కమిటీని కోరారు. లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెడుతూ కేంద్ర హోం శాఖ సహాయమంత్రి నిత్యానంద్ రాయ్, ఈ చట్టం పారదర్శకతను పెంచడం, విదేశాల నుంచి వచ్చిన నిధుల సరైన వినియోగాన్ని నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఈ బిల్లు 'ప్రమాదకరమైనది' అనే ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొడుతూ విదేశీ విరాళాలను ఉపయోగించి బలవంతపు మతమార్పిడికి పాల్పడే వారికి, అలాగే, వ్యక్తిగత లాభం కోసం 'విదేశీ నిధులను 'దుర్వినియోగం చేసే' వ్యక్తులకు ఇది నిజంగా ప్రమాదకరం అని నిత్యానంద్ రాయ్ నొక్కిచెప్పారు. ప్రతిపాదిత సవరణ బిల్లుపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేసిన కాంగ్రెస్ నాయకుడు కెసి.వేణుగోపాల్, ఇది మైనార్టీలను, ఎన్‌జిఓలను లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు. ప్రస్తుత రూపంలో దీనిని ఆమోదించడానికి ప్రతిపక్షం అనుమతించదని వేణుగోపాల్ అన్నారు. మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమ, ప్రముఖ క్రైస్తవ సంస్థలు, వివాదాస్పద బిల్లును సమగ్ర పరిశీలన కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని కేంద్రాన్ని ఇంతకుముందు కోరాయి. లాల్దుహోమా, ఇతర క్రైస్తవ సంస్థలు హోం మంత్రి అమిత్‌షాను కలిసి, ప్రతిపాదిత చట్టంపై తమ ఆందోళనలను వ్యక్తం చేశారు. నాగాలాండ్ ముఖ్యమంత్రి నైఫియు రియో కూడా ఈ బిల్లును జెపిసికి పంపాలని కేంద్రాన్ని కోరగా, మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ కె.సంగ్మా దానిలోని నిబంధనలపై కేంద్రానికి కేంద్రానికి ఆందోళన వ్యక్తంచేశారు. సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, ప్రస్తుత చట్టంలోని సెక్షన్ 15ను రద్దు చేయాలని కోరుతూ డిఎంకె ఎంపి పి.విల్సన్ నేతృత్వంలో చర్చి నాయకుల బృందం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసింది. ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లును ఉపసంహరించుకోవాలని డిఎంకె చీఫ్ ఎంకె.స్టాలిన్ కూడా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎన్‌సిపి (ఎస్‌పి) వర్కింగ్ ప్రసిడెంట్ సుప్రియా సూలే విదేశీ నిధులను ఎల్లప్పుడూ అనుమానంతో చూడలేమని, చెబుతూ, ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లును దాని ప్రస్తుత రూపంలో వ్యతిరేకించారు. ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని లేదా జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపించాలని ఆమె కేంద్రాన్ని కోరారు. సెనేట్ విదేశీ సంబంధాల కమిటీకి అధిపతిగా ఉన్న సెనేటర్ జేమ్స్ రిష్ సహా డెమొక్రటిక్, రిపబ్లికన్ పార్టీలకు చెందిన కొంతమంది అమెరికా చట్ట సభ సభ్యులు ఎఫ్‌సిఆర్‌ఎకు చేయబోయే ప్రణాళికా బద్ధమైన మార్పులపై ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మార్పులు క్రైస్తవ సంస్థలు, ఇతర పౌర సమాజ సమూహాలపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని వారు పేర్కొన్నారు. అయితే, భారతదేశం ఈ విమర్శను తిరస్కరిస్తూ, ఈ శాసనపరమైన అంశం ఒక అంతర్గతమైన వ్యవహారమని పేర్కొంది.ఎఫ్‌సిఆర్‌ఎకు ప్రతిపాదిత మార్పులు భారతదేశపు అంతర్గత శాసనపరమైన అంశమని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ అన్నారు. కొన్ని వర్గాలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం జరుగుతోందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రెజిజు ఆరోపించారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ప్రత్యేక ఆహ్వానితులుగా రాజ్యసభ సభ్యులు జావేద్ అలీఖాన్, జేమ్స్ పాంగ్ సాంగ్ కొంగ్‌కల్ సంగ్మాలను బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నామినేట్ చేశారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను అనగా **ముత్యాల పవన్ కుమార్ s/o వెంకట రాములు,** వయస్సు: (27) సంవత్సరాలు, నివాసం: సిర్పూర్ గ్రామం, మల్లాపూర్ మండలం, జగిత్యాల జిల్లాకు చెందిన వాడను. తేదీ: 11-9-2026, రోజున నేను బైక్ పైన సిరిపూర్ నుండి నిర్మల్ వెళ్తుండగా మార్గంమధ్యలో X9555563 నంబర్ గల నా పాస్‌పోర్ట్ మరియు ఇతర సర్టిఫికెట్లు పోయినావి. తర్వాత నేను వెతికి చూడగా ఆచూకీ కనబడలేదు, కావున ఎవరికైనా దొరికినచో నాకు సంప్రదించగలరని మనవి.

ఇట్లు
**ముత్యాల పవన్ కుమార్**
గ్రా॥ సిరిపూర్, మం॥ మల్లాపూర్,
జిల్లా॥జగిత్యాల.
సెల్ నెం. 7993484718



# పాక్ మసీదులో పేలుడు

## 20 మంది మృతి

**పెషావర్:** పాకిస్థాన్, ఖైబర్ ఫఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని మసీదులో భారీ పేలుడు సంభవించింది. కోహాట్‌లోని ఓల్డ్ పోలీస్ లైన్స్ వద్ద మసీదులో శుక్రవారం ప్రార్థనల సమయంలో ఈ ఘటన జరిగింది. 20 మందికిపైగా మరణించారు. మరో 25 మందికిపైగా గాయపడ్డారు. వారిని కోహాట్ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పేలుడు పదార్థాలు నింపిన ఒక వాహనం ఓల్డ్ పోలీస్ లైన్స్ ప్రధాన గేటును ఢీకొట్టడంతో పేలుడు సంభవించింది. అనంతరం కాల్పుల శబ్దాలు వినిపించాయి. పేలుడు ధాటికి మసీదు వెలుపల భారీ గొయ్యి ఏర్పడింది. బయటి భాగం దెబ్బతినడంతో పాటు గోడ కూలింది. పోలీసు సిబ్బందికి గాయాలయ్యాయి. అధికారులు అత్యవసర పరిస్థితి విధించారు. ఈ ఘటనను ఆత్మాహుతి దాడిగా అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# 37 మంది కార్మికుల కస్టడీ డెత్

- నైజీరియాలో అక్రమ గనులపై దాడుల తర్వాత నిరసనలు



**మిన్నా:** నైజీరియాలోని నైజర్ రాష్ట్రంలో పారామిలిటరీ దళం కస్టడీలో 37 మంది గని కార్మికులు మతిచెందారు. అక్రమ బంగారు గనులపై బుధ, గురువారాల్లో నైజీరియన్ సెక్యూరిటీ అండ్ సివిల్ డిఫెన్స్ కార్ప్స్ (ఎన్ఎస్‌సిడిసి) జరిపిన దాడు నేపథ్యంలో ఈ కార్మికులను నిర్బంధించారు. నైజర్ రాజధాని మిన్నాకు పశ్చిమాన ఉన్న ఉషిషీలుకోటో ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. తొలుత వ్యాధిగ్రస్తులై వీరంతా చనిపోయినట్లు ఎన్ఎస్‌సిడిసి వెల్లడించింది. అనంతరం వారి మరణాలకుగల కారణాలను ధ్రువీకరించేందుకుగాను వైద్య పరీక్షలు, ఫోరెన్సిక్ దర్యాప్తు చేపట్టింది. ఇదే క్రమంలో నైజీరియా అంతర్గత వ్యవహారాల మంత్రి ఒలుబున్మి తుంజిఓజో నైజర్ స్పందించారు. ఎన్ఎస్‌సిడిసి కమాండెంట్ సుబేరు సియాకా అనివియేను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ఈ ఘటనపై పూర్తి దర్యాప్తు చేపట్టాలని అన్నారు. ఇది చాలా బాధాకరమంటూ కార్మికుల మరణాలపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 37 మంది గని కార్మికులు కస్టడీలో మరణించడంపై స్థానికుల్లో ఆగ్రహావేశం కట్టలు తెంచుకుంది. వారంతా వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టారు. మిన్నాలో 'జస్టిస్ మస్ట్ బీ డన్' (న్యాయం జరగాలి) అన్న నినాదాలతో యువత కదం తొక్కగా, అధికారులు వెంటనే నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. అరెస్టుకు గురైన తన బిడ్డ అబ్దుల్లాహి కస్టడీలో మరణించినట్లు తెలిసి అతని తల్లి షఫాతు సులేమాన్ కన్నీటిపర్యంతమయ్యారు. కస్టడీలోకి తీసుకున్న కార్మికులను కలిసేందుకు వారి కుటుంబ సభ్యులకు అధికారులు అనుమతి ఇవ్వలేదని, అలా కలవాలంటే 100,000 నైరా అంటే 75 డాలర్లు డిమాండ్ చేశారని, కనీసం ఆహారం ఇవ్వనివ్వలేదని ఆ తల్లి గుండెలు బాదుకున్నది. తన బిడ్డ కడచూపు కోసం అల్లాడిపోయింది. ఇది అన్యాయం, మేము క్షమించము అంటూ రోదించింది.

# ఐరాస సమావేశానికి ఇరాన్

## వీసాలు ఆమోదించిన అమెరికా



**వాషింగ్టన్:** అమెరికా ఇరాన్ భీకర యుద్ధం వేళ కీలక పరిణామం చోటుచేసుకోనుంది. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ సహా ఆ దేశ కీలక నాయకులు న్యూయార్క్‌లో జరగబోయే ఐరాస ప్రతినిధుల సదస్సుకు హాజరు కాబోతోతున్నారు. ఇందుకుగాను వారికి వీసాలను అమెరికా ఆమోదించింది. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. వచ్చేవారం ఎన్‌జీఏ 81వ సమావేశాలు జరగనున్నాయి. ఆతిథ్యమిచ్చే దేశంగా తమ వంతు బాధ్యతగా ఇరాన్ ప్రతినిధి బృందానికి అనుమతి ఇస్తున్నట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే ప్రతినిధుల సంఖ్య తక్కువగా ఉంటుందన్నారు. ప్రయాణ ఆంక్షలు, విలాస వస్తువులు, ఇతర వుస్తువుల కొనుగోలుపై నిషేధం కొనసాగుతాయని తెలిపారు. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్ భావిస్తుందని, అందుకు షరతులు వర్తిస్తాయని అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేసిన నేపథ్యంలో ఇరాన్ ప్రతినిధుల తాజా పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

**పాలస్తీనాకు అనుమతి నిరాకరణ**

పాలస్తీనా ప్రతినిధి బృందానికి అమెరికా వీసాలను తిరస్కరించింది. ఇజ్రాయిల్‌తో శాంతి ఒప్పందంపై హామీలకు కట్టుబడలేదని పాలస్తీనా అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్ సహా ఇతర ఉన్నతాధికారులపై అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ ఆరోపణలు చేసింది. ఇదిలావుంటే, ఐరాస భద్రతామండలిలో అగ్రదేశాలే రాజ్యమేందని, అంతర్జాతీయ చట్టాలను బేఖతారరు చేస్తున్నాయని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఐరసకు సంస్కరించాలని పిలుపునిచ్చారు.

# ఇరాన్ ఒప్పందానికి షరతులు వర్తిస్తాయ్

## అంతా అనుకూలంగా ఉంటేనే ముందుకు: ట్రంప్



**వాషింగ్టన్:** ఇరాన్‌తో మంచి ఒప్పందం కుదిరితేనే ముందుకు వెళతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశాల నేపథ్యంలో గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ) దేశాల అధినేతలతో కీలక భేటీ జరగనున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తమ అంచనాలకు తగ్గట్టు ఇరాన్‌తో ఒప్పందం జరగకపోతే చర్చలకూ తావులేదన్నారు. అమెరికాతో ఒప్పందాన్ని ఇరాన్ కోరుకుంటోందని, అందుకు షరతులు వర్తిస్తాయని ఆయనన్నారు. ఇరాన్ ప్రస్తుతానికి షరతులతో కూడిన ఒప్పందానికి సిద్ధంగా లేదని కూడా చెప్పారు. ఇదిలావుంటే, యుద్ధాన్ని ముగించే దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. వచ్చే వారం న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి సమావేశాలలో భాగంగా జిసిసి సమావేశం జరగనున్నది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, బ్రహెయిన్, కువైట్, ఒమన్ ప్రతినిధులతో ట్రంప్ ప్రత్యేకంగా చర్చలు జరపనున్నారు. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ ఇప్పటికే వెల్లడించింది. ఆయా దేశాధినేతలకు ఆహ్వానం పంపినట్లు తెలిపింది. అదే క్రమంలో జీసిసిని విస్తరించాలని కూడా అమెరికా యోచిస్తున్నట్లు సమాచారం. ఇదిలావుంటే, ట్రంప్ అధికారాలకు కళ్లెం వేసే దిశగా అమెరికా ప్రతినిధుల సభ కీలక తీర్మానాన్ని ఆమోదించింది. దీనిని డెమొక్రాటిక్ ప్రతినిధి సేథ్ మోల్టన్ ప్రవేశపెట్టారు. తీర్మానానికి అనుకూలంగా 220 ఓట్లు, వ్యతిరేకంగా 204 ఓట్లు వచ్చాయి. రిపబ్లికన్ పార్టీకి చెందిన ఏడుగురు సభ్యులు మద్దతిచ్చారు. 'లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ 2026' చట్టాన్ని కూడా ప్రతినిధుల సభ ఆమోదించింది. రష్యా, ఇరాన్ చమురు, గ్యాస్ కొనుగోలు దేశాలపై 100 శాతం సుంకాలు విధించేలా అమెరికాకు ఈ చట్టం విచక్షణాధికారాన్ని కట్టబెడుతోంది. అయితే చైనా దీనిని తీవ్రంగా వ్యతిరేకించింది.

# గిరిజన ప్రాంతాల్లో పోలీస్ నియామకాల్లో 75శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

## సిఎంఎం రేవంత్‌రెడ్డికి మంత్రి అడ్లూరి, గిరిజన ఎమ్మెల్యేల వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గిరిజన ప్రాంతాల్లో పోలీస్ సివిల్ కానిస్టేబుల్ నియామకాల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. గిరిజన ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, రామదాసు నాయక్, ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లుతో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ శుక్రవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని క కలిసి వినతి పత్రం సమర్పించారు. 2026 పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో గిరిజన ప్రాంతాలకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేయకపోవడంతో ఆయా ప్రాంతాల యువతలో ఆందోళన నెలకొందని మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ సిఎంకు వివరించారు. 2022 నియామకాల్లో అమలు చేసిన విధానాన్ని 2026లోనూ కొనసాగించాలని కోరారు. జిఒనంబర్, 109,గెటిట్ నోటిఫికేషన్ 49లోని ప్రత్యేక నిబంధనలను పరిగణనలోకి తీసుకుని గిరిజన ప్రాంతాల పోస్టుల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ఈ అంశంపై సంబంధిత అధికారులతో సమీక్షించి గిరిజన యువతకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు.

# సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

వివరాలతో వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి సిఎం అందజేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. అలాగే, తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని సిఎం వివరించారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. పంటల మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలన్న ఆలోచనతో 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా సిఎం చెప్పారు.

పిఎం ఆవాస్ యోజన గ్రామీణ (పిఎంఎవైజి) పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రానికి 2 లక్షల ఇండ్లను కేటాయించినందుకు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్రంలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని గత జూలైలో కేంద్రమంత్రికి ఢిల్లీలో వినతిపత్రం అందించిన విషయాన్ని సిఎం ప్రస్తావించారు. రాష్ట్రంలో ఇండ్ల కోసం డిమాండ్‌కు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రిని సిఎం కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తున్నామని, అలాగే సన్న వడ్లకు రూ. 500 బోనస్‌ను అందించి ప్రోత్సహిస్తున్నామని సిఎం వివరించారు.

# ఎన్నికల నగారా

(మొదటి పేజీ తరువాయి)

ఆర్‌టిసి యాజమాన్యం జారీ చేసింది. దశాబ్దం తర్వాత గుర్తింపు సంఘం ఎన్నికలు జరగనుండడంతో ఆర్‌టిసి కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

**ఆరు నెలల సర్వీసు తప్పనిసరి**

కార్మిక శాఖ షెడ్యుల్‌తో గుర్తింపు సంఘం ఎన్నికలకు ఆర్‌టిసిలో రంగం సిద్ధమైంది. సెప్టెంబర్ 1 నాటికి కనీసం ఆరు నెలల నిరంతర సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు ఓటు హక్కు ఉంటుంది. సంస్థలో ప్రత్యక్షంగా పనిచేస్తున్న రెగ్యులర్, క్యాజువల్, కాంట్రాక్ట్, కన్సాలిడేటెడ్ వేతన సిబ్బందితో పాటు మెడికల్ లీవ్, లాంగ్ లీవ్, ఇఓఎల్‌లో ఉన్న ఉద్యోగులు, సస్పెన్షన్, పుట్ ఆఫ్ డ్యూటీలో ఉన్న సిబ్బందికి కూడా ఓటు హక్కు కల్పించారు. క్లాస్ 2 సూపర్వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, ప్రైవేట్ ఈబస్సు డ్రైవర్లు, రిటైర్డ్, ఉద్యోగం నుంచి తొలగించబడిన సిబ్బంది, ఎపిఎస్‌ఆర్‌టిసి నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి పనిచేస్తున్న ఉద్యోగులకు ఓటు హక్కు ఉండదు.

**ప్రచారంపై ఆంక్షలు**

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఉద్యోగుల బదిలీలను నిలిపివేశారు. డిపోలు, వర్క్ షాప్ ప్రాంగణాల్లో యూనియన్ సమావేశాలు నిర్వహించరాదని ఆదేశించారు. ఆర్‌టిసి బస్సులు, డిపో భవనాలు, వాటర్ ట్యాంకులు, ఇతర నిర్మాణాలపై ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, కరపత్రాల ప్రదర్శనను నిషేధించారు. శాంతియుత, పారదర్శక వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# కోట్లు ప్రకటించాలి

(మొదటి పేజీ తరువాయి)

వేసేందుకు వెంటనే కేంద్ర బృందాన్ని పంపాలని, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ నిధులను సత్వరమే విడుదల చేయాలని కోరింది. ఉపాధి హామీ పథకంలో పనిదినాలను 125 రోజుల నుంచి మరో 50 రోజులకు పెంచాలని, అదనపు వ్యయాన్ని కేంద్రమే భరించాలని విజ్ఞప్తి చేసింది. వర్షాభావం కారణంగా పంట నష్టం, ఇన్పుట్ సబ్సిడి, తాగునీటి సరఫరా, పశుగ్రాసం, పశుసంపద పరిరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, చెరువులు, ఇతర జల వనరుల అభివృద్ధి కోసం ప్రత్యేక సహాయం అందించాలని కేంద్రాన్ని కోరింది. అవసరమైతే ప్రస్తుత నిబంధనలను సడలించాలని విజ్ఞప్తి చేసింది. ఈ అదనపు వ్యయాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వం భరించాలని, రాష్ట్రంలో అమలవుతున్న 60 రోజుల సీజనల్ సస్పెన్షన్ కాలాన్ని సడలించాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు రాష్ట్రానికి అవసరమైన ఎరువులను సకాలంలో కేటాయించాలని, ప్రభావిత జిల్లాలకు ముందుగానే సరఫరా చేయాలని కోరారు. సూక్ష్మ సేద్యం విస్తరణకు పర్ డ్రాప్ మోర్ క్రాప్ పథకం కింద నిధులు పెంచాలని, ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సబ్సిడిపై అందించాలని కేంద్రాన్ని కోరారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణకు అదనంగా 1,500 మెగావాట్ల విద్యుత్ కేటాయించాలని తీర్మానంలో పేర్కొన్నారు. కేంద్ర విద్యుత్ సంస్థల్లో వినియోగించని కోటా నుంచి ఈ విద్యుత్ను అందించాలని, రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరాను పెంచేందుకు 5 మిలియన్ టన్నుల బొగ్గు లింకేజీని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ట్రాన్స్‌మిషన్ ఛార్జీల్లో సడలింపులు ఇవ్వాలని కోరారు. చెరువులు, నీటి వనరుల పునరుద్ధరణతో పాటు కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు కేంద్ర పథకాల ద్వారా అదనపు సహాయం అందించాలని తీర్మానించారు. రాష్ట్రానికి అవసరమైన ఉపశమన చర్యలు చేపట్టేందుకు వీలుగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి ఎఫ్‌ఆర్‌బిఎం రుణ పరిమితిని జిఎస్‌డిపిలో 3 శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలని కూడా కేంద్రాన్ని కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఉపశమన, నివారణ చర్యలకు అవసరమైన అదనపు వ్యయాన్ని రాష్ట్రం భరించేందుకు ఈ పెంపు ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు, బలహీన వర్గాల కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద అదనపు ఆర్థిక సహాయం అందించాలని, అవసరమైన నిబంధనలను సడలించాలని తీర్మానంలో విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించేందుకు కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని సభ అభిప్రాయపడింది. ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ, రాష్ట్రంలో వర్షపాతం లోటు వల్ల వ్యవసాయ సాగు విస్తీర్ణం తగ్గడమే కాకుండా, భూగర్భ జలాలు పడిపోయి రైతులు బోరు బావులపై ఆధారపడటంతో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సెప్టెంబర్ 9న రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 19,543 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదు కాగా, మార్కెట్ కొనుగోళ్లు, ప్రాజెక్టుల నిర్వహణ ద్వారా ఎక్కడా అంతరాయం లేకుండా సరఫరా చేశామని తెలిపారు. రాబోయే 1112 నెలలకు కావలసిన తాగునీటికి తొలి ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని, సింగూరు, మంజీరా, కృష్ణా, గోదావరి వనరుల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. నీటి లభ్యతను బట్టి రైతులు మెట్ట పంటలు, ప్రత్యామ్నాయ సాగు పద్ధతులను పాటించేలా 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' వంటి కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించామన్నారు.

# అనర్హత వేటు

(మొదటి పేజీ తరువాయి)

పరిగణించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపునకు పాల్పడలేదన్న వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. మరోవైపు, దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు ఆయన బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, అసెంబ్లీ రికార్డుల్లో ఆయన బీఆర్ఎస్ సభ్యుడిగానే ఉన్నారని వాదించారు. కాంగ్రెస్ నేతలను కలవడం, ఆ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం, కండువా ధరించడం వంటి అంశాలతో స్వచ్ఛందంగా సభ్యత్వాన్ని వదులుకున్నట్లు నిర్ధారించలేమని, కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసినంత మాత్రాన అసెంబ్లీ సభ్యత్వం ఆటోమేటిక్‌గా రద్దు కాదని పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ–ఫారంతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం అనర్హతకు చట్టపరమైన ఆధారమని హైకోర్టు స్పష్టం చేసింది.

తీర్పు వెలువడిన వెంటనే దానం నాగేందర్ తరఫు న్యాయవాది జోక్యం చేసుకుని, హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు సహేతుకమైన సమయం ఇవ్వాలని, అప్పటివరకు తీర్పు అమలును నిలిపివేయాలని కోరారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. అనర్హతకు గురైన వ్యక్తి ఒక్కరోజు కూడా ఎమ్మెల్యేగా కొనసాగడానికి వీల్లేదని, దానం నాగేందర్ ఇప్పటికే సుదీర్ఘ కాలంగా ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారని వాదించారు. సుప్రీంకోర్టు గతంలో నిర్దేశించిన న్యాయసూత్రాలను కూడా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అప్పీల్ దాఖలు చేసుకునే వరకు తీర్పును నిలిపివేయాలన్న దానం తరఫు అభ్యర్థనను డివిజన్ బెంచ్ తిరస్కరించింది.

ఈ వ్యవహారంలో తొలినుంచి కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరినట్లు పిటిషనర్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేయడాన్ని ప్రధాన ఆధారంగా చూపుతూ పాడి కౌశిక్‌రెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు. మరో పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా అసలు పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లు స్పష్టమవుతోందని వారు వాదించారు. దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు మాత్రం కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించలేదని, వ్యక్తిగత పరిచయాల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను కలిశారని, నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రులు, ముఖ్యమంత్రిని కలవడం పార్టీ మారినట్లుగా పరిగణించలేమని పేర్కొన్నారు.

దానం నాగేందర్‌తోపాటు కాంగ్రెస్‌లో చేరిన ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత అంశంపైనా తొలుత హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద విచారణ జరిగింది. స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లను నిర్ణయ ప్రక్రియకు తీసుకెళ్లాలని సింగిల్ జడ్జి ఆదేశించారు. అనంతరం ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు వెళ్లగా, స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉన్న పది మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను నిర్ణీత కాలంలో పరిష్కరించాలని 2025 జూలై 31న సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ ఆదేశాల నేపథ్యంలో స్పీకర్ దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్లను విచారించి తిరస్కరించారు. ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కౌశిక్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు పూర్తయిన అనంతరం చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌ల ధర్మాసనం ఆగస్టు 21న తీర్పును రిజర్వు చేసింది. తొలుత సెప్టెంబర్ 16న తీర్పు వెలువరించనున్నట్లు ప్రకటించినా, అనంతరం సెప్టెంబర్ 18న తీర్పు ప్రకటించింది. తాజాగా స్పీకర్ నిర్ణయాన్ని రద్దు చేసి దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు హైకోర్టు స్పష్టం చేసింది.

# ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో ఎల్.బి. నగర్ నియోజకవర్గంలోని రెగ్యులరైజేషన్ సమస్యను పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రంగారెడ్డి జిల్లాలోని ఎల్.బి. నగర్ నియోజకవర్గంలో జి.ఓ.118 ప్రకారం 9,700 ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన మెమోను ప్రభుత్వం శుక్రవారం జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు శనివారం నుంచి రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మంత్రి పొంగులేటి అన్నారు. దశాబ్దాలుగా అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్న ప్లాట్ యజమానులు స్థానిక అధికారులను సంప్రదించి, నిబంధనల ప్రకారం తమ స్థలాలను రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు. సింగరేణి ప్రాంతంలోని ఇండ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జారీ చేసిన జి.ఓ.76 ఆధారంగా చర్యలు ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ అంశంపై శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి, రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రారంభిస్తామని వెల్లడించారు. అలాగే రెవెన్యూ రికార్డుల్లో 22ఎ పరిధిలో ఉన్నప్పటికీ హెచ్‌ఎండిఎ, డిటిసిపి, జిహెచ్‌ఎంసి అనుమతులతో లేఔట్‌లు అభివృద్ధి చేసిన ప్రాంతాలను 22ఎ జాబితా నుంచి తొలగించే అంశంపై ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని మంత్రి ప్రకటించారు. ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటించిన 10 నుంచి 12 అంశాలపై నెల రోజుల్లో నిర్ణయాలు తీసుకుని, 22ఎ దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పిస్తామని స్పష్టం చేశారు.

# విపత్తుగా ప్రకటించాలి

(మొదటి పేజీ తరువాయి)

సమన్వయంగా కార్యాచరణను రూపొందించి, అమలు చేయాలని తెలిపారు. కరువు నెలకొన్న నేపథ్యంలో పరస్పరం ఆరోపణలు చేసుకోకుండా అందరూ కలిసి విపత్తు నుంచి బయటపడాలని ఆయన బిజెపి,బిఆర్ఎస్, కాంగ్రెస్‌కు సూచించారు. శాసనసభలో "ఎల్‌నినో ప్రభావాలుపరిహారక చర్యలు " అనే అంశంపైన శుక్రవారం జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. జాతీయ విపత్తుగా ప్రకటించే విధంగా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని, కరువు జిల్లాను, మండలాలను గుర్తించాలని తెలిపారు. కరువు నేపథ్యంలో రాష్ట్రంలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించి, నిధులను రాబట్టేందుకు ఒత్తిడిని పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కోసం నిధులను కేటాయించాలన్నారు. రాష్ట్రంలో కరెంటు కోతలు మొదలవ్వడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారని, దీని నుంచి బయటపడేందుకు ప్రభుత్వం ఆలోచించాలన్నారు. సీతరామ ప్రాజెక్ట్ అసమానతలు ఉన్నాయని, మహబూబబాద్‌లో నీళ్లు రాకుండా చేస్తున్నారని చెబుతున్నారని, బయ్యారం చెరువును ఉపయోగించి, వెంటనే నీటిని ఇచ్చేందుకు ప్రయత్నించాలన్నారు. పోతిరెడ్డి పోడును ఉపయోగిస్తున్నారనే వార్తలు వస్తున్నాయని, ఏమైనా ఇబ్బంది కలిగితే హైదరాబాద్‌లో కూడా నీటి సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు. రాష్ట్రంలోని ఎస్‌ఆర్‌ఎస్‌పి, దేవాదుల నుంచి మొదలు లింక్ కెనాల్స్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు ప్రయత్నించాలని కూనంనేని సాంబశివరావు సూచించారు. ప్రాణహిత వద్ద త్వరగా ఏమైన పనులు చేపట్టేందుకు అవకాశాలు ఉన్నాయా? లేదా పరిశీలించాలన్నారు. ఈ ఏడాది అత్యంత తక్కువ పంటలు వేశారని, ఆహార ధాన్యాల సంక్షోభం వచ్చే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద బ్యారేజీల వైపు వెళ్లకుండా చిన్నవాటిపైన దృష్టి పెడితే ఇప్పటికే పూర్తయేవన్నారు. లక్షల కోట్లు ఖర్చు చేసి పూర్తి చేసిన ప్రాజెక్ట్‌లకు ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ప్రస్తుత 'ఎల్‌నినో' 70 ఏళ్లలో అత్యంత పెద్ద కరువు అని కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రకృతి కోసం వచ్చిన ప్రతి సందర్భంగా రైతులే బాదితులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**అన్ని రాజకీయ పార్టీలతో గ్రామ కమిటీలు వేయండి...**

ఎల్‌నినో కరువు నెలకొన్న నేపథ్యంలో గ్రామాల్లో అన్ని రాజకీయ పార్టీలతో కలిపి ఒక కమిటీని ఏర్పాటు చేస్తే, ఆ కమిటీనే స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఏ పంటలు వేయాలి? నీటిని ఎలా వాడుకోవాలో నిర్ణయం తీసుకుంటుందని కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. వాతావరణ పరి స్థితులపైన గ్రామాల్లో అవగాహణ కల్పించి, దీనిని ఒక ఉద్యమంగా చేపట్టాలన్నారు. ఎక్కడికక్కడ లిఫ్టులకు మరమ్మతలు చేపడితే బాగుంటుందన్నారు. కరువు పరిస్థితులపైన మేధావులతో కలిసి చర్చించి, పక్కా ప్రణాళికను రూపొందించాలన్నారు.

# తొలి ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

రూపొందిస్తున్నామన్నారు. ప్రకృతి సృష్టించిన ఎల్‌నినోకు గత బిఆర్ఎస్ పాలకులు మిగిల్చిన వైఫల్యాల భారం జతకలిసిందని, లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు ప్రచారం చేసుకున్నప్పటికీ, రైతు పొలానికి నిరంతరంగా నీరు అందించే సమగ్ర వ్యవస్థను నిర్మించలేకపోయారని, సాగునీటి రంగాన్ని శాస్త్రీయ ప్రణాళిక కంటే రాజకీయ ఆర్భాటానికి పరిమితమవ్వడంతో ప్రస్తుత వర్షాభావాన్ని ఎదుర్కొనే సామర్థ్యం బలహీనపడిందన్నారు. శాసనసభలో "ఎల్‌నినో ప్రభావాలుపరిహారక చర్యలు" అంశంపైన శుక్రవారం జరిగిన స్వల్పకాలిక చర్చకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానమిచ్చారు.

జలాశయాల స్థితి, కొత్తగా వచ్చే ప్రవాహాలను పది రోజులకోసారి సమీక్షిస్తూ, ఎప్పటికప్పుడు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. రానున్న వర్షకాలం నాటికి మేడిగడ్డకు మరమ్మత్తులు చేసి ఉపయోగంలోనికి తీసుకొస్తామని, తుమ్మడి హట్టి ప్రాజెక్ట్‌ను చేపడుతామని వెల్లడించారు. మేడిగడ్డ బ్యారేజీ ప్రస్తుత దుస్థితి గత ప్రభుత్వ నిర్మాణ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. మేడిగడ్డలోని ఏడో బ్లాక్ దెబ్బతినడంతో బ్యారేజీ నీటి మళ్లింపునకు పనికిరాని స్థితికి చేరిందని, అన్నారం,సుందిళ్ల నిర్మాణాలు కూడా సురక్షిత నిల్వకు అనుకూలంగా లేదని జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ నివేదిక స్పష్టం చేసిందన్నారు. మూడు బ్యారేజీల నిర్మాణ సమగ్రత, పునాది స్థితి,నీటిఊట,అప్లిఫ్ట్ ప్రెజర్, ఎనర్జీ డిసిపేషన్ వ్యవస్థలను నిర్ధారించకుండా నీటిని నిల్వచేయడం ప్రజల భద్రతతో చెలగాటమాడటమే అవుతుందని స్పష్టం చేశారు.

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 90 శాతం పూర్తయిందన్న బిఆర్ఎస్ వాదన సాంకేతికంగా నిలబడబోదన్నారు. కొన్ని పంప్‌హౌస్‌లను లేదా రిజర్వాయర్ల నిర్మాణాన్ని చూపించి మొత్తం పథకం పూర్తయిందని చెప్పలేమన్నారు.

కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం చట్టపరమైన అన్ని వేదికలపై ప్రభుత్వం బలమైన వాదనలు వినిపిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన ఒక్క చుక్క నీటినీ వదులుకోబోమని, ఇతర రాష్ట్రాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నామన్న ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. రాబోయే వేసవి అవసరాలకు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వివరించారు.

## జలాశయాల్లో తగ్గిన నీటి నిల్వలు..

సెప్టెంబర్ 17 నాటికి శ్రీశైలంలో వినియోగయోగ్యమైన నిల్వ గత ఏడాది 153.56 టిఎంసీలు ఉండగా, ప్రస్తుతం 61.65 టిఎంసీలకే పరిమితమైందని, నాగార్జునసాగర్‌లో గత సంవత్సరం 174.25 టిఎంసీలు అందుబాటులో ఉంటే, ఈసారి 44.89 టిఎంసీలు, సింగూరులో 16.69 టిఎంసీల నుంచి 3.48 టిఎంసీలు,దిగువ మానేరులో 21.39 టిఎంసీల నుంచి 8.95 టీఎంసీలకు నిల్వలు పడిపోయాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. రాష్ట్రంలోని 44,034 చెరువుల్లో దాదాపు 40 శాతం జలవనరులు తమ సామర్థ్యంలో నాలుగోవంతు కన్నా తక్కువగా నిండాయని, 75 నుంచి 100 శాతం నీరు చేరినవి కేవలం 18 శాతమేనని, ఈ గణాంకాలు సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నాయన్నారు.

## తుమ్మిడి హెట్టిపై కేంద్రాన్ని ఒప్పించండి

ఉత్తర తెలంగాణ రైతాంగ భవిష్యత్తుతో ముడిపడిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకునేలా రాష్ట్ర బిజెపి నాయకులు ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. మహారాష్ట్రతో అవసరమైన అంతర్రాష్ట్ర అంగీకారం సాధించే బాధ్యతను కేంద్రం స్వీకరించేలా చూడాలని, ఇందుకు తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించాలని ఆయన బిజెపి ఎమ్మెల్యేలకు సూచించారు. కాళేశ్వరం అప్పులకే రూ. 15 నుంచి 16వేల కోట్ల చెల్లింపు భారీగా ప్రజాధనం వెచ్చించినప్పటికీ కాళేశ్వరం వ్యవస్థకు ఆరంభ ద్వారమైన మేడిగడ్డే కుంగిపోవడం గత పాలకుల అవగాహన లోపానికి, ప్రణాళికా వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రాబోయే తరాలను తాకట్టు పెట్టి 11 నుంచి 12 శాతం వడ్డీలకు అప్పులు తీసుకొచ్చారని, ప్రస్తుత కాళేశ్వరం కోసం చేసిన రుణాల చెల్లింపుల కోసమే తమ ప్రభుత్వం ఏటా నీటి పారుదల బడ్జెట్ నుంచి రూ.15 వేల కోట్ల నుంచి రూ.16 వేల కోట్ల వరకు భరించాల్సి వస్తోందన్నారు. ని వివరించారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయిన తరువాత కూడా గత పాలకులు తమ తప్పును అంగీకరించకుండా ప్రస్తుత ప్రభుత్వంపై ఎదురుదాడి చేయడం హాస్యాస్పదమన్నారు.

# ఆసియా క్రీడల సెమీఫైనల్లో భారత్

## చరణి స్పిన్‌కు జపాన్ విలవిల



ఆసియా క్రీడల్లోనూ భారత మహిళల జట్టు అదరగొట్టింది. క్వార్టర్ ఫైనల్లో తిప్పేసిన శ్రీ చరణి (4–10) కెరీర్లోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేయడంతో అలవోకగా జపాన్‌ను చిత్తు చేసింది టీమిండియా. స్వల్ప ఛేదనలో ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్, 213) విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తించింది. ఎనిమిది వికెట్ల తేడాతో భారీ విజయం సాధించిన ఉమెన్ ఇన్ బ్లూ సెమీస్‌కు దూసుకెళ్లింది.

డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఆసియా కప్‌లో అడుగుపెట్టిన భారత జట్టు టైటిల్ నిలబెట్టుకునే దిశగా సాగుతోంది. నిరుడు గోల్ మెడల్‌తో సత్తా చాటిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం.. దర్జాగా సెమీస్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జపాన్ బ్యాటర్లను శ్రీ చరణి(4–10) వణికించింది. ఈ తెలుగమ్మాయి సంచలన ప్రదర్శనతో 57 పరుగులకే ఆతిథ్య దేశం జట్టు కుప్పకూలింది. అనంతరం ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో 5 ఓవరల్లోనే ఉమెన్ ఇన్ బ్లూ జయకేతనం ఎగురవేసింది.

### చరణి, షఫాలి పోటీపడి

తొలుత బ్యాటింగ్ చేసిన జపాన్‌ను భారత స్పిన్నర్లు స్వల్ప స్కోర్‌కే కట్టడి చేశారు. ఓపెనర్ అయకా కటో స్టఫోర్డ్(25) ప్రతిఘటించినా.. శ్రీ చరణి(4–10), షఫాలీ వర్మ(2–13)ల ధాటికి మిగతా వారు ఇలా వచ్చి అలా వెళ్లారు. ఒకే ఓవర్‌లో రెండేసి వికెట్లతో చరణి జపాన్‌ను కోలుకోలేని దెబ్బకొట్టింది. ఈ స్పిన్ ద్వయం వికెట్ల వేటతో ప్రత్యర్థిని 57కే పరిమితం చేసింది టీమిండియా. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఐదు ఓవర్లలోనే టీమిండియా ఉఫ్మనిపించింది. ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్) మెరుపు అరంభాన్నిస్తూ.. 15 బంతుల్లోనే ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో విరుచుకుపడింది. జి.కమలిని(0), భారతి ఫుల్మాలి(6)లు విఫలమైనా షఫాలి దూకుడుతో జపాన్ బౌలర్లు అల్లాడిపోయారు. రీచా ఘోష్(12 నాటౌట్) జతగా టీమిండియాకు 8 వికెట్ల విజయం కట్టబెట్టింది డాషింగ్ ఓపెనర్. అద్భుత విజయంతో సెమీస్ చేరిన భారత్.. ఫైనల్ బెర్తు కోసం సెప్టెంబర్ 20న బంగ్లాదేశ్‌ను ఢీ కొట్టనుంది. అదే రోజు ఉదయం తొలి సెమీస్‌లో పాకిస్థాన్, శ్రీలంక తలపడనున్నాయి.

# తొలిరోజే భారత బృందానికి సమస్యల స్వాగతం



ఆసియా క్రీడల్లో అథ్లెట్లకు మెరుగైన వసతులు లేకపోవడం తీవ్ర సమస్యగా మారుతోంది. సర్దుకుపోదాంలే అనుకుంటూ నగోయలో అడుపెట్టిన క్రీడాకారులకు అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆసియాడ్‌లో పతకాల వేటకు వెళ్లిన భారత షూటర్లకు కష్టాలు స్వాగతం పలికాయి. జపాన్‌లో కాలుమోపిన రోజే రవాణా సౌకర్యం ఆలస్యం కారణంగా వీధుల్లో నిరీక్షించారు మన షూటర్లు. అంతేకాదు వసతుల కొరత, శిక్షణకు అంతరాయం వంటివి భారత బృందానికి సవాల్ విసురుతున్నాయని ఎన్డీటీవీ కథనం పేర్కొంది. పద్దెనిమిదో ఆసియా క్రీడల కోసం భారత షూటర్ల బృందం సెప్టెంబర్ 15న జపాన్ వెళ్లింది. రాత్రి 11 గంటలకు కస్టమ్స్ అనుమతి లభించగా.. అక్రెడిటేషన్ నిర్ధరణ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడపదిహేను నిమిషలు పట్టగా.. ఇక బస్సు రావడం ఆసియా క్రీడల నగరం నగోయకు వెళ్లడమే తరువాయి అనుకున్నారంతా. కానీ, ఆశ్చర్యంగా.. రవాణా సౌకర్యం లేకపోవడంతో ఒలింపిక్ విజేత మనూభాకర్, కామన్వెల్త్ మెరిసిన ఇషా సింగ్లతో కూడిన 35 మంది భారత షూటర్ల బృందం వీధుల్లోనే నిరీక్షించింది. రాత్రి 11:45 గంటల నుంచి మరునాడు ఉదయం 3 గంటల వరకూ అక్కడే వేచి చూసిన షూటర్లు.. ఎట్టకేలకు మూడు తర్వాత కేటాయించిన హోటల్ చేరారు. 'హమ్మయ్య ఎలాగోలా వచ్చేశాం' అనుకొనే లోపే అక్కడ అంత మందికి ఏడు గదులే ఇవ్వడం చూసి షాకయ్యారు. విషయం తెలిసిన భారత ఒలింపిక్ సంఘం వెంటనే స్పందించింది. షూటర్ల సౌకర్యార్థం అక్కడికి 400మీటర్ల దూరంలో 18గదులు బుక్ చేసింది ఐఓఏ. ఈ సమస్య పరిష్కారం అయిందని సంతోషించిన భారత షూటర్లకు శిక్షణ కేంద్రానికి వెళ్లడంలో ఆటంకం ఏర్పడింది. ఉదయం 7 గంటలకు బస్సు ఎక్కి.. 8:20 గంటలకు ట్రైనింగ్ సెంటర్కు వెళ్లాలి. కానీ, ఒకటే బస్సు ఏర్పాటు చేయడంతో అందరూ ఒకేసారి వెళ్లలేకపోయారు. తదుపరి బస్సు వచ్చేంత వరకూ కోచ్లు, కొందరు షూటర్లు గంటల కొద్దీ క్యూలైన్లో వేచి ఉన్నారు. ఇలా.. నగోయలో వసతి సౌలభ్యం నుంచి..సాధన చేసేందుకు కూడా నిరీక్షించాల్సిన పరిస్థితి తలెత్తడంతో ఇదెక్కడి ఆతిథ్యం అని తల పట్టుకుంటున్నారు క్రీడాకారులు.

# సైన్స్

## 2035లో మంగళగ్రహం అద్భుత దృశ్యం

ఖగోళ శాస్త్రవేత్తలను అనుసరించి, 2035 సెప్టెంబర్ 15న జరిగే ఒక ఖగోళ సంఘటన అద్భుత దృశ్యంలా, ప్రత్యేకమైన సందర్భంగా మారనుంది. ఆ రోజున అంగారక గ్రహం (మార్స్) భూమికి అత్యంత అనుకూలమైన స్థానంలో కనిపించే అవకాశం ఉంటుంది. దీనికి కారణం 'ఆపోజిషన్' అనే ఖగోళ స్థితి. ఆపోజిషన్ సమయంలో సూర్యుడు, భూమి, మార్స్ ఒకే సరళరేఖలో ఉంటాయి. మధ్యలో భూమి ఉండగా, ఒక వైపు సూర్యుడు, మరో వైపు మంగళగ్రహం ఉంటుంది. ఈ అమరిక వల్ల అంగారక గ్రహం భూమికి ఎదురుగా పూర్తిగా వెలుగును అందుకుంటుంది. అందుకే అది సాధారణ రోజుల కంటే ఎక్కువ ప్రకాశవంతంగా కనిపిస్తుంది. ఈ సమయంలో రాత్రి ఆకాశంలో మంగళగ్రహాన్ని సులభంగా గుర్తించవచ్చు. అది సాధారణ నక్షత్రంలా మెరుస్తూ కాకుండా, ప్రత్యేకమైన



ఎర్రటి కాంతి బిందువులా కనిపిస్తుంది. ఈ ఎరుపు రంగుకు కారణం ఆ గ్రహం ఉపరితలంపై విస్తరించి ఉన్న ఐరన్ ఆక్సైడ్ లేదా తుప్పు పదార్థాలు. అందుకే మంగళగ్రహాన్ని 'ఎర్ర గ్రహం' (రెడ్ ప్లానెట్' అని పిలుస్తారు. మంచి నాణ్యత గల చిన్న టెలిస్కోప్ లేదా బైనాక్యులర్స్ ఉపయోగిస్తే ఈ సమయంలో మార్స్‌ను మరింత నిశితంగా గమనించే అవకాశం ఉంటుంది. దాని ధ్రువ ప్రాంతాల్లోని మంచు పొరలు, ఉపరితలంపై ఉన్న కొన్ని చీకటి ప్రాంతాలు కనిపించవచ్చు. అయితే అవి అంతరిక్ష చిత్రాల్లో కనిపించేంత స్పష్టంగా ఉండవు. అయినప్పటికీ కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో గ్రహం యొక్క భౌగోళిక లక్షణాలను మన కళ్లతో పరిశీలించడం గొప్ప అనుభూతి. వాస్తవానికి మంగళగ్రహ ఆపోజిషన్లు తరచూ జరుగుతాయి. అయితే ప్రతి ఆపోజిషన్ ఒకే విధంగా ఉండదు. దీని కక్ష్య పూర్తిగా వృత్తాకారంలో కాకుండా కొద్దిగా దీర్ఘవృత్తాకారంగా ఉండటం వల్ల కొన్ని సందర్భాల్లో అది భూమికి మరింత దగ్గరగా వస్తుంది.

## సమయాన్ని మనిషి మార్చగలడా?



సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్న చర్చల ప్రకారం భవిష్యత్తులో రోజుకు 25 గంటలు వస్తాయి. ఈ మాట విన్నప్పుడు, 'ఇంకో గంట దొరికితే పెండింగ్ పనులు పూర్తి చేసుకోవచ్చు, ఆలస్యంగా లేచినా ఇబ్బంది ఉండదు' అని ఎవరైనా అనుకుంటే తప్పులేదు. కానీ శాస్త్రం చెబుతున్న వాస్తవం మాత్రం కొంచెం భిన్నంగా ఉంటుంది. సెకను అనే సమయ ప్రమాణాన్ని శాస్త్రవేత్తలు మార్చితే రోజు 25 గంటలు అవుతుంది అనే వార్తపై సుమారు రెండేళ్లుగా, వాదప్రతివాదనలు జరుగుతునే ఉన్నాయి. అయితే ఇది నిజమైన శాస్త్రీయ ప్రకటన కానని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. యూరప్‌లోని 'సెర్న్' సంస్థ ప్రచురించిన 'ఏప్రిల్ ఫూల్స్' సరదా కథనంలో భాగంగా వచ్చిన ఆలోచన మాత్రమేనని తేల్చారు. ఏదిఏమైనా, సమయం కొలిచే విధానం చాలా ఖచ్చితంగా ఉండాలి. జిపిఎస్ వ్యవస్థలు, ఉపగ్రహాలు, అంతర్జాతీయ కమ్యూనికేషన్ వ్యవస్థలు సెకను స్థాయి ఖచ్చితత్వంపై ఆధారపడతాయి. అందుకే ఆధునిక ప్రపంచం అటామిక్ క్లాక్‌లను ఉపయోగిస్తుంది. ఇవి సిసియం అణువుల సహజ కంపనాలను ఆధారంగా తీసుకుని ఒక సెకను విలువను నిర్ణయిస్తాయి. ఈ పద్ధతి అత్యంత స్థిరమైనదిగా పరిగణిస్తారు. అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం ఉంది. సెకను అనేది మనిషి రూపొందించిన కొలత ప్రమాణం. దాని నిర్వచనాన్ని మార్చగలం. కానీ రోజు అనేది భూమి తన అక్షం చుట్టూ ఒకసారి తిరగడానికి పట్టే సమయం. అది ప్రకృతి నిర్ణయించే విషయం. మనం గడియారంలోని ప్రమాణాలను మార్చగలం కానీ భూమి భ్రమణాన్ని మార్చలేం. ఉదాహరణకు, ఒక సెకను వ్యవధిని కొద్దిగా మార్చితే ఒక రోజులో ఉండే సెకన్ల సంఖ్య మారుతుంది. కానీ సూర్యుడు ఉదయించి మళ్లీ ఉదయించే వరకు గడిచే అసలు సమయం మారదు. మారేది కేవలం మన గడియారం చూపించే లెక్క మాత్రమే. భూమి భ్రమణం పూర్తిగా స్థిరంగా ఉండదు. చంద్రుడి గురుత్వాకర్షణ, సముద్రపు అలలు, భూమి అంతర్భాగంలోని మార్పులు వంటి కారణాల వల్ల భ్రమణ వేగంలో స్వల్ప మార్పులు వస్తుంటాయి. అందుకే అటామిక్ టైమ్‌కు భూమి ఆధారిత సమయానికి మధ్య తేడా పెరిగినప్పుడు లీప్ సెకండ వంటి చిన్న సర్దుబాట్లు చేస్తారు. కానీ ఇవి రోజు పొడవును ఒక గంట పెంచే స్థాయిలో ఉండవు. కాబట్టి రోజు 25 గంటలు కావాలంటే మనం సెకను నిర్వచనాన్ని మార్చడం సరిపోదు. భూమి తన అక్షంపై తిరిగే వేగం గణనీయంగా తగ్గాలి. అది మానవ నియంత్రణలో లేని సహజ ప్రక్రియ.

## తోకచుక్కకూ వాసన ఉంటుందా?



ఇటీవల సామాజిక మాధ్యమాల్లో తోకచుక్క (కామెట్)కు కూడా వాసన ఉంటుందనే వాదన బలంగా వినిపిస్తున్నది. ఈ మాటలో కొంత నిజం ఉన్నప్పటికీ, దాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. రొసెట్టా అంతరిక్ష యాత్ర ద్వారా '67 పి/చుర్యుమోవ్–గెరాసిమెంకో' ధూమకేతువును పరిశీలించినప్పుడు, అందులో హైడ్రోజన్ సల్ఫైడ్ అమ్మోనియా, సల్ఫర్ డయాక్సైడ్, హైడ్రోజన్ సైనైడ్ వంటి రసాయనాలు గుర్తించారు. వీటికి వరుసగా కుళ్లిన గుడ్లు, మూత్రం, కాలుతున్న అగ్గిపుల్లలు, బాదం వంటి వాసనలను పోల్చారు. అయితే అంతరిక్షంలో గాలి ఉండదు కాబట్టి మనిషి నేరుగా ఆ వాసనను పసిగట్టలేడు. ఇది ధూమకేతువులోని రసాయనాల ఆధారంగా చేసిన శాస్త్రీయ ఊహ మాత్రమే. సుమారు దశాబ్దకాలం క్రితమే, ఈ వాసనలను అనుకరించే కృత్రిమ సువాసనలతో పోస్టుకార్డులు రూపొందించి, ప్రజల్లో శాస్త్రంపై ఆసక్తి పెంచే ప్రయత్నం చేశారు. తిరిగి అలాంటి ప్రయత్నమే ఇప్పుడు కూడా కొనసాగుతున్నది. ఏదిఏమైనా, కామెట్‌కు వాసన ఉంది అన్నదానికంటే అందులోని రసాయనాల వల్ల అలాంటి వాసన ఉండవచ్చని అంచనా అనడం సరైన వివరణ.

# పెద్దలను వదిలి పేదలకు నోటీసులా?

### సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన పెద్దలను వదిలి పేదలకు నోటీసులు ఇవ్వడం ఏమిటని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రశ్నించారు. ఎన్నెస్పి కాలువలను ఆక్రమించుకున్న అధికార పార్టీ నాయకుల వైపు కనీసం కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం పేదలను మాత్రం అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. శ్రీనివాస్ నగర్ పేదల ఇండ్లకు తొలగింపు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ శుక్రవారం సిపిఐ నాయకులు శ్రీనివాస్ నగర్‌లో పర్యటించారు. పేదల ఇండ్లకు వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ 50 ఏళ్లుగా ఈ ప్రాంతంలో పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని, గత ప్రభుత్వం జిఓ నెం.58 కింద క్రమబద్ధీకరించిందని ఆయన తెలిపారు. పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం పేదల ఇండ్లను తొలగించేందుకు ప్రయత్నిస్తుందని అదే పెద్దలు అక్రమించుకుంటే అధికారులు నివేదికలు ఇచ్చినా, న్యాయస్థానాలు తీర్పునిచ్చినా ఆ వైపు కన్నెత్తి చూడరని ఆయన ఆరోపిం చారు. పేదల ఇండ్లను తొలగిస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. త్రీటౌన్ ప్రాంతానికి కాలుష్యాన్ని కలిగిస్తున్న టింబర్ డిపోలను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని, దీనిపై అధికారులు తక్షణం స్పందించాలని సురేష్ డిమాండ్ చేశారు. టింబర్ డిపోలను తొలగించకపోతే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, సైదా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

### ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ప్రీతం డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 28,29,30 తేదీలలో హన్మకొండలో జరగబోయే ఎఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవాల పోస్టర్లను శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ ఓజా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ విద్యార్థుల హక్కులు, ప్రభుత్వ విద్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్‌ఎఫ్ అన్నారు. విద్యార్థులకు అండ.. ఎఐఎస్‌ఎఫ్ జెండా ఎల్లప్పుడూ ఉంటదని, ఈనెల 28,29,30 తేదీలలో హన్మకొండలో జరగబోయే 90 వ వార్షికోత్సవాలకు విద్యార్థి లోకం తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ గర్ల్స్ జిల్లా కన్వీనర్ గుండ్ల లక్ష్మీప్రసన్న, అభిషేక్, ఆరే జశ్వంత్, చైత్ర, సజన్,మహిన్, ఆరిఫ్, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.





# ఉద్యమాల్లో పల్లా నర్సింహారెడ్డి దంపతులు ముందుండాలి

### సుధీర్‌రెడ్డి మృతి బాధాకరం.. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది

### సంస్మరణ సభలో సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకట్‌రెడ్డి, కె.రామకృష్ణ

**ప్రజాపక్షం/దేవరకొండ :** సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, సులోచన దంపతులు కుమారుడు పల్లా సుధీర్‌రెడ్డిని కోల్పోవడం అత్యంత బాధాకరమని, ఆయన మృతి కుటుంబానికి తీరని లోటని సిపిఐ జాతీయ కార్యదర్శులు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్‌రెడ్డి, కె.రామకృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సుధీర్‌రెడ్డి కుటుంబానికి కమ్యూనిస్టు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. కుమారుడిని కోల్పోయిన దుఃఖంలో ఉన్నప్పటికీ పల్లా నర్సింహారెడ్డి, సులోచన దంపతులు ప్రజా జీవితంలో ముందుండి పార్టీ ఉద్యమాలను, పార్టీ బలోపేతాన్ని కొనసాగించాలని వారు కోరారు. శుక్రవారం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామంలోని పల్లా నర్సింహారెడ్డి నివాసంలో పల్లా సుధీర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పల్లా వెంకట్‌రెడ్డి, కె.రామకృష్ణ, కె.శ్రీనివాస్‌రెడ్డి హాజరై సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుధీర్‌రెడ్డి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే సుధీర్‌రెడ్డి మృతి చెందడం కుటుంబ సభ్యులకు, పార్టీ శ్రేణులకు తీరని లోటని అన్నారు. పల్లా నర్సింహారెడ్డి దంపతులకు ఈ విషాద సమయంలో పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, నర్సింహారెడ్డి దంపతులు ప్రజా జీవితంలో ధైర్యంగా ముందుకు సాగుతూ పార్టీ ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

### పలువురి నివాళులు

సుధీర్‌రెడ్డి సంస్మరణ సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఈటీ నర్సింహా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలనర్సింహా, కలవేణి శంకర్, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజా చారి, బచ్చనగోని గాలయ్య, తీర్పారి వెంకటేశ్వర్లు, నల్పరాజు రామలింగయ్య, తూం బుచ్చిరెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, జిల్లా కౌన్సిల్ సభ్యులు నల్పరాజు సతీష్, వలమల్ల ఆంజనేయులు తదితరులు పాల్గొని సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాళి

సంస్మరణ సభలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పాల్గొని సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పల్లా నర్సింహారెడ్డి, సులోచన దంపతులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో ఆ కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆయన ఆకాంక్షించారు.

# దళితుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలి



### సిపిఐ నేత బాల నరసింహ్మా డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో దళితుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించి అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. బాలనరసింహ్మా డిమాండ్ చేశారు. దళితుల అభివృద్ధిని సంక్షేమ పథకాలకే పరిమితం చేయకుండా భూమి, ఇల్లు, ఉపాధి అనే మూడు ప్రాథమిక హక్కుల ఆధారంగా సమగ్ర విధానం రూపొందించాలని కోరారు. శుక్రవారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత కుటుంబాలను గుర్తించి ప్రభుత్వ, మిగులు, అసైన్డ్ భూములను పంపిణీ చేయాలని కోరారు. ఇప్పటికే పట్టాలు పొందిన దళిత రైతులకు సాగునీరు, భూమి అభివృద్ధి, వ్యవసాయ పెట్టుబడులు, మార్కెట్ సదుపాయాలు కల్పించాలన్నారు. గతంలో అమలు చేసిన భూపంపిణీ పథకాలపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని సూచించారు. ఇల్లులేని దళిత కుటుంబాలకు ఇంటిస్థలం, గృహనిర్మాణానికి ఆర్థిక సహాయం, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో దళితులకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. పట్టణాల్లో అద్దె ఇళ్లలో నివసిస్తున్న పేద దళిత కుటుంబాల కోసం ప్రత్యేక గృహ విధానం రూపొందించాలన్నారు. దళిత యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు పెంచాలని, స్వయం ఉపాధికోసం తక్కువ వడ్డీ రుణాలు, సబ్సిడీలు, నైపుణ్య శిక్షణ అందించాలని బాల నరసింహ్మా కోరారు. సమావేశంలో మారుపాక అనిల్‌కుమార్, తాళ్లపల్లి లక్ష్మ ణ్, సలిగంటి శ్రీనివాస్, కె.రత్నకుమారి, వైశాశ్రీ, టి.రామకృష్ణ, కె.వెంకటస్వామి, కె.రాజరత్నం, బి.లక్ష్మి పతి పాల్గొన్నారు.

# జనగణనలో కులగణన నిర్వహించాలి

### బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో కులగణనను నిర్వహించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో పలు నిర్ణయాలను వారు వెల్లడించారు. నవంబర్ 21, 22 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు రాష్ట్ర యంత్రాంగం పూర్తి స్థాయిలో సంసిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. అక్టోబర్ 31లోగా సభ్యత్వ నమోదు పూర్తి చేసి, అనంతరం మండల, జిల్లా మహాసభలను నిర్వహించాలని సూచించారు. మహాసభల ప్రచారంలో భాగంగా అన్ని జిల్లా కేంద్రాల్లో సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకుడు కలవేణి శంకర్ సూచనల మేరకు పలు నిర్ణయాలు తీసుకున్నామని, వాటి అమలుకు అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఆఫీస్ బేరర్లు కృషి చేయాలని వెంకట్రాములు, ధనుంజయనాయుడు కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి నేదునూరి రాజమౌళి, సహాయ కార్యదర్శులు సిహెచ్.దశరథ, పల్నాటి యాదయ్య, చింతకింది కుమారస్వామి, అశోక్, ఎల్.శ్రవణ్‌కుమార్, వనం సత్యనారాయణ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



## రిజర్వాయర్ల లెవల్ నిర్వహణ సక్రమంగా చేపట్టడం లేదు

• ఎంఐఎం సభ్యులు కౌసర్ మొహియుద్దీన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తాగునీటి సరఫరా జరిగే ప్రధాన జలాశయాలు సాధారణ స్థాయి కంటే చాలా తక్కువగా ఉన్నదని ఎంఐఎం సభ్యులు కౌసర్ మొహియుద్దీన్ ఆందోళన వ్యక్తం చేశారు. శాసనసభలో 'ఎల్‌నినో ప్రభావాలపై స్వల్పకాలిక చర్చలు' అంశంపై శుక్రవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బాలాపూర్, బండ్లగూడ మహేశ్వరం, రియాసత్ నగర్ రిజర్వాయర్ల లెవల్ నిర్వహణ సక్రమంగా చేపట్టడం లేదని అన్నారు. ఉప్పుగూడ, కృష్ణా రెడ్డి, బాలాపూర్‌లో ఓవర్ ట్యాంక్‌లను నిర్మించాలని కోరారు. మలక్‌పేట, కార్వాన్, చంద్రాయణగుట్ట, నాంపల్లి, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో నూతన రిజర్వాయర్లను నిర్మించాలని కోరారు. తెలంగాణ నీటిని రాయలసీమకు తరలిస్తున్నారని, తద్వారా హైదరాబాద్‌కు నీటి సమస్యలు వస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందన్నారు.

## అన్యాక్రాంత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలి

• సిపిఐ(ఎం) డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిషేధిత జాబితా 22ఎ లోని భూములు, ధరణి అక్రమాలు, భూ కబ్జాలపై ప్రభుత్వం చేపట్టిన విచారణను రాజకీయ కక్షసాధింపులకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కెసిఆర్ ఫామ్‌హౌస్, మైహోమ్, రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన భూములతో పాటు కాంగ్రెస్, బిజెపి, బిఆర్‌ఎస్ నేతలు, కార్పొరేట్ సంస్థల ఆధీనంలో ఉన్న అక్రమ ఆస్తులపై, భూదాన్, వక్ఫ్, ఫారెస్ట్ భూములపై సమగ్ర విచారణ జరిపి, అక్రమంగా ఉన్న భూములను స్వాధీనం చేసుకుని వాటిని పేదలకు పంచాలని రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని దళిత, గిరిజన, నిరుపేదలకు సాగు భూములు, పట్టణాల్లో పేదలకు నివాస స్థలాలుగా పంపిణీ చేయాలని సూచించారు. ధరణి, భూభారతి సాంకేతిక లోపాలతో 22ఎ జాబితాలో చిక్కుకున్న నిజమైన పట్టా భూములను వెంటనే తొలగించాలని, భూదాన్, సీలింగ్ భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా భూ సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని కోరారు.

## ఏప్రిల్ నాటికి పుష్కర పనులన్నీ పూర్తి



• అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశం.. పనుల పురోగతిపై ఇంటిగ్రేటెడ్ డ్యాష్‌బోర్డ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాబోయే గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. పుష్కరాలు ప్రారంభమయ్యే నాటికి ఎలాంటి హడావుడి లేకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, వచ్చే ఏప్రిల్ నాటికే పనులన్నీ పూర్తయ్యేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. గత పుష్కరాల్లో ఎదురైన సమస్యలు, సవాళ్లు మరోసారి తలెత్తకుండా క్షేత్రస్థాయిలో ముందస్తు అధ్యయనం చేసి, భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన 'గోదావరి పుష్కరాలు–2027' కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. పుష్కరాల సన్నద్ధత, ప్రముఖ దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు, ఘాట్ల నిర్మాణం, రవాణా, మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్ల పురోగతిపై సమావేశంలో సమీక్షించారు. పుష్కర ఏర్పాట్లలో సమన్వయ లోపం లేకుండా జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. అధిక రద్దీ ఉండే టైర్1 ప్రాంతాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అదనపు ఏర్పాట్లపై ఘాట్ల వారీగా కలెక్టర్లతో క్షేత్రస్థాయి అధ్యయనం చేయించినట్లు వెల్లడించారు. పుష్కరాలు ప్రారంభమయ్యే నాటికి పూర్తయ్యే అవకాశమున్న పనులకు తొలుత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. చివరి వరకు వేచి చూడకుండా ప్రతి పనికి నిర్దిష్ట గడువు విధించుకుని, క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా పనులు ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఇంటిగ్రేటెడ్ డ్యాష్‌బోర్డ్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. పుష్కర పనుల్లో ఇంజినీర్ల కొరత తలెత్తకుండా ఆర్‌అండ్‌బీతో పాటు ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. పుష్కరాల సమయంలో వర్షాలు కురిసే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ముందుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం వద్ద సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టిపి) నిర్మాణానికి వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లకు అవసరమైన నిధులను కేటాయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పుష్కర పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని అధికారులకు శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

## జపాన్‌లో తెలంగాణ యువతకు ఉద్యోగావకాశాలు



• మంత్రి వివేక్ వెంకటస్వామి సమక్షంలో టామ్‌కామ్-పోగ్లీ మధ్య ఒప్పందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జపాన్‌లో తెలంగాణ యువతకు నైపుణ్య ఆధారిత ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) కీలక ముందడుగు వేసింది. జపాన్‌కు చెందిన పోగ్లీతో టామ్‌కామ్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. మంత్రి వివేక్ వెంకటస్వామి, శక్తి శాఖ కార్యదర్శి దాసరి హరిచందన సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. టామ్‌కామ్ ఎండి కాంతి వెస్లీ, పోగ్లీ వ్యవస్థాపకుడు, సిఇఓ డాక్టర్ కరుణ్ మల్హోత్రా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. జపాన్‌లో ఉద్యోగ అవకాశాలను గుర్తించడం, అక్కడి సంస్థలతో సంబంధాలు ఏర్పరచుకోవడం పోగ్లీ బాధ్యత కాగా, అభ్యర్థుల ఎంపిక, రిజిస్ట్రేషన్, స్క్రీనింగ్, డాక్యుమెంటేషన్, జపనీస్ భాష, ప్రీడిపార్చర్ శిక్షణను టామ్‌కామ్ నిర్వహించనుంది. తొలి ఏడాదిలో 400 నుంచి 500 మంది తెలంగాణ యువతకు జపాన్‌లో ఉద్యోగాలు కల్పించేలా రెండు సంస్థలు పనిచేయనున్నాయి. తొలుత జపాన్‌లోని కన్సాయ్ ప్రాంతంపై దృష్టి సారించి, అనంతరం ఇతర ప్రాంతాలకు విస్తరించనున్నారు. ట్రేడ్ నైపుణ్యాలతో పాటు జపనీస్ భాష, పని సంస్కృతి, జీవన విధానంపై యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. విదేశాల్లో యువతకు సురక్షితమైన, పారదర్శకమైన, దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. జపాన్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యం కలిగిన తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా టామ్‌కామ్ చర్యలు కొనసాగిస్తుందని చెప్పారు.

# 'ప్రజా సమస్యల చర్చ' సమాంతరంగా 'రాజకీయ పోరాటం'

• ఎనిమిది రోజులు.. ఆందోళనలు, సస్పెన్షన్లు, కీలక బిల్లులు!

• తొలిరోజే రణరంగం.. ప్రజా సమస్యల కంటే రాజకీయ ఘర్షణలే ఎక్కువ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా సమస్యలపై విస్తృత చర్చలకు వేదిక కావాల్సిన తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు రాజకీయ ఉద్రిక్తతలు, ప్రతిపక్షాల నిరసనలు, సభ్యుల సస్పెన్షన్లు, సభాపతిపై వ్యాఖ్యల వివాదం మధ్య కొనసాగాయి. తెలంగాణ రాజకీయాల్లో మరోసారి అధికార, ప్రతిపక్ష పోరును ఈ సమావేశాలు మరింతగా బహిర్గతం చేశాయి. సెప్టెంబర్ 7వ తేదీన ప్రారంభమైన అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు 18వ తేదీ వరకు 8 రోజుల పాటు కొనసాగాయి. రిజిస్ట్రేషన్ చట్టంలోని 22ఎ నిషేధిత భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్, సాగునీరు, విద్య, బిసి జనగణన, ఎల్‌నినో ప్రభావం హైదరాబాద్ పట్టణ పాలన వంటి ప్రజా సమస్యలపై సభలో చర్చ జరిగింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు, విద్య, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, సాగునీరు, విద్యుత్, రైతుల సమస్యలు, భూవివాదాలు తదితర అంశాలు కూడా సభలో ప్రస్తావనకు వచ్చాయి. కాగా సమావేశాలు ప్రారంభమైన తొలి మూడు రోజుల్లో నిరసనలు, సభాపతిపై వ్యాఖ్యల వివాదం, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్, రాజకీయ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా విమర్శలకు దారితీసిన 22ఎ నిషేధిత భూముల అంశంపై సభలో రెండు రోజు ల పాటు చర్చ జరగగా చర్చ మొదటి రోజు రెవెన్యూ శాఖ మంత్రి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా వివరణ ఇవ్వడం గమనార్హం. అదేస్థాయిలో ఈ అంశంపై చర్చ ముగింపు సందర్భంగా రెండో రోజు సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా 22ఎ నిషేధిత భూముల గురించి సుదీర్ఘంగా 3 గంటల పాటు మాట్లాడడం ఈ సమావేశాలలో విశేషంగా చెప్పవచ్చు. కాగా హైదరాబాద్ నగర పాలనను సమూలంగా మార్చే కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) బిల్లు2026, ట్రాన్స్‌జెండర్లకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించే తెలంగాణ మున్సిపాలిటీస్ (నాలుగో సవరణ) బిల్లు2026, నిబంధనల సరళీకరణకు ఉద్దేశించిన తెలంగాణ ప్రజా విశ్వాసం (సవరణల నిబంధనలు) బిల్లు2026, గ్రామపంచాయతీల సోంత ఆదాయ వినియోగానికి మార్గం సుగమం చేసే పంచాయతీరాజ్ సవరణ బిల్లులను సభ ఆమోదించింది. శాసనసభ సమావేశాల చివరి రోజులకు చేరుకునే కొద్దీ బిఆర్‌ఎస్ సభ్యుల సస్పెన్షన్ రాజకీయ చర్చకు కేంద్రం గా మారింది.



సభలో తమ సభ్యులకు మాట్లాడే అవకాశం లేకుండా చేశారని బిఆర్‌ఎస్ ఆరోపించగా, సభా కార్యక్రమాలను అడ్డుకున్నందుకే చర్య తీసుకున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొత్తంగా తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాలలో 'ప్రజా సమస్యల చర్చ'తో పాటు 'రాజకీయ పోరాటం' కూడా సమాంతరంగా కొనసాగినట్లు కనిపించింది. వివరాల్లోకి వెళితే...

**తొలిరోజే రణరంగం**

ఈ నెల 7న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన కొద్దిసేపటికే బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వెళ్లేందుకు ప్రయత్నించడం, పోలీసులు వారిని అడ్డుకోవడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కెటిఆర్, హరీశ్‌రావు తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బిఆర్‌ఎస్ దీనిని రాజకీయ ప్రతీకార చర్యగా అభివర్ణించగా, ప్రతిపక్ష సభ్యులు సభా మర్యాదలు, భద్రతా నిబంధనలను ఉల్లంఘించినందునే నినాదాలతో కూడిన టీషర్టులు ధరించిన సభ్యులను సభలోకి అనుమతించలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**సభాపతి వివాదం.. భావోద్వేగానికి గురైన గడ్డం ప్రసాద్**

తొలిరోజు అసెంబ్లీ బయట జరిగిన నిరసనల ప్రభావం రెండో రోజు సభలోనూ కనిపించింది. సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, నవీన్ కుమార్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదానికి కారణమయ్యాయి. సభాపతి స్వయంగా ఈ ఘటనపై భావోద్వేగానికి గురయ్యారు. దీనిపై అధికార పక్షం తీవ్రంగా స్పందించగా.. బిఆర్‌ఎస్ మాత్రం ఆరోపణలను ఖండించింది. అనంతరం శాసనసభ ఈ వ్యవహారంపై తీర్మానం ఆమోదించి సభ్యులపై చర్య కోసం శాసనమండలికి పంపింది. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఇద్దరు ఎమ్మెల్సీలను సమావేశాల మిగతా కాలానికి సస్పెండ్ చేశారు.

**మూడో రోజు.. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్**

సెప్టెంబర్ 9న బిఆర్‌ఎస్ సభ్యులు తమ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు వ్యవహరించిన తీరుపై చర్చకు పట్టుబట్టారు. కెటిఆర్ వాయిదా తీర్మానం ఇవ్వడంతో పాటు రాష్ట్రంలో శాంతిభద్రతలు, పార్టీ అధినేత కెసిఆర్‌కు వచ్చినట్లు పేర్కొన్న బెదిరింపులు, అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేలతో జరిగిన వ్యవహారంపై చర్చించాలని డిమాండ్ చేశారు. నినాదాలు, ప్లకార్డులతో సభా కార్యక్రమాలను అడ్డుకోవడంతో శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు సస్పెన్షన్ తీర్మానం ప్రవేశపెట్టగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సభ అభిప్రాయం మేరకు బిఆర్‌ఎస్ డిప్యూటీ లీడర్ టి.హరీష్ రావు, కెటిఆర్‌తో సహా 21 మంది బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను మిగిలిన వర్షాకాల



సమావేశాల నుంచి సస్పెండ్ చేశారు. దీంతో సమావేశాల్లో అధికార కాంగ్రెస్, బిఆర్‌ఎస్ మధ్య ప్రత్యక్ష ఘర్షణ మరింత ముదిరింది. ప్రతిపక్షం తమ గొంతు నొక్కేందుకే సస్పెన్షన్లు విధించారని బిఆర్‌ఎస్ ఆరోపించింది.

**22ఎ భూములపై బిజెపి ఉడుంపట్టు**

22ఎ నిషేధిత భూముల అంశం సభలో రగడకు దారితీసింది. నిషేధిత జాబితాలోకి ప్రైవేటు భూములు, ఆస్తులు చేరడంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని బిజెపి సభ్యులు డిమాండ్ చేశారు. ప్లకార్డులతో సభా బావిలోకి వచ్చిన బిజెపి ఎమ్మెల్యేల నిరసనతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం కూడా ప్రారంభం కాకముందే సభను స్పీకర్ వాయిదా వేయాల్సి వచ్చింది. 22ఎ అంశంపై స్వల్పకాలిక చర్చకు సిద్ధమని ప్రభుత్వం ప్రకటించగా, సమావేశాల చివరి రెండు రోజుల్లో ఈ అంశంపై సభలో సుదీర్ఘంగా చర్చ జరిగింది.

**సాగునీరు, వ్యవసాయం, ఎల్‌నినో ప్రభావంపై చర్చ... తీర్మానం ఆమోదం**

రాష్ట్రంలో నెలకొన్న వర్షభావ పరిస్థితుల నుంచి ఉపశమన చర్యలు, అధిగమించే చర్యలకు తక్షణమే తగినంత సహాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాలను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అంతకు ముందు సభలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం, సాగునీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటలపై చర్చ జరిగింది. సాగునీటి ప్రాజెక్టులు, నీటి వినియోగం, కృష్ణాగోదావరి జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ వంటి అంశాలను అధికార, ప్రతిపక్ష సభ్యులు తమ తమ కోణాల్లో ప్రస్తావించారు. ప్రభుత్వం ఒకవైపు నీటి కొరత పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని సూచించగా అందుబాటులో ఉన్న నీటిని పూర్తిగా వినియోగించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ప్రతిపక్షాలు విమర్శించాయి.

### 8 రోజులు, 51.52 గంటల పాటు జరిగిన సభ

• నాలుగు బిల్లులు, మూడు ప్రభుత్వ తీర్మానాలకు సభ ఆమోదం

• అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు నిరవధిక వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభను శుక్రవారం నిరవధికంగా వాయిదా వేశారు. ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన శాసనసభ సమావేశాలు 18వ తేదీ వరకు మొత్తం 8 రోజులు, 51.52 గంటల పాటు సమావేశాలు జరిగినట్లు స్పీకర్ ప్రకటించారు. నాలుగు బిల్లులు, మూడు ప్రభుత్వ తీర్మానాలను సభ ఆమోదించింది. వివిధ అంశాలపై మంత్రులు 2 ప్రకటనలు చేశారు. పలు అంశాలపై నాలుగు స్వల్పకాలిక చర్చలు జరిగాయి. ఈ సమావేశాలలో మౌఖికంగా సమాధానాలు ఇచ్చిన ప్రశ్నలు 50 కాగా, సభలో సభ్యులు 86 అనుబంధ ప్రశ్నలు వేశారు. సభ్యులు మొత్తం 105 ప్రసంగాలు చేశారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసే సెప్టెంబరు 18వ తేదీ నాటికి సభలో మొత్తం 119 మంది సభ్యులకు గాను కాంగ్రెస్‌కు 66 మంది, బిఆర్‌ఎస్ 37మంది, బిజెపి 8 మంది, ఎఐఎంఐఎంకు 7 మంది, సిపిఐకి ఒక సభ్యుడు ఉన్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

## మిల్లర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కీలక అడుగు

• ఘర్షణకు బదులు చర్చలే మార్గం..

• నాలుగైదు రోజుల్లో మరోసారి సమావేశం

• పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కసరత్తు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైస్ మిల్లర్ల సమస్యలకు సామరస్యపూర్వక పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలకంగా ముందడుగు వేసింది. మిల్లర్ల ప్రతినిధులతో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో సమావేశమయ్యారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన చర్చల్లో మిల్లర్ల సమస్యలు, పెనాల్టీలు, టెండర్ ధరలు, స్టాక్ వ్యత్యాసాలు, పెండింగ్ సరఫరాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. మిల్లర్లను ప్రభుత్వం ప్రత్యర్థులుగా చూడటం లేదు.. ధాన్యం కొనుగోలు వ్యవస్థలో వారిని భాగస్వాములుగానే చూస్తోంది అని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. మిల్లర్ల ఆర్థిక ఇబ్బందులను గౌరవిస్తూనే రైతుల ప్రయోజనాలు, ప్రజాధనం పరిరక్షణ, మిల్లింగ్ రంగం స్థిరత్వం మధ్య సమతుల్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మిల్లర్లు చేసిన వినతులను సానుకూల దృక్పథంతో పరిశీలించి సాధ్యమైన పరిష్కారం చూపుతామని తెలిపారు. మిల్లర్లపై అనవసరమైన ఆర్థిక భారం మోపాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఉత్తమ్ పేర్కొన్నారు. అదే సమయంలో రైతులకు చెల్లించిన మద్దతు ధర, ప్రభుత్వం తీసుకున్న రుణాలపై భరిస్తున్న వడ్డీ భారాన్ని విస్మరించడం సాధ్యం కాదన్నారు. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొచ్చి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అందువల్ల ప్రభుత్వానికి జరిగిన వాస్తవ వ్యయం కంటే తక్కువకు టెండర్ ధాన్యం ధర నిర్ణయించడం సాధ్యం కాదని వివరించారు. ప్రజాధనాన్ని తిరిగి రాబట్టుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని, మిల్లర్లపై అదనపు భారం వేయడం కాదని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం విధించిన పెనాల్టీల పేరుతో మిల్లర్ల సమస్యలను పక్కన పెట్టబోమన్నారు. పెనాల్టీలు, టెండర్ ధరలు, స్టాక్ వ్యత్యాసాలు, పెండింగ్ సరఫరాలపై సమగ్రంగా పరిశీలన జరుపుతామని తెలిపారు. ఏడాది, రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ధాన్యం సరఫరాల కారణంగా పౌరసరఫరాల సంస్థపై వడ్డీ భారం పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మిల్లర్లకు, ప్రభుత్వానికి ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు అధికారులు కసరత్తు చేయనున్నట్లు తెలిపారు.

మిల్లర్ల సమస్యలపై ప్రభుత్వ చిత్తశుద్ధిని గుర్తించి ప్రస్తుతం కొనసాగుతున్న సమ్మెను విరమించాలని ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అయితే మిల్లర్ల వినతులను పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు నాలుగైదు రోజుల గడువు ఇవ్వాలని కోరారు. ఈ వ్యవధిలో కమిషనర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వ్యయం, నిబంధనలు, ఆర్థిక ప్రభావం, సాధ్యమైన పరిష్కార మార్గాలపై అధికారులు సమగ్రంగా అధ్యయనం చేయనున్నారు. నాలుగైదు రోజుల్లో మిల్లర్ల ప్రతినిధులతో మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఏకపక్ష నిర్ణయాలకు తావులేకుండా పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సాధించడమే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఘర్షణకు బదులుగా చర్చల ద్వారానే సమస్యకు ముగింపు పలకాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. రైతు సంక్షేమం, ప్రజాధనం పరిరక్షణ, మిల్లింగ్ రంగం ప్రయోజనాల మధ్య సమతుల్యత సాధించే విధంగా పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## ఫిరాయింపులకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు

• కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎన్.వి.సుభాష్, రామచంద్రారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం సాధించిన మహత్తర విజయమని బిజెపి నాయకులు అభివర్ణించారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి రాజీనామా చేయకుండానే అధికార కాంగ్రెస్‌లో చేరి పోటీ చేయడం ప్రజాభీష్టానికి తీవ్ర వ్యతిరేకమని, ఈ తీర్పు ఫిరాయింపు రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలకు సరైన చెంపపెట్టు అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపిగా పోటీ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. గతంలో బిఆర్‌ఎస్ చేసిన తప్పులనే నేడు కాంగ్రెస్ పునరావృతం చేస్తోందని, ఫిరాయింపుదారులను చేర్చుకుంటూ ప్రజా తీర్పును కాలరాస్తున్నాయని విమర్శించారు. తమ పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి జరిపిన రాజీలేని న్యాయపోరాటం వల్లే స్పీకర్ ట్రిబ్యునల్ నిర్ణయాన్ని పక్కనబెట్టి న్యాయస్థానం దానంపై అనర్హత వేటు వేసిందని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ రెండు పార్టీలకు ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీ, తమ ప్రభుత్వమే ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కాలరాస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధంగా, నైతికంగా కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టు ముందు ఘోరంగా ఓడిపోయిందన్నారు.

## భుదాన్ భూములు రక్షించడంలో ప్రభుత్వాలు విఫలం



• తక్షణమే భూదాన్ యజ్ఞ బోర్డు ఏర్పాటు చేయాలి

• మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూమిలేని నిరుపేదలకు చెందవలసిన భుదాన్ భూములను రక్షించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్‌పాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూదాన్ భూములను గుర్తించి తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డును ఏర్పాటు చేసి, భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర సర్వసభ్య సమావేశ హైదరాబాద్ నాంపల్లి గాంధీభవన్ ప్రాంగణంలోని మండలి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగింది. సమావేశానికి మండలి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.శంకర్ నాయక్ అధ్యక్షత వహించారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల తెలంగాణ రాష్ట్రంలో కోట్లాది రూపాయల విలువైన వేలాది ఎకరాల భూదాన్ భూములు అన్యాక్రాంతమయ్యాయని అజీజ్‌పాషా ఆవేదన వ్యక్తం చేసారు. భూమిలేని పేదలకు పంపిణీ చేయడానికి ఆనాడు స్వాతంత్ర సమరయోధులు ఆచార్య వినోబా భావే తెలంగాణలో దాదాపు రెండు లక్షల ఎకరాలు భూస్వాముల నుండి సేకరించి, భూదాన్ యజ్ఞ బోర్డు ఏర్పాటు చేసి పేదలకు పంచాలని అప్పటి ప్రభుత్వానికి అప్పగించగా, కొంత పంపిణీ చేయగా మిగిలిన వేలాది ఎకరాల భూమి ప్రభుత్వాల ఉదాసీనతతో భూదాన భూములను భూకబ్జాదారులు ఆక్రమించుకుని సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. శంకర్ నాయక్ మాట్లాడుతూ భూదాన్ భూముల ఆక్రమణదారులపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, ఆక్రమణకు గురైన భూదాన భూములను స్వాధీనం చేసుకోవాలని, మిగిలి ఉన్న భూదాన భూములను పేదలకు పంచాలని కోరారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సర్వోదయ మండలి కార్యదర్శి వై.గిరిప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఖాదర్ బేగ్, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు యాదమ్మ, యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన చందా శ్రీనివాస్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సమావేశం ఎన్నుకున్నది.

## ఎల్ నినోను ఎదుర్కునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ రూపకల్పన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాయత్తం అవుతున్నాయి. ఎల్‌నినో ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై అధికంగా ఉండడంతో రానున్న రబీ సీజన్‌లో రైతులు ఇబ్బందులు పడ్డకుండా ఉండేందుకు గాను సమగ్ర కార్యచరణను రూపొందిస్తున్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం హైదరాబాద్‌లోని ఓహోటల్‌లో జరిగిన సదరన్ జోనల్ అగ్రికల్చర్ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్ర సహాయ మంత్రి భగీరథ్ చౌదరి పాల్గొన్నారు. వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ, అండమాన్ నికోబార్, పుదుచ్చేరి, లక్షద్వీప్ రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు , శాస్త్రవేతలు, శాస్త్రవేత్తలు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సులో ప్రధానంగా దేశంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, రైతుల రిజిస్ట్రేషన్, ఎరువుల పంపిణీ, డిజిటల్ః వ్యవసాయ, నేషనల్ మిణ్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్, ఆత్మనిర్భరత మిషన్, దక్షిణాది రాష్ట్రాలలో ప్రకృతి వ్యవసాయం పురోగతి, సమీకృత వ్యవసాయ విధానాలు, నకిలీ ఎరువులు, విత్తనాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అదేవిధంగా రాష్ట్రాలు విజయవంతంగా అమలు చేస్తున్న వివిధ విన్నూత కార్యక్రమాలు తదితరపై చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం రైతు నేస్తంకు సంబంధించి రైతు కేంద్రంగా పని చేసే వ్యయసాయ విస్తరణ వ్యవస్థను వివరించింది. ఆంధ్రప్రదేశ్ వాతావరణ మార్పులు, కర్నాటక పప్పు ధాన్యాల మెరుగైన ఉత్పత్తి పద్దతులు, కేరళ వ్యవసాయం ఉత్పత్తుల సేకరణ, మార్కెటింగ్, తమిళనాడు ప్రెసిషన్ ఫార్మింగ్, హైటెక్ వ్యవసాయం అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించాయి. పలు పథకాల్లో దేశంలోనే తెలంగాణ ప్రథమస్థానంలో ఉందన్న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రైతు నేస్తం సేవలను ప్రశంసించారు. రైతులకు నిపుణుల సలహాలను నేరుగా చేరవేస్తున్న ఈ కార్యక్రమం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. రైతు నేస్తం 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రూపొందించిన కాఫీ బుక్‌ను కేంద్ర మంత్రి ఆవిష్కరించారు.

**రైతు సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ మోడల్ : మంత్రి తుమ్మల నాగేశ్వరావు**

రైతు సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సదస్సుకు వివరించారు. రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా, రైతు నేస్తం వంటి కార్యక్రమాల్లో తెలంగాణ అనుసరిస్తున్న విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ సేల్ ఫ్రేమ్‌వర్క్ (ఎఫ్ఎఫ్ఎస్)ను రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తుమ్మల తెలిపారు. యూరియా యాప్ ద్వారా సాధించిన పారదర్శకతను ఎఫ్ఎఫ్ఎస్‌లోనూ కొనసాగిస్తామని చెప్పారు. రైతు భరోసా కింద ఎకరాకు ఏటా రూ.12 వేల చొప్పున అందిస్తున్నామని, ఇప్పటివరకు రూ.35,839 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి వెల్లడించారు. 2026 వానాకాలంలో తొమ్మిది రోజుల్లోనే 70.40 లక్షల పట్టాదారులకు రూ.8,759 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. గత మూడేళ్లలో రైతు బీమా ప్రీమియంగా రూ.3,531 కోట్లు చెల్లించామని, 42 లక్షలకు పైగా రైతులకు బీమా సౌకర్యం కల్పించామని వివరించారు. ఎంఎస్‌పీ కంటే మార్కెట్ ధరలు పడిపోయినప్పుడు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా కొనుగోళ్లు చేపడుతోందని మంత్రి తెలిపారు. మొక్కజొన్నకు సుమారు రూ.6 వేల కోట్లు, జొన్నకు రూ.1,100 కోట్లకు పైగా విలువైన కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఎంఎస్‌పీ అమలులో కేంద్రం, రాష్ట్రాలు కలిసి బాధ్యత వహించాలని కోరారు. తాజా ఆయిల్‌పామ్ గెలలకు (ఎఫ్ఎఫ్‌బీ) టన్నుకు రూ.25 వేల కనీస గ్యారంటీ ధర ప్రకటించాలని కేంద్రాన్ని కోరారు. రైతు సంక్షేమానికి ఉపయోగపడే విధానాలను రాష్ట్రాలు పరస్పరం పంచుకోవాలని తుమ్మల పిలుపునిచ్చారు.

# రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆధునిక సదుపాయాలతో ఇండోర్ వాలీబాల్ కోర్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వేలో క్రీడా కార్యకలాపాలను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆధునిక సదుపాయాలతో నిర్మించనున్న ఇండోర్ వాలీబాల్ కోర్టు, అత్యాధునిక జిమ్ నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శుక్రవారం శంకుస్థాపన చేశారు.

రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాశ్, ఐజి కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్, ఎస్సీఆర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు అరోమా సింగ్ ఠాకూర్, ఫైనాన్షియల్ అడ్వైజర్ కమ్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ (స్టాఫ్ వెల్ఫేర్ సర్వీసెస్), ఎస్‌సిఆర్‌ఎస్‌ఏ జనరల్ సెక్రటరీ పి.కోటేశ్వరరావు, వివిధ శాఖల ప్రిన్సిపల్ హెడ్‌లు, హైదరాబాద్ డివిజన్ డిఆర్‌ఎం, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కొత్తగా నిర్మించనున్న ఇండోర్ వాలీబాల్ కోర్టు 18 మీటర్ల పొడవు, 9 మీటర్ల వెడల్పుతో ఉండనుంది. క్రీడాకారుల భద్రత, మెరుగైన ఆట తీరుకు అనువుగా నాన్‌స్లిప్ మ్యాట్ ఫ్లోరింగ్, ప్రేక్షకుల కోసం సీటింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో రైల్వే క్రీడాకారులకు సాధారణ శిక్షణతో పాటు కోచింగ్, పోటీలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి మ్యాచ్‌ల నిర్వహణకు అనువైన వేదిక అందుబాటులోకి రానుంది. అదేవిధంగా నిర్మించనున్న ఆధునిక జిమ్‌లో ఒలింపిక్ ట్రైనింగ్ జోన్, పర్సనల్ ట్రైనింగ్ ఏరియా, ఫిజియోథెరపీ–రికవరీ లాంజ్, గ్రాండ్ ఎంట్రీ లాబీ, కార్డియో జోన్, వెయిట్ జోన్, ఫంక్షనల్ ట్రైనింగ్ ఏరియా వంటి సదుపాయాలు కల్పించనున్నారు.

ఈ సందర్భంగా జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో దక్షిణ మధ్య రైల్వే క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. క్రీడా కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగులు ఆరోగ్యకరమైన, చురుకైన జీవనశైలిని కొనసాగించేలా ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. కొత్త ఇండోర్ వాలీబాల్ కోర్టు క్రీడాకారులకు మెరుగైన శిక్షణ వేదికగా, ఆధునిక జిమ్ బలం, ఫిట్‌నెస్, ఫిజియోథెరపీ, రికవరీ అవసరాలను తీర్చే కేంద్రంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేయాలి : పోరాట కమిటీ డిమాండ్

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** కీసర సర్కిల్, జవహర్‌నగర్ జిహెచ్‌ఎంసీ పరిధిలోని కార్మికనగర్‌లో డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దట్టమైన పొగలు, మురికి నీటి నురుగు బుడగల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమా మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలకు శ్వాసకోశ, కంటి చూపు సమస్యలు తలెత్తుతున్నాయని, గతంలో మురుగు నీటి పైప్‌లైన్ ధ్వంసం చేసి ప్రజలపైకి వదిలారని వారు గుర్తుచేశారు. యార్డు విస్తరణ కోసం రాంకీ యాజమాన్యం ప్రజలను ఇక్కడి నుండి పంపించేందుకు ఇటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని వారు ఆరోపించారు. వెంటనే రాంకీ యాజమాన్యం తన వైఖరి మార్చుకొని పర్యావరణ పరిరక్షణతో పాటు తాగునీరు, ఆరోగ్య భద్రత కల్పించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజా ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.



# ఘనంగా భారతీయ కిసాన్ సంఘ్ దినోత్సవం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట డివిజన్ బాబాగూడలో భారతీయ కిసాన్ సంఘ్ దినోత్సవం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దినోత్సవ వేడుకల్లో భాగంగా భారతీయ కిసాన్ సంఘ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయ కిసాన్ సంఘ్ భగవాన్ బలరాంను అధిష్టాన దైవంగా స్వీకరించిందని వారు స్వయంగా నాగలిని ఆయుధంగా ధరించి గో ఆధారిత వ్యవసాయం ద్వారా పౌష్టికాహారాన్ని అందించి చక్కటి పౌరులను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. దేశాన్ని కుటుంబంగా భావించి ప్రధాన రంగమైన వ్యవసాయాన్ని చేస్తు జీవనం సాగిస్తున్న రైతాంగాన్ని ఏకంచేసి వారిలో ఐకమత్యం సంఘటనా శక్తిని నిర్మాణం చేసి తద్వారా మన సమస్యలను మనమే తీర్చుకోవాలని 'హర్ ఏక్ కిసాన్ హమారా నేత హై' అనే పద్ధతిలో సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బౌరంపేట మల్లారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, సీనియర్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




# స్వచ్ఛ భారత్‌లో భాగంగా స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** స్వచ్ఛ భారత్‌లో భాగంగా 'స్వచ్ఛతా హి సేవ' అనే నినాదంతో 17 సెప్టెంబర్ నుండి 17 అక్టోబర్ తేదీ వరకు స్కూళ్లు, కాలనీలలో విద్యార్థులు, ప్రజలతో కార్యక్రమం నిర్వహించనున్నారు. శుక్రవారం కుషాయిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కమలానగర్ మాస్టర్ మైండ్ స్కూల్‌లో విద్యార్థుల నుద్దేశించి కాప్రా సర్కిల్ డిసి రవీంద్రసాగర్ మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటిలోనే నాలుగు విధాలుగా డ్రైవేస్ట్, సానిటరీ వేస్ట్, హజార్డర్స్ వేస్ట్ అని విడదీసి చెత్తను మున్సిపల్ ఆటోలో మాత్రమే అందించాలన్నారు. చెత్తను వేరు చేయకపోవడం వల్ల కలిగే అనర్థాలను, వేరు వలన వచ్చే ఉపయోగాలను విద్యార్థులకు తెలియజేశారు. చెత్తను రీసైక్లింగ్ రెడ్యూస్ అనే విధానం ద్వారా వస్తువులను పొడి చెత్తను తిరిగి ఉపయోగించుకొని ఎరువుగా మార్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మి నారాయణ, మాస్టర్ మైండ్స్ ప్రిన్సిపల్ లత, తదితరులు పాల్గొన్నారు.

# ఎఐ హ్యాకథాన్‌లో టెక్ జోరు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** కృతిమ మేధస్సుతో వాస్తవ సమస్యలకు పరిష్కారాలే లక్ష్యంగా అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన అవిన్యా2కె26 జాతీయస్థాయి సాంకేతిక కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఎఐఎంఎల్ విభాగం ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ హ్యాక్‌స్పేస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో దేశవ్యాప్తంగా 450 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఐఐటి మద్రాస్, ఎన్‌ఐటిలు, బిట్స్‌పిలానీ జెఎన్‌టియుహెచ్ విద్యార్థులు పోటీపడ్డారు. తొలిరోజు ఆర్‌సిఐ డిఆర్‌డిఓ శాస్త్రవేత్త డి.శ్రావణ్ కుమార్ ప్రాంభించగా జనార్ధనాచారి వినుకొండ డా.వి.విజయ్ కుమార్, డా.సిద్ధార్థ్ ఘోష్, డా.ఎ. మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు. హ్యాకథాన్‌లో ఏఐ ఏజెంట్లు వైద్యరంగ ఏఐ, నైతిక ఏఐ ఉత్పాదక అంశాలపై విద్యార్థులు ప్రాజెక్టులు రూపొందించారు. రెండో రోజు బోస్టన్ సైంటిఫిక్, కాగ్నిజెంట్ ఎన్‌విడియా, యాక్సెంచర్ తదితర సంస్థలకు చెందిన న్యాయనిర్ణేతల ముందు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎంఎల్ ల్యాబ్ వ్యవస్థాపకురాలు ప్రథిక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాలుగు విభాగాల్లో విజేతలకు 12 నగదు బహుమతులు అందించారు.



# భిక్షపతి రెడ్డి అంత్యక్రియలకు పలువురు హాజరు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పోచారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి తండ్రి సింగిరెడ్డి బిక్షపతి రెడ్డి మృతి చెందడంతో కాంగ్రెస్ నాయకులు అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. గత రాత్రి బిక్షపతి రెడ్డి మృతి చెందగా శుక్రవారం జరిగిన అంత్యక్రియలకు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఇటీక్యాల కృష్ణారెడ్డి, పోచారం డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్, ఘట్‌కేసర్ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బద్దం నర్సింహారెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కవాడి మాధవ్‌రెడ్డి, కొమురవెల్లి దేవస్థానం ధర్మకర్త మెరుగు నరేష్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్ చిల్కూరి మచ్చేందర్ రెడ్డి, తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వారాహి బాయ్స్ హాస్టల్‌లో విద్యార్థి మృతి

**ప్రజాపక్షం/దుండిగల్ :** ప్రైవేట్ హాస్ట ల్లో విద్యార్థి మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహుదూర్ పల్లి వారాహి బాయ్స్ హాస్టల్‌లో విద్యార్థి సాయిచరణ్(20) బీటెక్ థర్డ్ ఇయర్ మల్లారెడ్డి యూనివర్సిటీ మైసమ్మగూడలో చదువుకుంటున్నాడనీ మృతుడు గత మూడు సంవత్సరాలుగా వారాహి హాస్ట ల్లో ఉంటున్నాడనీ ఈ వ్యక్తి



ఫ్రెండ్స్ నిన్న రాత్రి 8 గంటలకు సినిమాకు వెళ్లగా ఇతను ఒక్కడే రూమ్‌లో ఉన్నాడనీ, సినిమా నుంచి వచ్చిన తర్వాత ఒంటిగంటకు వ్యక్తి ఫ్రెండ్స్ డోర్ కొట్టినా తీయకపోవడంతో పడుకొని ఉంటాడేమో అని అందరూ నిద్ర పోయారు. ఉదయం 8 గంటలకు డోర్ ఎంత కొట్టిన తీయకపోవడంతో డోర్ లోపల ఓపెన్ చేసి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని చనిపోయి ఉన్నాడనీ మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదుపైన కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# క్రమశిక్షణతో కూడిన విద్యనందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

## బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుతూ, క్రమశిక్షణతో కూడిన విద్యనందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. తెలంగాణ గుర్తింపు పొందిన అఫిడబుల్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (టాపసా) గ్రేటర్ కుత్బుల్లాపూర్ ఆధ్వర్యంలో గురుసన్మాన్ పురస్కార్–2026 కార్యక్రమాన్ని గాజులరామారంలోని పద్మావతి కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద విచ్చేసి 150 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ శిష్యుడి విజయమే గురువుకు అతిపెద్ద గౌరవమని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన ఉపాధ్యాయులపై విద్యార్థులను సన్మార్గంలో తీర్చిదిద్దే బాధ్యత నేటి నుండి రెట్టింపు అయిందని చెప్పారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తూ ఉత్తమ బాటలో పయనించేలా తీర్చిదిద్దాలని, అందుకోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, ఆంజనేయులు, ట్రస్మా గ్రేటర్ కుత్బుల్లాపూర్ చైర్మన్ కోలా వెంకటేష్ ముదిరాజ్, అధ్యక్షులు వినోద్ జాదవ్, ప్రధాన కార్యదర్శి దయాకర్, కోశాధికారి శ్రీశైలం, ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, గడ్డమీది బాలరాజ్, నాయకులు విజయరాంరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన రేషన్ కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం/పరిగి:** మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం పరిగి తహసీల్దార్ వెంకటేశ్వరి స్థానిక నాయకులతో కలిసి నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం సర్ నోటీసులకు సరైన పత్రాలు తీసుకొని ఓటర్ నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకటరాములు, సర్పంచ్ బాలరాజ్, శ్రీనివాస్ రెడ్డి, రామచంద్రరెడ్డి,తదితరులు పాల్గొన్నా రు.

# గుర్తు తెలియని శవం లభ్యం

**ప్రజాపక్షం / ధారూర్ :** వికారాబాద్ జిల్లా ధారూర్ మండలంలోని ఎబ్బనూర్ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్ఐ రాఘవేందర్ తెలిపారు. శుక్రవారం ఎబ్బనూర్ గ్రామానికి చెందిన మేకల కాపరులు అటవీప్రాంతంలో మేకలను మేపుతుండగా దుర్వాసన రావటంతో దగ్గర పొదల్లోకి వెళ్లిచూడగా తల లేని శవం ఉన్నట్లు గుర్తించి గ్రామస్తులకు, ధారూర్ పోలీసులకు సమాచారమిచ్చారు.

సంఘటన స్థలానికి వికారాబాద్ డిఎస్‌పి అంజయ్య, ధారూర్ సిఐ రఘురాములు, స్థానిక ఎస్ఐ వెళ్లి చుట్టు పక్కల పరిశీలించగా కొంత దూరం లో పుర్రె, ఎముకలు ఉన్నాయి. మృతి చెందిన వ్యక్తి బ్లూ కలర్ టీ షర్ట్, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తిని హత్య చేసి నిర్మానుష్య ప్రదేశంలో పడేసి ఉంటారనే అనుమానా లు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



# కేరళ సాంప్రదాయ దుస్తులతో వినాయక నిమజ్జనం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీలో విజయలక్ష్మి టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని నిమజ్జన కార్యక్రమం లో కేరళ సాంప్రదాయ పద్ధతిలో 200 మంది మహిళలు వస్త్రాలను ధరించి మంగళ హారతులతో బాజా భజంత్రీలతో ఊరేగింపుగా కాప్రా చెరువులో వినాయకుని నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ వెంకన్నలు ప్రత్యేక పూజలు చేశారు. గణేష్ ఉత్సవ సమితి కో కన్వీనర్ రేగళ్ల సతీష్‌రెడ్డి నిర్వాహకులు మమతా సురేష్‌ను శాలువాతో సత్కరించారు. ఇందులో ధరణి హాస్పిటల్ అధినేత శ్రీలక్ష్మి, శ్రీకర్ దేవరం, శైలజ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# గణనాథులను దర్శించుకున్న మహిపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట డివిజన్‌లోని శివ శివాని కాలనీ, పోతాయిపల్లి, దేవరయాంజాల్ వార్డు కార్యాలయాల్లో వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గణనాథులను టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. మంటపాల నిర్వాహకుల ఆహ్వానం మేరకు టిపిసిసి ప్రధాన కార్యదర్శి గణనాథుల మంటపాలకు వెళ్లి వినాయకులకు ప్రత్యేక పూజలు చేశారు.

**అన్నదానంలో పాల్గొన్న ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి**



వినాయక చవితి సందర్భంగా శామీర్‌పేట డివిజన్‌లోని దేవరయాంజాల్, హకింపేట, ఉప్పర్‌పల్లి ప్రాంతాల్లో జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి గణనాధులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులతో కలిసి అన్నదానంలో పాల్గొన్నారు. బీమిడి జైపాల్‌రెడ్డిని యువకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.



# అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండాలి

## 'సర్' తనిఖీలో కలెక్టర్ దీపక్‌తివారి సూచన

**ప్రజాపక్షం/పరిగి :** 'సర్' ను జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి, ట్రైనింగ్ కలెక్టర్ బస్వరాజ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిగి మున్సిపాలిటిలో 'సర్' ఓటర్ల జాబితాకు సంబంధించిన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లకు ఇప్పటివరకు జారీచేసిన నోటీసులు, ఇంకా జారీ చేయాల్సిన నోటీసుల వివరాలను కలెక్టర్ బిఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయి.

జారీచేసిన నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయి. తదుపరి చేపట్టాల్సిన చర్యలు ఏమిటనే అంశాలపై అధికారుల తో సమీక్షించారు. ఓటర్ల జబితా సవరణ ప్రక్రియలో ప్రతి వివరాన్ని నిబంధనల ప్రకారం క్షుణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బిఎల్‌ఓలకు సూచించారు. జారీ చేసిన నోటీసుల వివరాలను సక్రమంగా నమోదు చేసి పెండింగ్‌లో ఉన్న నోటీసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆర్‌డిఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వాసుచంద్ర, మున్సిపల్ కమిషనర్ మల్లేశం, ఎంపిడిఓ హరిప్రియ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు ఖాకీ కవచం!

## నగరమంతా ఫ్లాగ్‌మార్చ్‌లు.. సున్నిత ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు

* నిమజ్జన రూట్లపై ప్రత్యేక నిఘా.. ట్రాఫిక్, శాంతి భద్రతలపై పోలీసుల ఫోకస్

* అపోహలు, రెచ్చగొట్టే పోస్టులపై అప్రమత్తం.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గణేష్ ఉత్సవా లు, విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు హైదరాబాద్ నగర పోలీసులు ముందస్తు భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. ఉత్సవాలు, శోభాయాత్రలు, నిమజ్జనాల సందర్భంగా భారీగా ప్రజలు రోడ్లపైకి వచ్చే నేపథ్యంలో శాంతిభద్రతలు, మత సామరస్యం, ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు అత్యంత ప్రాధాన్యమిస్తూ నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహిస్తున్నారు. సున్నితమైన ప్రాంతాల్లో పోలీసుల ఉనికిని చాటడంతో పాటు ప్రజల్లో భద్రతా భావన కల్పించడం, శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించడం ఫ్లాగ్‌మార్చ్‌ల ప్రధాన ఉద్దేశంగా పోలీసులు చెబుతున్నారు. ముఖ్యంగా నిమజ్జన శోభాయాత్రలు వెళ్లే మార్గాలు, అధిక జనసాంద్రత ఉన్న ప్రాంతాలు, గతంలో సమస్యాత్మకం గా గుర్తించిన ప్రాంతాలు, కీలక కూడళ్లలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గోషామహల్, బేగంబజార్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్ ఇందుకు నిదర్శనంగా నిలిచింది. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ పటేల్‌నగర్, దారుస్సలాం, చక్‌నవాడి, లంబిగల్లి, ఘోడేకీ ఖబర్, జిన్సీ చౌరాయి, జుమ్మెరాత్ బజార్ టీ జంక్షన్, ఓంట్‌వాడీ మసీదు, బేగంబజార్ ఛత్రి, లేబర్ అడ్డా, సెవెన్ హెవెన్ హోటల్ మీదుగా గోషామహల్ పోలీస్‌స్టేషన్ వరకు సాగింది. డిసిపి జె. రాఘవేందర్‌రెడ్డి, అదనపు డిసిపి కృష్ణగౌడ్, ఎసిపి కె.చంద్రశేఖర్‌రెడ్డి తదితర అధికారు లు, స్థానిక పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది ఇందులో పాల్గొన్నారు.



**సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా..**

గణేష్ నిమజ్జన శోభాయాత్రలు ఒకేసారి పెద్ద సంఖ్యలో ప్రజలు, వాహనాలతో సాగనున్న నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో వ్యవహరిస్తోంది. శోభాయాత్రలు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, కీలక ప్రాంతాల్లో పోలీసు బలగాలను అందుబాటులో ఉంచుతున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా బందోబస్తు ఏర్పాట్లు, రూట్ పర్యవేక్షణ, సిసిటివి నిఘా, ట్రాఫిక్ మళ్లింపులు, అత్యవసర పరిస్థితుల్లో స్పందిం చే బృందాల ఏర్పాటు వంటి చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

**శోభాయాత్రలపై క్షేత్రస్థాయి పర్యవేక్షణ..**

గణేష్ మంటపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీలు, శోభాయాత్రల నిర్వాహకులు పోలీసుల సూచనలను పాటించాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిర్ణయించిన మార్గాలు, సమయాలను పాటించడం, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకుండా చూడ టం, ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యలకు దూరంగా ఉండటం వంటి అంశాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

నిమజ్జన మార్గాల్లో ఏదైనా అనూహ్య పరిస్థితి తలెత్తితే వెంటనే స్పందించేలా పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేయనుంది. స్థానిక పోలీసులు, ఉన్నతాధికారులు, ప్రత్యేక బలగాలు కలిసి పరిస్థితిని పర్యవేక్షించనున్నాయి.

**సోషల్ మీడియాలోనూ నిఘా..**

ఉత్సవాల సమయంలో సోషల్ మీడియా ద్వారా పుకార్లు, నిర్ధారణ కాని సమాచారం, రెచ్చగొట్టే పోస్టులు వ్యాప్తి చెందకుండా పోలీసులు ప్రత్యేకంగా అప్రమత్తమవుతున్నారు. తెలియని సమాచారాన్ని నమ్మొద్దు.. ఫార్వర్డ్ చేసే ముందు ఆలోచించండి అంటూ ప్రజలకు సూచిస్తున్నారు. ఏదైనా అనుమానాస్పద సమాచారం, పుకారు లేదా శాంతిభద్రతల కు సంబంధించిన అంశం కనిపిస్తే స్వయం గా ప్రచారం చేయకుండా సమీప పోలీస్‌స్టేషన్ లేదా పోలీసు సిబ్బందికి సమాచారం ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు.


**భక్తి ఉత్సవం..బాధ్యతతోనే విజయవంతం: వి.సి సజ్జనార్**

గణేష్ ఉత్సవాలు హైదరాబాద్ నగరానికి ప్రత్యేకమైనవిగా నిలుస్తాయి. లక్షలాది మంది భక్తులు పాల్గొనే ఈ వేడుకలు ప్రశాంతంగా సాగేందుకు పోలీసుల భద్రతా ఏర్పాట్లతో పాటు ప్రజల సహకారం కూడా కీలక మే. ఒకరి వేడుకలు మరొకరికి ఇబ్బంది కలిగించకుండా, ఇతర మతాల మనోభావాల ను గౌరవిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని హైదరాబాద్ పోలీసులు కమిషనర్ వి.సి. సజ్జనార్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఫ్లాగ్‌మార్చ్‌లతో భద్రతా సంకేతం.. సున్నిత ప్రాంతాల్లో నిఘాతో భరోసా.. భారీ బందోబస్తుతో నిమజ్జనాలకు పోలీసుల సన్నద్ధత కొనసాగుతోంది. ఉత్సవాలు, నిమజ్జనాలు ప్రశాంతంగా పూర్తయ్యేలా హైదరాబాద్ నగర పోలీస్ యంత్రాంగం సమగ్ర భద్రతా ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

ప్రజాపక్షం
మహబూబ్‌నగర్
శనివారం
19-09-2026
www.prajapaksham.in

న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి.

రీల్



## 21న 'ఏందయ్యా సామీ..'

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా 'రణబాలి' సినిమా రూపొందుతోంది. అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'ఏందయ్యా సామీ..' రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు మేకర్స్. ఈ నెల 21న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ పాటను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. విజయ్, రశ్మిక పెళ్లి సందర్భంగా రిలీజ్ చేసిన 'ఏందయ్యా సామీ..' సాంగ్ ప్రోమో హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఇప్పుడీ ఫుల్ వెర్షన్ సాంగ్ కోసం ఆడియెన్స్ వేచి చూస్తున్నారు. విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న వివాహం తర్వాత కలిసి నటిస్తున్న సినిమాగా అటు వారి ఫ్యాన్స్ లోనూ, ఇటు మూవీ లవర్స్ లోనూ 'రణబాలి' సినిమా ఆసక్తి కలిగిస్తోంది. రీసెంట్ గా రిలీజ్ చేసిన ఈ చిత్ర టీజర్ మూవీపై అంచనాలు మరింతగా పెంచేసింది. చిత్రానికి కో ప్రొడ్యూసర్స్ అనురాగ్ పర్వతనేని, శివ్ చనన మ్యూజిక్ అజయ్ అతుల్, డిఓపి నీరవ్ షా, జిష్ణు భట్టాజిష్ణు భట్టాచర్జీ, రైటర్ ప్రమోద్ తమ్మినేని, ప్రొడక్షన్ డిజైనర్ శివం రావు నాగసాని, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్ ఆర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ చెంబోలు సాయి ఆదిత్య, కొరియోగ్రఫీ కృతి మహేశ్.

## మాస్ థియేట్రికల్ సినిమా

### 'ది ప్యారడైజ్' చెన్నై ప్రెస్ మీట్‌లో నాని


న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ చెన్నైలో ప్రెస్ మీట్ నిర్వహించారు. చెన్నై ప్రెస్ మీట్‌లో న్యాచురల్ స్టార్ నాని మాట్లాడుతూ . 'ది ప్యారడైజ్' 24న రిలీజ్ అవుతుంది. ప్రేక్షకులు థియేటర్‌లో మంచి మాస్ ఫిలిమిను చూడాలనుకుంటారు. అలాంటి గొప్ప మాస్ ఎక్స్పీరియన్స్ ఇచ్చే సినిమా 'ప్యారడైజ్'. ఈ సినిమా ఎంత అద్భుతంగా ఉంటుందో సెప్టెంబర్ 24న చూస్తారు. మేము ఒక మంచి కథని చాలా స్ట్రాంగ్ ఎమోషన్స్‌తో, గొప్ప మూమెంట్స్‌తో తీశాము.. చెన్నై ఎప్పుడు వచ్చినా సరే ఒక ఇంటికి వచ్చినట్టు ఫీలింగ్ ఉంటుంది. ఇక్కడ ప్రేక్షకులు నన్ను ఎంతో చక్కగా ఆదరించారు. ఈ సినిమా తమిళ్ డబ్బింగ్ క్వాలిటీ చాలా అద్భుతంగా ఉంటుంది అన్నారు. డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ సినిమాకి సపోర్ట్ చేయడానికి వచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. 24న 'ప్యారడైజ్' తమిళ్లో రిలీజ్ అవుతుంది. అందరూ థియేటర్స్‌లో చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. ఇది రెవల్యూషనరీ ఫిలిమ్. మదర్ ఎమోషన్ కూడా ఉంటుంది. తప్పకుండా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. అందరికీ థాంక్యూ. నాని ఒక రెబల్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు. తన ప్రాంతం కోసం, తన ప్రజల కోసం, తన ఉనికి కోసం, తన తల్లి కోసం ఎలా పోరాడారు అనేది ఈ సినిమా ప్రధాన అంశం. డిఓపి సాయి చాలా అద్భుతమైన కెమెరా వర్క్ ఇచ్చారు. అనిరుద్ గారి మ్యూజిక్ బ్లాక్ బస్టర్ అయ్యింది. సినిమా తప్పకుండా అందరికీ కనెక్ట్ అవుతుంది.స్వరూప్ మాట్లాడుతూ . మీ అందరూ రావడం చాలా సంతోషంగా ఉంది. మేము గతంలో 'దసరా' సినిమాతో నానితో అసోసియేట్ అయ్యాము. అలాగే ఇప్పుడు 'ప్యారడైజ్' సినిమాని తీసుకొస్తున్నాము. తప్పకుండా ఈ సినిమా థియేటర్‌లో అద్భుతంగా ఉంటుందని నమ్మకం ఉంది.



## 25న 'కళ్యాణం కమనీయం జీవితం'



వివిపై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై, ఖాన్ దురాని, సాహితి ఆవంచ హీరో హీరోయిన్స్ గా రవి లోకిరెడ్డి డైరెక్షన్ లో పైలా ప్రసాద్ రావు, కిషోర్ గుండాల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'కళ్యాణం కమనీయం జీవితం'. ఈ సినిమా ఈ నెల 25న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అయ్యింది . తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని రాజ వంశీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా 'కళ్యాణం కమనీయం జీవితం' సినిమా టీమ్ సంస్థ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు నిర్మాత పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ సినిమాని చూసిన తర్వాత సినిమా చాలా బాగుంది అని మెచ్చుకున్నారు. మంచి వ్యక్తులతో ఈ సినిమా ప్రారంభమైంది. లెజెండరీ రైటర్ విజయేంద్ర ప్రసాద్ గారు సినిమా పోస్టర్ ను, చంద్రబోస్ గారు పాటను విడుదల చేశారు వి వి వినాయక్ గారు కూడా మా ఈవెంట్ కు వచ్చి మమ్మల్ని ఆశీర్వదించారు. ఈ మూవీ మంచి ఫ్యామిలీ, యూత్ ఓరియంటెడ్ మూవీ గా మా డైరెక్టర్ తీర్చిదిద్దారు. ఈ మూవీలో నటించిన నటీనటులు ది బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ ఇచ్చారు. శ్రీ మురళి కార్తికేయ మంచి పాటలను, సంగీతాన్ని అందించారు. ఈ నెల 25న సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాము. మూవీ చిన్నదైనా కంటెంట్ చాలా పెద్దది. డైరెక్టర్ రవి లోకిరెడ్డి, రైటర్ అరవింద్ ఏకలవ్య మంచిగా సినిమాని తీర్చిదిద్దారు. ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మకం ఉంది అని అన్నారు.డైరెక్టర్ రవి లోకిరెడ్డి, హీరో ఖాన్ దురాని, హీరోయిన్ సాహితి ఆవంచ తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్', 'మిరాయ్' చిత్రాలతో పాన్‌ఇండియా విజయం సాధించిన సూపర్ హీరో తేజ సజ్జ, ప్రస్తుతం 'జాంబీ రెడ్డి 2 NXT LVL' గా వస్తున్న 'జోంబీ రెడ్డి' సెకెండ్ పార్ట్‌లో నటిస్తున్నారు. 'జాంబీ రెడ్డి' క్రియేటర్ ప్రశాంత్ వర్మ ఈ సీక్వెల్‌కు క్రియేటర్‌గా, సుపర్ణ్ ఎస్ వర్మ దర్శకుడిగా చేస్తున్నారు. 'హక్', 'రానా నాయుడు', 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' వంటి ప్రశంసలు అందుకున్న ప్రాజెక్ట్స్‌తో పాటు పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లోకు రచయితగా పనిచేసిన సుపర్ణ్ ఎస్. వర్మ.. ఈ ఫ్రాంచైజ్‌కు తనదైన ఇంటెన్స్ టచ్‌ను తీసుకొస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తేజ సజ్జా, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. గతంలో వీరి కాంబినేషన్‌లో 'మిరాయ్' బ్లాక్ బస్టర్ అయ్యింది. తేజ సజ్జా పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'జాంబీ రెడ్డి 2' టైటిల్ అనౌన్స్మెంట్ వీడియోకు సెన్సేషనల్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో రియల్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తుండగా.. షనాయా కపూర్ ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయం కానున్నారు. ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఉపేంద్రను ఇంతకుముందెన్నడూ చూడని వైల్డ్, ఫియర్స్, లార్జర్ దెన్ లైఫ్ అవతార్‌లో ప్రజెంట్ చేశారు. భారీ చెట్టు కొమ్మకు తలకిందులుగా వేలాడుతూ.. ఒక చేతిలో పొడవైన ఆయుధాన్ని పట్టుకుని కనిపించారు. రఫ్ లుక్, విరబోసుకున్న జుట్టు, ఇంటెన్స్ ఎక్స్ప్రెషన్‌తో ఈ క్యారెక్టర్ ఎవరు? అనే ఆసక్తిని పెంచుతున్నారు.

## ఉపేంద్ర ఫస్ట్ లుక్ రిలీజ్

## 'మగాళ్లు జిందాబాద్' టైటిల్ లాంచ్



గోల్డెన్ ఆర్క్ ప్రొడక్షన్ బ్యానర్ పై ప్రసాద్ భాస్కర్ల, చైతన్య వంగవరపు నిర్మాతలుగా యంగ్ హీరో శ్రీ నందు, స్టార్ కమెడియన్స్ వెన్నెల కిషోర్, వైవాహర్ష నటిస్తున్న తాజా చిత్రం మగాళ్లు జిందాబాద్. నార ప్రవీణ్ రచన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం టైటిల్ అనౌన్స్మెంట్ ఈవెంట్ ఘనంగా జరిగింది. అనిల్ రావిపూడి శిష్యుడిగా నారా ప్రవీణ్ సినిమా టైటిల్ తోనే తన ప్రత్యేకతను చాటుకున్నారు. కామెడీ కంటెంట్‌లకు మంచి ఆదరణ దక్కుతున్న ఈ సమయంలో అద్భుతమైన టైటిల్, అంతే వినోదభరితమైన కంటెంట్ తో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు త్వరలో రానుంది. డైరెక్టర్ నార ప్రవీణ్ మాట్లాడుతూ.. ఇదొక సెటైరికల్ కామెడీ ఫిలిం అని అందుకోసమే మగాళ్లు జిందాబాద్ అనే టైటిల్ పెట్టామని పేర్కొన్నారు. సొసైటీలో ఆడవారికి దక్కే కంఫర్ట్ గాని, న్యాయం కానీ, సింపతీ కానీ మగాడికి దక్కట్లేదు అనే టాపిక్ ను సెటైరికల్ టోన్ లో డీల్ చేస్తూ ఔట్ అండ్ ఔట్ కామెడీ జనరేట్ చేశాం అని ,ఇది ఒక సోషల్ సెటైరికల్ మూవీ అని చెప్పారు. దీని మీదే ఈ సినిమా చాలా ఆహ్లాదకరమైన కామెడీతో సాగుతుందని వెల్లడించారు.హీరో శ్రీ నందు మాట్లాడుతూ మగాళ్లు జిందాబాద్ ఈ టైటిల్ చాలామందిలో ఆలోచనలను రేకెత్తిస్తుంది. మరికొందరికి నవ్వు తెప్పిస్తుంది. ఆడవాళ్లను డామినేట్ చేయడానికి ఈ టైటిల్ పెట్టలేదు. మగవాళ్ళ భావాలు, బాధలు, కష్టాలు చెప్పుకోవడానికి చాలా మంది ఆలోచిస్తారు. అలాంటి వారి కోసమే ఈ టైటిల్ అనే హీరో శ్రీ నందు తెలిపారు. మరీ ముఖ్యంగా సమాజంలో ఎదురవుతున్న అనేక సవాలను ఎదుర్కొనే నిలబడుతున్నందుకు మగాళ్లు జిందాబాద్ అంతేకానీ ఆడవాళ్లను తక్కువ చేయడం కాదు, ఆడవాళ్లు ఎప్పుడూ గ్రేట్ అందుకే ఆడవాళ్లు జోహార్ అని అన్నారు. నిజ జీవితంలో మగవాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను సినిమాలో వినోదభరితంగా చూపించడం కోసమే ఈ సినిమా అని ఆరేళ్ల నుంచి 60 ఏళ్ల వరకు కుటుంబ సమేతంగా హాయిగా నవ్వుకునే సినిమాని తెలిపారు. నిర్మాత ప్రసాద్ భాస్కర్ల తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ రేట్లు రూ.33కు పెంచాలి

### ప్రభుత్వ గోడౌన్‌లు నిర్మించి ప్రైవేట్ దోపిడీని అరికట్టాలి: ఎస్.బాల్‌రాజ్




ప్రజాపక్షం/హైదరాబాద్: సివిల్ సప్లయిస్ హమాలీల హమాలీ రేట్లను రూ.33కు పెంచడంతో పాటు బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. వేలాది మంది హమాలీ కార్మికులతో శుక్రవారం సివిల్ సప్లయిస్ భవన్‌ను ముట్టడించి మహాధర్నా నిర్వహించారు. హమాలీ రేట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలుగా కాకుండా ప్రతి నెలా ఒకటో తేదీన ఒకేసారి చెల్లించాలని బాల్‌రాజ్ కోరారు. 350 కిలోల బరువున్న బెల్స్‌ను ఎనిమిది మంది కలిసి లారీల్లోకి ఎత్తుతున్నందున ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.50ను రూ.200లకు పెంచాలని డిమాండ్ చేశారు. హమాలీలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. మహిళా స్వీపర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, 30 ఏళ్లపాటు పనిచేసి రిటైరైన హమాలీలకు పిఎఫ్, పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దసరా సందర్భంగా ఇచ్చే యూనిఫాం, కుట్టుకూలీ, బోనస్‌ను నెల రోజుల ముందుగానే చెల్లించాలని కోరారు. అన్ని మండల పాయింట్లలో ప్రభుత్వ సొంత గోడౌన్‌లు నిర్మించి ప్రైవేట్ యాజమాన్యాల దోపిడీని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా అనంతరం సివిల్ సప్లయిస్ అధికారులు హమాలీలతో చర్చలు జరిపారు. గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం అక్టోబర్ 5లోపు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నా ముగిసింది. చర్చల్లో ఎఐటియుసి నాయకులు వై. ఓమయ్య, మునీశ్వర్, కడారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

### ట్రాన్స్‌కో ఉద్యోగి కుటుంబానికి

## రూ.కోటి బీమా భరోసా

### రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జూనియర్ లైన్‌మన్ కుటుంబానికి పరిహారం చెక్కు అందజేసిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన టిజి ట్రాన్స్‌కో ఉద్యోగి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) శాలరీ ప్యాకేజీ కింద అందించే ప్రమాద బీమా ద్వారా రూ.1 కోటి పరిహారం మృతుడి కుటుంబానికి అందింది. అసెంబ్లీలోని తన చాంబర్‌లో ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మృతుడి తల్లి, నామినీకి బీమా చెక్కును అందజేశారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులోని 132 కెవి సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మన్‌గా పనిచేస్తున్న మహమ్మద్ ముజాహిద్ (26) 2025 నవంబర్ 5న నైట్ షిఫ్ట్ ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో కుటుంబానికి తీవ్ర విషాదం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం, ట్రాన్స్‌కో ఉద్యోగులకు ఎస్‌బిఐ శాలరీ ప్యాకేజీ కింద కల్పిస్తున్న ప్రమాద బీమా పథకానికి అనుగుణంగా మృతుడి కుటుంబ సభ్యులు 2026 ఫిబ్రవరిలో బీమా క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. శాఖాపరమైన ప్రక్రియను అధికారులు వేగవంతం చేసి, క్లెయిమ్‌ను పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆగస్టు 20న రూ.1 కోటి పరిహారం మృతుడి తల్లి ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. తాజాగా అసెంబ్లీలోని తన చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క బీమా చెక్కును మృతుడి తల్లికి అందజేశారు. ఉద్యోగి కుటుంబానికి సంక్షోభ సమయంలో బీమా పరిహారం ఆర్థిక భరోసాగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

### రిటైర్డ్ ఆర్‌టిసి ఉద్యోగుల ప్రయోజనాలపై..

## శాసనసభలో చర్చకు కూనంనేని వాయిదా తీర్మానం

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆర్‌టిసిలో దశాబ్దాల పాటు సేవలు అందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్‌ను వెంటనే అందజేయాలని సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన శాసనసభలో వాయిదా వేయాలని కోరుతూ నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఆర్‌టిసి ఉద్యోగులు తమకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల కోసం ఆర్‌టిసి కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా ప్రాముఖ్యత కలిగిన ఈ అత్యవసర అంశంపై శాసనసభలో చర్చించి, బాధితులకు తక్షణమే రావాల్సిన సొమ్మును అందించాలని కోరారు. అయితే ఈ వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు.

## అరుణ ఉత్సవం (మొదటి పేజీ తరువాయి)

మైలురాయిగా నిలిచింది. ఐక్యతకు పిలుపునిచ్చింది. కార్యక్రమం ముగింపును సూచిస్తూ 40,000 మంది ముఖ్యంగా యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఫ్రాన్స్ జాతీయ గీతం 'లా మార్సెలైస్' కోసం స్వరం కలిపారు. ప్రపంచ సోషలిస్ట్ ఉద్యమ గీతం 'ఎల్'ఇంటర్నేషనల్' ఆలపించారు. వడు రోజుల రాజకీయసాంస్కృతిక ఉత్సవాన్ని 'ఎల్' హ్యూమానిటే' దినపత్రిక నిర్వహించడం ఆనవాయితీ.

## నేతలు పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయక్షేత్రంలోని 13.12 ఎకరాల భూమి కేటాయింపులు సిద్దిపేట ఆర్డీఓ సదానందం, ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న గోబెల్ ప్రచారానికి ఫులిస్టాప్ పెట్టడానికే ఇక్కడికి వచ్చామని తెలిపారు. అప్పటి నీటి పారుదశాఖ మంత్రి హరీష్ రావు రంగనాయకసాగర్ నిర్మాణంలో భాగంగా 2 వేల 212 ఏకరాల భూ సేకరణకు నోటిఫికేషన్ విడుదల చేసి 2 వేల 183 ఏకరాల భూమిని ఎందుకు సేకరించారని మిగితా భూమిని నోటిఫికేషన్ నుంచి ఎందుకు తొలిగించారని ప్రశ్నించారు. రంగనాయకసాగర్ నిర్మాణం కోసం సేకరించిన భూమిలోంచి సుడాకు 10 ఏకరాలు ఏలా కేటాయిస్తారని ప్రశ్నించారు. సుడా పార్కు పక్కనే హరీష్ రావు 13 ఏకరాల 12 గుంటల స్థలం కొనుగోలు చేసి ఫాం హౌస్ నిర్మించుకున్నారని తెలిపారు. రంగనాయకసాగర్లో భూ నిర్వాసితులకు ఏకరాకు రూ.6 లక్షల నుంచి రూ.13 లక్షలు చెల్లించిన ప్రభుత్వం హరీష్ రావు కొనుగోలు చేసిన భూమికి ఏకరాకు రూ.2 లక్షలు చెల్లించడం వెనుక అంతర్యమేమిటన్నారు. పక్కనే రంగనాయకసాగర్ పెట్టుకొని రైతులు, రూ.6 లక్షల నుంచి రూ.13 లక్షలకు ఇవ్వాల్సిన భూమికి హరీష్‌రావు కేవలం రెండు లక్షలు చెల్లించడం పై ఈడి విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. హరీష్ రావు హౌస్ పక్కనే సుడా పార్కు ఎందుకు నిర్మించారని ఇక్కడికి ఎవరూ వస్తారని ప్రశ్నించారు. దీనికి తోడు ఎలాంటి టెండర్ పిలువకుండా ఫాం హౌస్కు రూ.5 కోట్ల 33 లక్షలతో బిటి రోడ్డు నిర్మించుకున్నారని తెలిపారు. బిటి రోడ్డు నిర్మాణం ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో చేయించడం విచిత్రంగా ఉందన్నారు. బిఆర్‌ఎస్ యకుల అవినీతి తెలంగాణ సమాజానికి తెలియల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మిగులు బడ్జెట్లో ఉన్న రాష్ట్రం బిఆర్‌ఎస్ నాయకుల అవినీతి మూలంగానే అప్పుల పాలైందన్నారు. పర్యటనలో భాగంగా రంగ నాయకసాగర్కు సేకరించిన భూమి, హరీష్‌రావు రైతుల నుంచి కొనుగోలు చేసిన భూమి సర్వేనంబర్లతో సహా ఎకరాకు ఎంత చెల్లించారని, భూ సేకరణకు రైతులకు ఎంత పరిహారం చెల్లించారని అడిగి తెలుసుకున్నారు. హరీష్‌రావు భూ భాగోతం ప్రజలకు తెలియ చేయటమే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. అలాగే కెటిఆర్ జన్వాడ ఫాంహౌస్‌ను స్థలాలను సైతం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తామన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియచేయటమే తమ లక్ష్యమన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు వ్యవసాయక్షేత్రం పౌంహౌస్ వద్ద భారీ పోలీసు బలగాలను మొహరించారు.

### ఎర్రవల్లి భూములపై రెవిన్యూ సర్వే ముమ్మరం

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని మాజీ సిఎం కెసిఆర్ వ్యవసాయ క్షేత్రం పరిసర భూముల వ్యవహారం మరోసారి రాజకీయ, పరిపాలనా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సర్వే నెంబర్ 325లో ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంటున్న సుమారు 388 ఎకరాల భూములపై రెవిన్యూ అధికారులు క్షేత్రస్థాయి సర్వే రికార్డుల పరిశీలన చేసి భూ సర్వేను ముమ్మరం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనల నేపథ్యంలో ఈ విచారణ ప్రారంభమైంది. భూముల అసలు స్వరూపం, ప్రభుత్వం భూమి ఎంత, అసైన్డ్ భూములు ఎంత, ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి అనే అంశాలపై రెవిన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. మర్కూక్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ అధ్వర్యంలో అధికారులు పాత రికార్డులను పరిశీలించడంతో పాటు ఎర్రవల్లి, శివారు వెంకటాపూర్, వర్ధరాజ్‌పూర్ పరిధిలోని సర్వే నంబర్ల వివరాలను సేకరిస్తున్నారు. భూముల సరిహదులు, రికార్డుల్లోని వివరాలు, ప్రస్తుత భౌతిక పిరిస్థితిని సరిపోల్చే ప్రక్రియ కూడ కొనసాగుతుంది. ఈ క్రమంలో గురువారం ప్రారంభమైన రికార్డుల పరిశీలన, భూ సర్వే రెండవ రోజు కొనసాగింది. శుక్రవారం భూ సర్వే కోసం ఐదు బృందాలుగా ఎర్పడిన సర్వే అధికారులు ఆర్డీఓ చద్రకళతో ఒక బృందం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తుండగా మరో నాలుగు బృందాలు భూ సర్వే జిల్లా అధికారి ఆధ్వర్యంలో భూ సర్వేకొనసాగిస్తున్నారు. శాటిలైట్ చిత్రాలు,పాత రికార్డుల పరిగణలోకి తీసుకుంటున్నారు. అధికారుల తుది నివేదిక వచ్చిన తర్వాతే భూముల వాస్తవ పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచన వేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎర్రవల్లి గ్రామానికి చెందిన రైతులు సర్వేను వ్యతిరేకిస్తున్నారు. సర్వే నంబర్ 325లోని 388 ఎకరాలను 150 మందికి పైగా రైతులు దశాబ్ధాలుగా సాగు చేస్తున్నారని వారు చెబుతున్నారు. ఈ భూములు తమ ఆధీనంలోనే ఉన్నాయని , ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ భూ సర్వే పూర్తిచేసేందుకు మరో రెండు మూడు రోజులు సమయం పట్టే అవకాశం కన్పిస్తుంది.

## నేడు పార్టీ చోరీ...

(మొదటి పేజీ తరువాయి)

కానీ దానికి విరుద్ధంగా ప్రజల తీర్పును తారుమారు చేసే శక్తులకే అది సహకరిస్తోందని మండిపడ్డారు. 'ముందు శివసేన, తర్వాత ఎన్‌సిపి, ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్. ప్రతిసారీ ఒకే తరహా విధానం ఒక పార్టీని చీల్చడానికి బిజెపి, ఎన్నికల సంఘం చేతులు కలుపుతున్నాయి. ఆ తర్వాత ఆ పార్టీ ఎన్నికల గుర్తును లాగేసుకుంటున్నారు' అని రాహుల్ గాంధీ శుక్రవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఒక పార్టీనే పూర్తిగా దొంగిలించగలిగినప్పుడు, కోట్ల మంది భారతీయుల ఓట్లను కూడా దొంగిలించగలరని, ఇందులో ఆశ్చర్యం ఏముందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ప్రశ్నించారు. 'ఓట్ల దొంగతనం. ప్రభుత్వ దొంగతనం. ఇప్పుడు పార్టీ దొంగతనం ఇవి మన ప్రజాస్వామ్య పతనానికి చిహ్నాలుగా మారాయి అని అన్నారు. కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా మాట్లాడుతూ, ఒకవైపు మోదీకి అపారమైన ప్రజాదరణ ఉందని బిజెపి నమ్మించాలని చూస్తోందని, మరోవైపు ఎన్నికల నిధులు, నియోజకవర్గాల పునర్విభజన, ఓటర్ల జాబితాలు, రాజకీయ పార్టీలు, మొత్తం ఎన్నికల వ్యవస్థను తమ గుప్పిట్లోకి తీసుకోవడానికి ఎన్నికల సంఘాన్ని (ఇసిఐ) వాడుకుంటోందని అన్నారు. 'ఈ వైరుధ్యాన్ని ఎవరూ విస్మరించలేరు. వారు ఎంతో ఆత్మవిశ్వాసంతో గొప్పలు చెప్పుకుంటారు. ఫోటో అవకాశాలు, భారీ ర్యాలీలు, ఇన్‌ఫ్లుయెన్సర్ సదస్సులు, డబ్బు చెల్లించి చేయించుకునే ప్రచారం, సినిమాలు, డాక్యుమెంటరీలు... ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ వారి దగ్గర ఉన్నాయి. అయినప్పటికీ, తమ ప్రజాదరణే తమ గురించి మాట్లాడుతుందని బిజెపి నమ్మడం లేదు. ఎన్నికల సంఘం అండతో వెనుక ద్వారం గుండా అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తోంది' అని ఖేరా ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. అది ధైర్యవంతుల లక్షణం కాదని ఆయన అన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ, ఒకప్పుడు ప్రపంచ వ్యాప్తంగా గౌరవం పొందిన భారత ఎన్నికల సంఘం, ప్రస్తుతం నియంతృత్వ దేశాల్లోని సంస్థల మాదిరిగా వ్యవహరిస్తోందని అన్నారు. 'భారత ప్రజలు దీనిని శాశ్వతంగా అంగీకరిస్తారని బిజెపి, ఎన్నికల సంఘం లోని అధికారులు ఎందుకు అనుకుంటున్నారు? న్యూటన్ చలన నియమాలలో మూడవ నియమాన్ని గుర్తుంచుకోండి' అని గొగోయ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల గుర్తును స్తంభింపజేస్తూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం పూర్తిగా తప్పు అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేట్ అన్నారు. 'తృణమూల్ నుండి విడిపోయిన వర్గానికి ఎటువంటి రాజ్యాంగపరమైన ప్రాతిపదిక లేదు. ఈ ఏక పక్ష ధోరణి ప్రజాస్వామ్యానికి, దేశానికి ప్రమాదకరం' అని ఆమె అన్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటం అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భూపేష్ బఘేల్ అన్నారు.

### టిఎంసి పేరు, గుర్తు స్తంభన మోదీకి జ్ఞానేష్ కుమార్ గిఫ్ట్

ఎఐటిసి పేరు, గుర్తును స్తంభింపజేయడం సిఇసి జ్ఞానేష్ కుమార్ ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన 'అర్ధరాత్రి పుట్టినరోజు బహుమతి' అని కూడా కాంగ్రెస్ పేర్కొంది. ఈ పరిణామంపై కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ గురువారం రాత్రి స్పందిస్తూ 'బిజెపి అత్యంత రాజ్యాంగ విరుద్ధంగా పార్టీని చేజిక్కించుకున్న తర్వాత, ఎఐటిసి పేరు, గుర్తును స్తంభింపజేయడం అనేది సిఇసి జ్ఞానేష్ కుమార్ మోదీజీకి ఇచ్చిన అర్ధరాత్రి పుట్టినరోజు కానుక. మమతా బెనర్జీ నాయకత్వంలో బిజెపికి వ్యతిరేకంగా పోరాడిన వారికే, ఇప్పుడు ఆమెపై తిరుగుబాటు చేయడానికి, ఇసిఐ సహాయంతో రాజ్యాంగ విరుద్ధమైన ఫిరాయింపులకు పాల్పడటానికి ఎర్ర తివాచీ పరిచి ఆహ్వానిస్తున్నారు' అని అన్నారు. ఇసిఐ అనేది కేవలం బిజెపి చేతిలో కీలుబొమ్మ అని, ప్రజాస్వామ్యాన్ని అంచెలంచెలుగా నాశనం చేసే సాధనం అని అది మరోసారి రుజువు చేసిందని వేణుగోపాల్ ఆరోపించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com